
# సినీ ప్రొజెక్టర్లు

## పర్మనెంట్ & టూరింగ్ సినిమాలకి అనువైనవి.




రెడీస్టాకులో దొరకును

★

## విక్టోరియా IV. బి

### ఇటాలియన్ ప్రొజెక్టర్

25 వాట్స్. ఆంప్లిఫైయర్
2 స్పీకర్స్‌తో రూ 11,500 వికరం.
45 వాట్స్ ఫెడీ. ఆంప్లిఫైయర్ &
స్పీకర్స్ కావలసివుంటే
చార్జీలు అదనం.

## మైక్రోన్ XI. బి

(ఇటాలియన్)

పూర్తిసెట్ సరసమైన ధరలకు
దొరకును.

## ఫెడి వి / ఆర్ 5 (ఇటాలియన్)

హై ఇంటెన్సిటీ ఆర్క్-హౌస్‌తో సరసమైన ధరకు దొరకుతుంది.

ఇంకా: కన్వర్టర్లు, డైనమోలు, ఆయిల్ ఇంజన్లు & మోర్గనైట్ ఇంగ్లీషు
కార్బన్లుకూడా దొరకును.

డైరెక్ట్ ఇంపోర్టర్లు:

## మెసర్స్. దేవీ ఫిలిమ్స్ లిమిటెడ్.,

498, మింట్‌స్ట్రీట్ : : మదరాసు - 3.

# జామా ఆయిల్

REGISTERED




TRADE MARK

మీ బాధ ఎంత దుర్భరమైనా, దీర్ఘకాలంగావున్నా కొన్ని చుక్కలు

**జామా ఆయిల్**

రుద్దితే కొద్ది నిమిషాలలో బాధ తొలగిపోతుంది. ఈ అద్భుతసాధనాన్ని వాడి చూడండి!

**అమర్‌చంద్ శోభాచంద్**

కెమిస్ట్సు అండ్ డ్రగ్గిస్టులు

95, నైనియప్పనాయక్ వీధి : పి. టి. మద్రాసు



## ఈస్ట్ & వెస్ట్ ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి

[1913లో స్థాపితము]

ప్రధానకార్యాలయం: 'ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

34 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి
పెంపొందిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమా సంస్థ.
ఆర్థికంగా సుస్థిరమై, పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ
వ్యవహరించుటలో సంస్కారానికి పేరెన్నికగన్న సంస్థ.
1944లో జరిపిన అదనపు వ్యాపారం కోటి రూపాయలు మించింది.
చురుకైనటువంటిన్నీ, పలుకుబడి కలిగినటువంటిన్నీ వ్యక్తులు
ఏజన్సీలకొరకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

వివరాలకు:

శ్రీ జె. యస్. రెడ్డి, బ్రాంచి సెక్రటరీ, 377, ఎస్ప్లనేడ్, మద్రాసు.

శ్రీ వి. ఎ. నాగరెడ్డి, చీఫ్ ఏజంటు, రాయలసీమ ఏరియా, విక్టోరియాపేట, అదోని.

శ్రీ యస్. మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజవాడ.

# ఆంధ్రబ్యాంక్ లిమిటెడ్

**స్థాపితము: 1923**

## హెడ్డాఫీసు - మచిలీపట్టణము

| | | |
|---|---|---|
| అధికారము పొందబడిన మూలధనము | — రు. | 1,00,00,000 |
| చందా వేయబడి, జారీచేయబడిన మూలధనము | — రు. | 50,00,000 |
| చెల్లింపబడిన మూలధనము | — రు. | 25,00,000 |
| రిజర్వు ఫండు | — రు. | 8,45,260 |
| డిపాజిట్లు | — రు. | 4,20,00,000 |
| అమలులోనున్న వ్యాపారము మొత్తము | — రు. | 5,00,00,000 |

మదరాసు బ్రాంచి: బాంబే మ్యూచుయల్ బిల్డింగు, 378, ఎస్ప్లనేడు.

### ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు:

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరం, బరంపురం (గంజాం), గూడూరు (నెల్లూరుజిల్లా), ఒంగోలు, చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్ పేట (గుంటూరు), గవర్నరుపేట (విజయవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, రామరావుపేట (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి, చికాకోలు (వైజాగ్), జయపూరు (ఒరిస్సా), పెద్దాపురం, అమలాపురం, ఆముదాలవలస, తిలారు, సాలూరు, పెడన, చల్లపల్లి (కృష్ణా), మహారాణిపేట (వైజాగ్), జగ్గయ్యపేట (కృష్ణా), గొల్లప్రోలు (తూ. గో. జిల్లా.)

ఫిక్సెడ్ డిపాజిట్లు: నూరురూపాయలకు తక్కువకాని మొత్తములను 3, 6, 12, 24 మాసములకు అన్ని బ్రాంచీలలోను తీసుకొనబడును.

3 సంవత్సరముల క్యాషు సర్టిఫికేట్లు యీ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము. అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండు వారంట్లు, హుండీలు, వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటు పత్రములు, షేర్లుకొనుట, అమ్ముట మొదలగు వ్యాపారములుకూడ చేయబడును. వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

**వారణాశి కృష్ణమూర్తి,**
ఎం.ఏ., బి.కాం., ఎల్.ఎల్.బి., సి.ఏ.ఐ.ఐ.బి.
జనరల్ మేనేజరు.

**తాడేపల్లి శ్రీరాములు,**
మేనేజింగ్ డైరెక్టరు.

# యువ ప్రచురణలు

మా ప్రచురణలు హిగిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సులోనూ, వెంకట్రామా అండ్‌కో అన్ని బ్రాంచీలలోనూ, శేషు అండు కో, తెనాలి వారి వద్దనూ ఇంకా పెద్దపుస్తక విక్రేతలందరివద్దా దొరుకుతవి. లేనియెడల మాకు వ్రాయండి. 6-0-0 విలువగల పుస్తకములు ఒకేసారి తెప్పించినవారికి పోస్టు ఖర్చులు మేమే భరించిపంపుతాము.

పూర్తి కేటలాగుకి మాకు వ్రాయండి.

## శరత్ బాబువి

| | | |
|---|---|---|
| వాగ్దత్త | [నవల] | 1-12-0 |
| సుభద | ,, | 1- 8-0 |
| దేవదాసు | ,, | 1- 8-0 |
| పల్లీయులు | ,, | 1- 8-0 |
| నవవిధాన్ | ,, | 1- 0-0 |
| చంద్రనాథ్ | ,, | 1- 0-0 |
| పరిణీత | ,, | 0-12-0 |
| బడదీదీ | ,, | 0-12-0 |
| పతివ్రత | ,, | 0-12-0 |
| హేమాంగిని | ,, | 0-12-0 |
| నిష్కృతి | ,, | 0-12-0 |
| మావారు | ,, | 0-12-0 |
| కాశీనాథ్ | ,, | 0-12-0 |
| మహేశుడు | [కథలు] | 0-12-0 |
| నారీర్‌మూల్య | [వ్యాసం] | 0-12-0 |
| నవిత | | 3- 0-0 |
| భైరవి | | 2- 8-0 |
| అరక్షణీయ | | 1- 4-0 |

## యువ బుక్ డిపో

గవర్నరుపేట
బెజవాడ

37, ఆచారప్పన్ వీధి
మద్రాసు

# చ లం

| | | |
|---|---|---|
| స్త్రీ | | 2- 0-0 |
| ప్రేమలేఖలు I | | 1-12-0 |
| ప్రేమలేఖలు II | | 1- 8-0 |
| బిడ్డలశిక్షణ | | 1- 8-0 |
| విషాదం | | 1- 0-0 |
| ఆనందం | | 1- 0-0 |
| చిత్రాంగి | [నాటకం] | 1- 8-0 |
| త్యాగం | .. | 1- 8-0 |
| మంగమ్మ | .. | 1- 0-0 |
| జయదేవ | .. | 1- 0-0 |
| శశాంక | .. | 1- 0-0 |
| సావిత్రి | .. | 0-12-0 |
| సత్యం, శివం, సుందరం | .. | 1- 4-0 |
| నాటికాగుచ్ఛం | | 1- 4-0 |
| కర్మమిట్లా కాలింది | [కథలు] | 1- 8-0 |
| కన్నీటికాలవ | .. | 0-12-0 |
| పాపం ! ! ! | .. | 0-12-0 |
| దైవమిచ్చిన భార్య | [నవల] | 1- 8-0 |
| మైదానం | .. | 1- 0-0 |
| అమీనా | .. | 1- 0-0 |
| వివాహం | .. | 1- 0-0 |
| బ్రాహ్మణీకం | .. | 0-12-0 |
| అరుణ | .. | 0-12-0 |
| హంపీకన్యలు | .. | 0-12-0 |
| అదృష్టం | | 1- 0-0 |
| వాళ్లు నలుగురూ | | 0-12-0 |
| ఆనాపీలర్ | [సౌరీస్] | 0-12-0 |

# యువ

విద్యార్థుల మాస పత్రిక

★

సాలుచందా: 3-0-0

విడి ప్రతి: 0-4-0

★

ఆఫీసు

37, ఆచారప్పన్ వీధి

మద్రాస్-1.



డోంగ్రేగారి

## బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, పండ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు నిలిపి, బలమును, ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4

# భారతప్రశస్తి




స్త్రీల ఆరోగ్య భాగ్యానికి

## లోధ్ర

కేసరికుటీరం లిమిటెడ్, మద్రాస్

EASTERNS.394

ఒరిస్సా, నైజాము, ఆంధ్ర, తమిళజిల్లాలకు

ఏజెంట్లు:

శ్రీ సీతారామ జనరల్ స్టోర్సు,

బరంపురం, సికింద్రాబాదు, బెజవాడ, మధుర.

## 3 కోట్ల ఆంధ్రులకు 3 ఉత్తమ పత్రికలు

నేడే చందాదారులుకండి!

# చందమామ

పిల్లలకు

సాలుచందా 5-0-0

రెండేండ్లకు 9-0-0

# యువ

యువ విద్యార్థులకు

సాలుచందా 3-0-0

రెండేండ్లకు 5-0-0

# ఆంధ్రజ్యోతి

పెద్దలకు


సాలుచందా 5-8-0

రెండేండ్లకు 10-0-0

ఆఫీసు

పోస్టు బాక్సు నెం. 1686 :: మద్రాసు-1

## అదేమీ ఇంద్రజాలం కాదు..




## సబ్బు మాత్రమే

మేము దానిని గురించి ఉన్నదున్నట్లుగానే చెబుతాము. ఈ ప్రకటనద్వారా మేము అమ్మవలసిన దల్లా భాగ్యవంతులకూ బీదవారికీ ఒకే మాదిరి అందుబాటులో ఉండే ఒక మంచి రకపు సబ్బు మాత్రమే. కాంతి సబ్బు మీకు సౌదర్యం, ప్రణయం, ఇంకా అనేక ఇతర విషయాలూ ఇస్తుందని మేము వాగ్దానం చెయ్యబోవటం లేదు.

కాని "కాంతి సబ్బు మనోహరమైన పరిమళంగలది. ఎంత సున్నితమైన చర్మాన్నయినా చెరుపుచెయ్యదు." అని మాత్రం మేము యదార్థంగా చెప్పగలం.

స్వస్తిక్ వారి శ్రేష్ఠమైన ఇతర వస్తువులలో కొన్ని : శికాయ సబ్బు, పరిమళ ఆముదం, స్వస్తిక్ షేవింగ్ స్టిక్, బట్టల సబ్బులు, గోవాలిన్ బ్రాండు వనస్పతి మొదలయినవి.



# కాంతి సబ్బు

నాణ్యతకు సాటిలేనిది.

SHILPI

Som. 16—Telugu

స్వస్తిక్ ఆయిల్ మిల్సు లిమిటెడ్, బొంబాయి.

ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 10] ఆగస్టు, 1948 [సంచిక 2

# స్వాతంత్ర్య దినము

రేపు ఆగస్టు 15 వ తేదీన మనం రెండవ స్వాతంత్ర్య దినం చేసుకో బోతున్నాము. మనం స్వాతంత్ర్యం అనుభవించిన ఈ సంవత్సరంలో స్వాతంత్ర్యం అనుభవించామనే ఆనందంతోపాటు అనేక కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. ప్రపంచ చరిత్రలోనే తార్కాణం దొరకనంతటి పెద్ద ఎత్తున మనం వలససమస్య ఎదుర్కోవలసి వచ్చింది. ఎదుర్కొన్నాము– 40 లక్షల శరణార్థులను ఇండియన్ యూనియన్‌లోనికి తీసుకొచ్చాము. 600 స్వదేశ సంస్థానాలను యూనియన్‌లో కలుపుకున్నాము. ఇవి మనం సాధించిన ఘనకార్యాలు. ఇంకా సాధించవలసినవి ఎన్నో ఉన్నవి! హైదరాబాదు సమస్య, కాశ్మీరు సమస్య, యూనియన్‌లో ముస్లిముల సమస్య. వీటిని మన సమస్యలుకాకుండా అంతర్జాతీయ సమస్యలుగా చేయటానికి చర్చిల్ మొదలగు టోరీ ప్రముఖులు పాటుపడుతున్నారు! ఇందులో కాశ్మీరు సమస్యను చేశారుకూడా. కాని ఇక యూనియన్ నాయకులు వారివలలో పడేట్టులేరు. ఈ విషయం మొన్న మద్రాసులో పండిత జవహర్‌లాల్ నెహ్రూగారు స్పష్టంగా చెప్పారు. హైదరాబాదు ఇండియన్ యూనియన్‌తో చేరకపోతే దాని నామరూపాలు ఉంటాయో లేదో కూడా చెప్పలేనన్నారు. పాకిస్థాన్ అబద్ధాల పునాదిమీద నిలిచిం

దన్నారు. మద్రాసులో కొన్ని ముస్లిం పత్రికలు, ముస్లింలీగు ప్రసక్తి తెచ్చి ఇలాంటివాటికి ఇండియన్ యూనియన్‌లో స్థానం లేదన్నారు! మరి మద్రాసు ప్రభుత్వం ఇన్నాళ్ళనించీ కళ్లు మూసుకుని వీటిని ఎలా సహిస్తున్నది?

* * *

దీనికి తార్కాణగా బెజవాడ నూరుద్దీన్ కేసు ఒకటి. అతన్ని ఒకసారి నైజాముకు సహాయం చేస్తున్నాడని పట్టుకున్నారు; మళ్లీ వదిలారు; మళ్లీ ప్రజలు గోలచేయగా పట్టుకున్నారు. ఈ నూరుద్దీనూ, ఒక జమీందారూ కలసి మొదటి కాంగ్రెస్ మినిస్ట్రీ ఫారం కావటానికి 80 వేల రూపాయల దాకా పెట్టుబడి పెట్టారనీ, దానికిగాను అడవుల కాంట్రాక్టులూ మొదలైనవి సంపాయించి, పెట్టుబడితో సహా లాభాలు పంచుకున్నారనీ ప్రజలు చెప్పుకున్నారు. ఈ మినిస్ట్రీలోకూడా ఒక మాజీ మంత్రి లక్ష రూపాయలు ఒక సాయిబుదగ్గర పుచ్చుకుని హైదరాబాదుకు జీప్‌కారులు పంపటానికి అనుమతి యిచ్చాడని చెప్పుకుంటున్నారు. ఇది ఎంతవరకు నిజమో ప్రభుత్వం విచారణచేయ్యటం మంచిది. కమ్యూనిస్టుల విషయంలోకూడా అంతే - ఒక కాంగ్రెసువాది పట్టుకోమనీ, ఇంకొకరు వదిలిపెట్టమనీ. వీరి ఇద్దరి పలుకుబడినిపట్టి అమాయకులు పట్టుబడటమూ, నేరస్తులు తప్పించుకోవటమూ జరుగుతున్నది.

ప్రభుత్వం ఇలాంటివాటిని ఎంతకాలం సాగనిస్తుంది? మద్యపాన నిషేధం విషయమై చూపిస్తున్న శ్రద్ధలో నూరోవంతుకూడా దీనిమీద చూపించకూడదా? పూజ్య బాపూజీ పేరు చెప్పుకుని చాలామంది బ్రతుకుతున్నారు—వారిలో మన మద్రాసు నాయకులు ప్రథములుగా వున్నారు—అఫీసులో ఉన్నవారుకానీండి, బయట ఉన్నవారుకానీండి. వచ్చే స్వాతంత్ర్య దినంనాడైనా వీరు కొన్ని ఛాదస్తాలు వదులుకుని, ప్రజలందరికీ లాభించే పనులు కొన్నిఅయినా చేస్తామని ప్రతిజ్ఞతీసుకుంటే ప్రజలు సంతోషిస్తారు. అంతేగాని గాంధిగారి ఆదర్శాలు కావాలని ఈనాడు అడిగేవాడూ లేడు, అవి పెట్టేమంటే సంతోషించేవాడూ లేడు.




నిజాం దండయాత్ర !




ప్రపంచకల్లోలం సమసిపోవాలన్నా, ప్రపంచశాంతి నెలకొనాలన్నా, మిత్రరాజ్యసమితినామం సార్థకమై, అన్నిరాజ్యాల మధ్య—ముఖ్యంగా అగ్రరాజ్యాల మధ్య—అది మైత్రి నెలకొల్ప గలిగితేనే.

కాని, ఆ సమితినుంచి అట్టి మహత్తరకార్యసిద్ధినికాదు సరిగాదా, ఏ సమస్యా పరిష్కారాన్ని ఆశించలేమనే విషయం అంతకంతకు అధికంగా ఋజువౌతున్నది.

దాదాపు రెండేళ్ళపాటు వాదోపవాదాలను సాగించిన పిదప తనవల్ల కాగలిగింది లేదని మిత్రరాజ్యసమితి నియమించిన పరమాణుశక్తి కంట్రోల్‌సంఘం చెప్పివేసింది.

పూర్తిగా రెండేళ్ళపాటు తర్జన భర్జనలు జరిపినమీదట తనవల్ల కాగలిగింది లేదని మిత్ర రాజ్యసమితి నియమించిన ఆయుధవిసర్జనసంఘం కాడి పారవేసింది.

మిత్రరాజ్యసమితి చూపుతున్న ఈ చేతకానితనంవల్ల ప్రపంచకల్లోలం మరింత పెరుగుతున్నది. ప్రపంచయుద్ధం మరింత దగ్గరపడుతున్నది.

ఈ శోచనీయపరిణామలకు ఖిన్నుడై—క్రుద్ధుడై—ఈమధ్య ఒక అమెరికన్ యువకుడు మిత్రరాజ్యసమితి కార్యాలయంపైకి తన విమానంలో వెళ్ళి, ఒక బాంబువేశాడు. ఇతడు పిచ్చివాడని ప్రపంచం అంటున్నది. కాని, పిచ్చివాడని ఖాయంగా అనగలమా? ఇతడు పిచ్చివాడని అంటున్న ప్రపంచమే పిచ్చిదని తీర్మానించుకోడానికి అవకాశం లేదా?

* * *

మిత్రరాజ్య సమితి పాలస్తీనాలో యుద్ధవిరమణను సాధించగలిగినందున అది శుష్కసంస్థగా పరిణమించినదనడం ఉచితంకాదని దాని పక్షాన ప్రస్తుతం వాదించడానికి కొంత ఆస్కారం లేకపోలేదు. కాని, తాత్కాలికంగా పాలస్తీనాలో యుద్ధవిరమణను సాధించడం ఘనవిషయం కాదు; అసలు యుద్ధకారణాలను తొలగించడం జరగాలి. పాలస్తీనాలో యుద్ధం ఆగిందేగాని, యుద్ధకారణాలు తొలగలేదు.

ఈజిప్టు, ఇరాక్; ట్రాన్స్‌జోర్డానులపై తన పలుకుబడిని బ్రిటన్ వదులుకొంటుందా? వాటిలో తనకు జరిగిన సైనిక సహాయ సంఘాలను రద్దు చేసుకుంటుందా? తూర్పు మెడిటరేనియన్‌పై ఆధిపత్యాకాంక్షను చంపుకుంటుందా? సూయజ్‌కాల్వ తన చేతిలోనుంచి జారిపోతే, తన ప్రాణమే పోతుందనే తాపత్రయం వీడుతుందా? సూడాన్ ప్రాంతాన్ని తన గుప్పిటిలోనే పెట్టుకోవాలనే ప్రయత్నాన్ని విరమిస్తుందా? ఇరాన్‌లోని పెట్రోల్ గనులకు నీళ్ళు వదులుకుంటుందా? పాలస్తీనాగుండా హైఫాకుచేరే పెట్రోల్ పైపు విషయమై గుండె దిటవు చేసుకుంటుందా?

ఇదే విధంగా యునైటెడ్‌స్టేట్సు సౌదీ అరేబియా పెట్రోల్‌కోసం కక్కుర్తిని కట్టి పెడుతుందా? మధ్యప్రాచ్యం తనకు ఒక విపణివీధి కావాలని, రష్యాకు వ్యతిరేకంగా ఒక సాయుధ బలకేంద్రం కావాలని కోరకుండా వుండగలదా?

ఈ ప్రశ్న లన్నింటికి పాలస్తీనా యుద్ధంతో సంబంధం కలదు. వీటికి "ఔను" అని ప్రత్యుత్తరం వచ్చిననాడుగాని, పాలస్తీనా యుద్ధకారణాలు తొలగవు; అప్పుడేగాని పాలస్తీనాలోని ప్రస్తుతపు యుద్ధవిరమణ స్థిరమైన శాంతిగా పరిణమించదు.

పాలస్తీనా వివాద పరిష్కారానికి మిత్రరాజ్య సమితి పక్షాన నియమితుడైన కౌంట్ బెర్నాడోట్ నిష్పాక్షికుడే కావచ్చు. కాని, ఇప్పటి వివాదాలు మధ్యవర్తుల గుణగణాలవల్ల పరిష్కారం కావు. వీటికి మూలకారణా లేవో అవి తొలగినప్పుడే వీటి పరిష్కారం. నిజానికి ప్రస్తుత యుద్ధ విరమణ సయితం నిస్వార్ధ ప్రేరితమైనది కాదని అనలేము. అమెరికాలో ప్రెసిడెంట్ పదవికి ఎన్నికలు సమీపిస్తున్నాయి. రానున్న నవంబర్‌లోనే ఈ ఎన్నికలు. అమెరికన్ వోటర్స్‌లో లక్షలాదిగా యూదీయులున్నారు. గాని, అరబ్బులు ఒక్కరైనా లేరు. అంచేత యూదీయులను సంతృప్తిపరచడం ముఖ్యావసరం. యూదీయులను సంతృప్తి పరచాలంటే, అరబ్బులను బెదిరించాలి. అరబ్బులను బెదిరించాలంటే, వారిని ప్రోత్సహించవలదని బ్రిటిష్‌వారిని ఒత్తిడిపెట్టాలి. అమెరికా ఇంతేచేసింది కూడా. "మీ చెప్పుచేతలలో నున్న అరబ్బులను మందలించకపోతే, మార్షల్ ప్రణాళికను అనుసరించి మీకు ఆర్థికసహాయాన్ని కట్టిపెట్టవలసి వస్తుంది"అని అది వారికి చెప్పింది. అంతట బ్రిటిష్‌వారు అరబ్బులను కాస్త తగ్గమని చెప్పి, లేకపోతే, అమెరికా పట్టుదలపై మిత్రరాజ్యసమితిద్వారా జరగగల అరబ్‌రాజ్యాల ఆర్థికదిగ్బంధన, సైనికచర్యలు మొదలుగాగల కార్యక్రమంలో తాను గూడా చేరవలసివస్తుందని తెలియచేయక తప్పిందికాదు. అందువల్లనే అరబ్‌రాజ్యాలు యుద్ధ విరమణకు విధిలేక అంగీకరిస్తూ, అమెరికాపైకంటె, బ్రిటన్‌పై ఎక్కువగా ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నాయి. అది విశ్వాసద్రోహంచేసిందని దాన్ని వాటిలో కొన్ని సాధిస్తూన్నాయికూడా.

ఏ కారణాలవల్లనైతేనేమి, పాలస్తీనాలో యుద్ధవిరమణ జరగడం సంతోషించదగిన విషయమని భావించినా, శాశ్వత పరిష్కారం ఏపద్ధతిపై జరగబోతున్నది? పాలస్తీనా విభజనకేమి, ఇజ్రాయల్ రాజ్యస్థాపనకేమి, ఇదివరలోవలె ఇప్పుడుకూడా అరబ్ రాజ్యాలవారు తీవ్ర ప్రాతికూల్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పాలస్తీనా విభజనను వినా, ఇజ్రాయల్ ప్రభుత్వ సుస్థిరత్వానికి వినా మరొకదానికి యూదీయులు సమ్మతించరు. అయినా, ఇజ్రాయల్ ప్రభుత్వాన్ని అది సంస్థాపించబడివుందనే తాను గుర్తించినందున, పాలస్తీనా విభజన కొనసాగవలసిందేనని అమెరికా పట్టుపడితే, దాని అభిమతానికి అరబ్ రాజ్యాలు తలవొగ్గవలసిరావచ్చు. కాని, అమెరికా ఆపని చేస్తుందా? ఈ విషయమై అది ఇదివరలో ఒకసారి చంచలత్వాన్ని ప్రదర్శించలేదా? అసాధ్యమైనదని బ్రిటన్ త్యజించివేసిన పాలస్తీనా విభజన కార్యక్రమాన్నే ఆమోదించమని మిత్రరాజ్యసమితి మెడను అది విరిచింది. ఆ పిమ్మట తానే ఆ కార్యక్రమం

అసాధ్యమైనదని చెప్పి, తాత్కాలికంగా పాలస్తీనాపై అంతర్జాతీయపు ధర్మకర్తృత్వాన్ని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనకైనా కట్టుపడివుండక, పాలస్తీనా విభజనకు— ఇస్రాయల్ ప్రభుత్వాన్ని గుర్తించడంద్వారా—తానై తిరిగి సమ్మతితెలిపింది. యూదీయులసద్భావం తనకు ఎంతగా కావాలో అరబ్బులస్నేహం అంతగా కావలసిరావడమే ఈ ఊగిసలాటకు మూలం కాదా? అయినప్పుడు పాలస్తీనా వివాదపు శాశ్వతపరిష్కారం సులభమా? అసలు, అది సాధ్యమా? ఒకవేళ పాలస్తీనావ్యవహారం ఏదో ఒకవిధంగా ప్రస్తుతానికి ముడిపడినా, అరబ్ రాజ్యాలు ఇప్పటికంటె మరికొంచెం బలపడినంతనే అది తిరిగి మొదటికిరాకమానదు.

* * *

యుద్ధవిరమణ కారణంగా పాలస్తీనాలో కల్లోలం కొంత తగ్గితే, అంతకంతగా అది జర్మనీలో హెచ్చింది.

బెర్లిన్ బ్లాకేడ్‌ను రష్యా మరింత తీవ్రంచేస్తున్నదేగాని, సడలించడంలేదు. దీనితోపాటు ఆ బ్లాకేడ్‌ను భగ్నపరచాలని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాల పట్టుదల పెరిగిపోతున్నదికూడా. బెర్లిన్‌నుంచి ఏమైనాసరే తాము కదలబోమని ఈ మూడు రాజ్యాలూ ఖచ్చితంగా హెచ్చరించాయి. తమ హెచ్చరిక పట్టుదలతో కూడినదని తెలపడానికిగాను బెర్లిన్ నగరంలోని తమ మండలాలకు ఆహార పదార్థాలు మొదలైనవాటిని అందజేయడానికి వందలాదిగా విమానాలను వినియోగిస్తున్నాయి. అవసరమైతే, ఇందుకు మరెన్ని విమానాలనైనా ఆయత్తపరచగలమని ప్రకటిస్తున్నాయి. అగత్య మేర్పడితే ఎంతకాలంపాటైనా సరే ఆకాశమార్గం వెంట ఆహార పదార్థాలను చేర్చగలమంటున్నాయి.

ఈ పట్టుదలలు ఇంతటితో ఆగడంలేదు. "రైలుమార్గానికి రిపెయిర్లు చేయవలసి వచ్చినందున మా మండలంగుండా మీ రైళ్ళు నడవడానికి వీలులే"దని రష్యాచెప్పిన సాకు దానికే అప్పజెప్పి, బ్రిటన్, అమెరికాలు తమ మండలాలగుండా సోవియట్ గుడ్సుబళ్ళ ప్రయాణాలను నిషేధించాయి. బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు తమ మండలాలలో ప్రవేశపెట్టిన, విడి కరెన్సీకి ప్రతిగా తమ మండలంలో రష్యా వేరొక కరెన్సీని చెలామణిలోకి తెచ్చింది. బెర్లిన్ మునిసిపల్ పోలీసుదళం ఉద్యోగస్థులలో వీరు బర్తరఫ్‌చేసినవారిని వారు పునర్నియామకం చేస్తున్నారు. వారు పునర్నియామకం చేసినవారిని వీరు బర్తరఫ్ చేస్తున్నారు. పశ్చిమజర్మనీని విడిరాజ్యంచేయాలని వీరు ప్రయత్నించుతుంటే, తూర్పుజర్మనీని విడిరాజ్యం చెయ్యాలని వారు సన్నద్ధపడుతున్నారు. ఇదేసమయంలో ఉభయపక్షాలవారు కూడా తమ యుద్ధశాఖాధిపతులతో సమాలోచనలు సాగిస్తున్నారు.

ఈరీతిని ఎంతగా స్పర్ధలు పెరిగిపోతున్నా ఉభయత్రా తక్షణ యుద్ధ ప్రారంభాన్ని వీలుపడితే తప్పించాలనే ప్రయత్నంకూడా కొంత కానరాకపోవడంలేదు. ఎప్పటికో ఒకప్పటికి తమమధ్య యుద్ధం తప్పదన్న విశ్వాసంతోనే ఉభయపక్షాలవారు వ్యవహరిస్తున్నారు. కాగా, తక్షణ యుద్ధనివారణ సాధ్యం కాగలదేమో చూడాలనే వారి ప్రయత్నం. ఒక దశాబ్దం



బెర్లిన్ మాచ్ !

లోపలనే రెండు ప్రపంచయుద్ధాలలో పాలొనడానికి ప్రపంచప్రజలు సమ్మతించడం కష్టం. నిజానికి ఒక ప్రపంచయుద్ధంలో పోరాడిన తరం ఇంకా గతించి, రెండవతరం తల యెత్తనిదే మరొక ప్రపంచయుద్ధం ప్రారంభం కావడం దుర్ఘటం.

తక్షణ యుద్ధ ప్రారంభాన్ని నివారించాలనే ఆలోచనతో బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు బెర్లిన్ సమస్య విషయమై ముఖాముఖి చర్చకు అవకాశ మివ్వమని మార్షల్ స్టాలిన్‌ను కోరుతున్నాయి. అయితే, ఇందుకు ఆయన అంగీకరిస్తాడో, లేదో ఇంకా (జూలై 28 వ తేదీనాటికి) తెలియదు. ఆయన ఇందుకు అంగీకరించినా, ఒడంబడిక సాధ్యమో, కాదో చెప్పలేము. ఏమైనా, ఒక్కటి మాత్రం తథ్యం. బెర్లిన్ వివాదం ఈనాడు కేవలం పొగలు గ్రక్కుతున్న ఒక అగ్ని పర్వతం.

* * *

బెర్లిన్ పొగలు కక్కుతున్న అగ్నిపర్వతమైతే, మలయా భగ్గుమన్న అగ్నిపర్వతం. ప్రస్తుతం మలయాలో సాయుధవిప్లవం కొనసాగుతున్నది. ఈ విప్లవంలో పాల్గొంటున్న వారిని బ్రిటిష్‌వారు బందిపోటులని అంటున్నారు. దొంగకంటికి అందరు దొంగలుగానే కన బడతారు. (ధర్మరాజుకు అవినీతిపరుడుగాని, దుర్యోధనునికి నీతిపరుడుగాని కానరాలేదని ప్రతీతి.) బ్రిటిష్‌వారు మలయాను జయించడమేమి, దాన్ని పరిపాలించడమేమి ఆ దేశాన్ని దోచుకునే ఉద్దేశంతోనే. అందువల్ల వారు మలయా విప్లవకారులను బందిపోటులని పేర్కొన డంలో అబ్బురం లేదు.

మలయాలో రబ్బరు, తగరం విశేషంగా లభిస్తాయి. 1939 లో ప్రపంచం మొత్తంపై ఉత్పత్తి చేయబడిన రబ్బర్‌లో నూటికి దాదాపు 38 వంతుల ఉత్పత్తి, తగరంలో 35 వంతుల ఉత్పత్తి మలయాలోనే జరిగింది. ఈ రెండు ముడివస్తువులుకూడా బ్రిటన్‌కు విశేషంగా కావాలి. అందువల్లనే అది మలయాలో తిష్టవేసింది; అందువల్లనే అక్కడినుంచి కదల డానికి అది ఒప్పుకోవడంలేదు కూడా.

రబ్బరు, తగరం విశేషంగా లభిస్తాయనే ఆశవల్లనే కాకుండా, మరొక ముఖ్యకారణంవల్ల కూడా మలయాను తన గుప్పిటినుంచి జారిపోనివ్వడానికి బ్రిటన్ సమ్మతించడంలేదు. బ్రిటిష్ సామ్రాజ్యరక్షణ వ్యూహంలో ఆదినుంచీ మలయాకు ప్రధానస్థానమున్నది. ఆస్ట్రే లియా, న్యూజిలాండ్ దేశాలతో రాకపోకలు సురక్షితంగా సాగాలంటే బ్రిటన్‌కు మలయాలో నౌకాశ్రయం అత్యవసరంగా కావాలి. అందువల్లనే సింగపూర్‌లో అది ప్రపంచం మొత్తంపై పెద్దదైన ఒక యుద్ధనౌకాశ్రయాన్ని నిర్మించింది. ఇదివరలోనే బ్రిటిష్ సామ్రాజ్య రక్షణ వ్యూహంలో మలయాకు ఇంత ప్రధానస్థానం వున్నదంటే, ఇండియా, బర్మా, సింహళాల స్వాతంత్ర్యాన్ని గుర్తించినమీదట ఈ ప్రాధాన్యం శతాధికమైపోయింది. ఇందువల్లనే మలయాపై తన ఆధిపత్యాన్ని మరింతగా పదిలపరచుకోడానికి బ్రిటన్ ఇటీవల వేయి విధాల ప్రయత్నం చేస్తున్నది.

సామదాన భేద దండోపాయాలలో మొదటి మూడింటిని ముందు ఉపయోగించి, వాటి ద్వారానే వీలైనంతవరకు కార్యసాధన చేసుకోవడం బ్రిటన్‌కు పరిపాటి. ఆ ప్రకారమే అది గడిచిన రెండు సంవత్సరాలలో వర్తించిందికూడా.

మలయా విషయంలో ఒక విశేషం,—దాని జనాభాలో మలయనుల సంఖ్యకంటె అన్య జాతులవారి సంఖ్య అధికం కావడం. రబ్బరుకోసం, తగరంకోసం బ్రిటిష్‌వారు మలయాకు ఎగబ్రాకినప్పుడు రబ్బరు తోటలలోను, తగరం గనులలోను కూలికి పనిచేయడానికి మలయనులు ముందుకు రాలేదు. మరొకరి దగ్గర కూలిడబ్బులకు పనిచేయడం అంటే మలయనులకు తల కొట్టివేసినట్టుగానే వుంటుంది. అందువల్ల బ్రిటిష్‌వారు ఇండియానుంచి, సింహళంనుంచి, చైనానుంచి తమకు కావలసిన కూలీలను రప్పించుకున్నారు. కూలికి కక్కూర్తిపడి, ఇతర దేశాలనుంచి పెక్కుమంది అంతకంతకు అధికంగా రాగా, ఈనాడు మలయాలో మలయనులకంటె అన్యులే అధిక సంఖ్యాకులైనారు.

1940 లో మలయా జనసంఖ్య 55,93,000. ఈ జనాభాలో యూరోపియనులు 30,000 మంది; మలయనులు 20,48,000 మంది; చైనావారు 24,01,000 మంది; సింహళీయుల సమేతంగా భారతీయులు 7,60,000 మంది. ఈ అన్యజాతీయులలో యూరోపియనులను విడిచిపుచ్చితే, ఎక్కువ పచ్చగా వున్నవారు చైనావారే. మలయాలోని వర్తక వ్యాపారాలలో అధికభాగం చైనావారి చేతిలోనే వున్నది.

మలయాలో మలయనులకంటె అన్యజాతులవారి సంఖ్య అధికం కావడాన్ని, మలయనులకంటె చైనావారు పచ్చగా ఉండడాన్ని పురస్కరించుకుని, బ్రిటిష్‌వారు "మలయా మలయనులకే చెందాలి" అనే నినాదాన్ని ప్రారంభించారు. ఈ నినాదం మలయనులను ఆకర్షించడం సహజం. అంచేత బ్రిటిష్‌వారి పాచిక చక్కగా పారింది. మలయనుల తోడ్పాటుతో చైనావారికి, భారతీయులకు, సింహళంవారికి రాజకీయంగా ఏమీ హక్కులు లేకుండాచేసి, వారిని బ్రిటిష్‌వారు పూర్తిగా అణచివేశారు.

ఆ తర్వాత మలయనులవంతు వచ్చింది. గత యుద్ధ సందర్భంలో జపానువారి ఆక్రమణకు (1942 వ సంవత్సరానికి ముందు) మలయా రాజకీయంగా మూడు విభాగాలుగా వుండేది. వీటిలో మొదటిది,—సింగపూర్ నౌకాశ్రయ పరిసరప్రాంతమైన స్ట్రెయిట్స్ సెటిల్‌మెంట్; రెండవది,—ఫెడ్రేటెడ్ మలేస్టేట్స్; మూడవది,—అన్ ఫెడ్రేటెడ్ మలే స్టేట్స్, లేదా స్వదేశ సంస్థానాల ప్రాంతం. మన దేశంలోని బ్రిటిష్ ఇండియాను, స్వదేశ సంస్థానాలను, ఎక్స్‌క్లూడెడ్ ఏరియాస్‌కు మలయాలో బ్రిటిష్‌వారు చేసిన మూడు విభాగాలు కొంచెం హెచ్చుతగ్గుగా సరిపోతాయని చెప్పవచ్చు.

మనదేశంలో బ్రిటిష్ఇండియాలో తక్కిన ప్రాంతాలలోకంటె జాతీయత అధికంగా పరిఢవిల్లినట్టుగానే మలయాలో ఫెడ్రేటెడ్ మలేస్టేట్స్‌లో సంభవించింది. అందువల్ల ఆ ప్రాంతంలో జాతీయత కుత్తుకను నులిమివేయాలనే ఉద్దేశంతో బ్రిటిష్‌వారు దేశాన్ని పునర్వి

భాగం చేశారు; ఒక్క స్ట్రెయిట్స్ సెటిల్‌మెంట్స్ వినా మిగిలిన దేశాన్ని మలయన్ సుల్తాను లకు కట్టబెట్టారు. ఆ సుల్తానులకు ఎన్నో నిరంకుశాధికారాలను ప్రసాదించారు. ఆ సుల్తానులు తమ చేతిలో కేవలం కీలుబొమ్మ లైనందున, వారి పేర తామే వారి నిరంకుశాధి కారాలను వినియోగించ నారంభించారు. ఈ మోసం క్రమ క్రమంగా మలయనులకు తెలిసిపోయింది. అందువల్ల వారు (జపానువారు పోతూ, పోతూ తమ కిచ్చిన్న ఆయుధాల తోను, జపానువారుండగా వారిపై యుద్ధం చేయండని బ్రిటిష్‌వా రిచ్చిన ఆయుధాలతోను) ప్రస్తుతం సాయుధవిప్లవాన్ని కొనసాగిస్తున్నారు. ఈ జాతీయ విప్లవాన్నే బ్రిటిష్‌వారు బందిపోటుల దుర్మార్గంగా ప్రపంచానికి చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. అంతకంతకు ఈ విప్లవ తీవ్రత హెచ్చిపోతున్నందున నానాటికి అధికంగా తమ సాయుధబలాలను మలయాలో కేంద్రీకరిస్తున్నారు.

* * *

బ్రిటిష్‌వారి "గృహచ్ఛిద్రం" అనే సాకుపై కాబోలు మలయాలో సాగుతున్న "యుద్ధం" విషయమై మిత్రరాజ్య సమితి శ్రద్ధవహించడంలేదు. కాని, అది జోక్యం కలిగించుకున్న ఇండొనీషియా సమస్యలోనైనా అది సాధించగలిగింది సున్నకు సున్న, హళ్లికి హళ్లి.

ఇండొనీషియాలో డచ్‌వారికి, రిపబ్లికనులకు ఒడంబడిక కుదర్చడంలో తోడ్పడ్డానికి మిత్ర రాజ్య సమితి అమెరికా, బెల్జియం, ఆస్ట్రేలియాల ప్రతినిధులతో ఒక త్రైరాజ్య సంఘాన్ని పంపించింది. ఈ సంఘంవారు ముందుగా యుద్ధవిరమణ సంధిని సాధించి, ఆ పిమ్మట ఇండొనీషియా సమస్య శాశ్వత పరిష్కారానికి కొన్ని సూచనలను చేశారు. (ఈ సూచన లను త్రైరాజ్య సంఘంవారు చేసినారనడం ఒక విధంగా పొరపాటు. వీటిని అమెరికా, ఆస్ట్రేలియా ప్రతినిధులు చేశారు.) ఇవి తమకు కొంతవరకు ప్రతికూలమైనవి కావడంచేత ఒక కొంటె సాకుచెప్పి, వీటిని డచ్‌వారు తిరస్కరించారు. ఇంతేకాదు. ఇక, త్రైరాజ్య సంఘంతో తాము సంభాషణలను సాగించబోమని కూడా చెప్పివేశారు. దానితో ఇక తాము చేయగలిగింది లేదని ఆ సంఘంవారు మిత్రరాజ్య సమితికి మొన్ననే నివేదించారు. త్రైరాజ్య సంఘం నిర్ణయాలు కేవలం సలహాపూర్వకమైనవి కావనీ, వాటిని ఉభయపక్షాలు ఆమోదించి తీరాలనీ మిత్రరాజ్యసమితి చెప్పివుంటే, ప్రస్తుతపు ప్రతిష్టంభన ఏర్పడేదికాదు. కాని, ఇంపీరియలిస్ట్ రాజ్యాలకు స్థావరంగా పరిణమించిన మిత్రరాజ్య సమితికి ఇంపీరియలిస్టు లైన డచ్‌వారితో వ్యవహరించడం సందర్భంలో ఈపాటి "మగసిరి" లేదు. ఏమైనా, ఇండొనీషియా సమస్య ఎంతకు తెగని సమస్యగా మిగిలివుండగా, ఆర్థిక దిగ్బంధనద్వారా ఇండొనీషియన్ రిపబ్లిక్‌ను అంతమొందించడానికి డచ్‌వారు ప్రయత్నిస్తున్నారు.

* * *

ఏ సమస్యను చూడబోయినా, దానిలో అగ్రరాజ్యాల స్వార్థాలే, స్పర్థలే, కుట్రలే, కుత్సితాలే, అందువల్లనే మనది నేటికీ కల్లోల ప్రపంచం.

# విజయ

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

(గతసంచిక తరువాయి)

ఆవిడ కారోజున ఒంట్లో బాగాలేదు. దగ్గు తెరలతో ముందటి రాత్రంతా నిద్ర లేదని చెప్పింది.

ఆవిడ తెమ్మంటే, నాగవ్వ కాగితాలతోనిండిన పెట్టె ఒకటి తెచ్చి మా ముందర పెట్టింది.

"మీ సలహా మీ సహాయమూ నాకొక విషయంలో అవసరమై, మిమ్మల్నింత ప్రత్యేకంగా రమ్మని కోరేను. మీరు ఏమీ అనుకోకపోతే చెప్తాను....చెప్ప మంటారా ?"

"చెప్పండి....విజయ దగ్గరనుంచి మీకేమైనా ఉత్తరంవచ్చిందా ?"

"రాలేదండీ. మీకేమైనా వచ్చిందా?"

"లేదు. నేను బెంగుళూరు వచ్చి మూడువారా లయింది. ఈ మూడు వారాలూ కూడా నా కుత్తరంలేదు."

"అలాగా ?....ఈ కాగితం ముక్కలన్నీ ఎందుకు దాచానో నాకే తెలియదు.... ఇదుగో, ఈ దస్తావేజు కొంచెం చూడండి ముందు."

"నాకీ దస్తావేజులు చూపించడం ఎందుకండీ?....నాకు వ్యవహారాలేమీ తెలియవు. వీటి విషయమై సలహా లిచ్చేందుకు నాకు తగినంత వ్యవహారజ్ఞానం లేదు....'గొట్టెముక్కల రమణయ్యగారికి'....అంటే, విజయ తండ్రిగారు కాదూ?"

"అవునండీ....ఆయన గుడివాడ తాలూకా భూములుకొన్న దస్తావేజు.... మీరు క్షమించాలి. ... మీరు చూస్తున్నది ఆయన సుమారు పదిహే డెకరాల మాగాణీ కొన్న దస్తావేజు...."

"అసలు సంగతేమిటో చెప్పండి."

"విజయ తండ్రిగారివి ఆస్తులు కొన్ని ఉన్నాయి. అప్పట్లోకంటె ఇప్పుడు చాలా లాభకరమైన ఆస్తులు. మీరు చూస్తున్న దస్తావేజు ఆస్తి ఇప్పుడు చాలా వరకు యకరం వెయ్యి రూపాయిలకి తక్కువ ఉండదు. ఈ ధరలలోకూడా.... బందరులో వారిది నివేశన స్థలం ఒకటుంది. బెజవాడలో గవర్నరు పేటలో పాత ఇల్లు చిన్న దొకటుంది. ఇవన్నీ నేను నాకు కాకుండా చేసుకున్నాను....ఆ కథ మీకు తెలియనే తెలుసును....మా ఆడపడుచూ భర్తా అనుభవిస్తున్నారా ఆస్తులు.

ఇక్కడ కొందరు పెద్దమనుష్యులని అడిగితే, నామాట ఎలా ఉన్నా, విజయ బెజవాడలోనో బందరులోనో దావాచేస్తే, విజయకి హక్కుభుక్తాలు అవుతాయని చెప్తున్నారు. ఇరవైయొక్కో ఏడు నిండకుండా చెయ్యాలటా దావా. అయిదారు నెలలలో ఇరవైరెండో ఏడు వస్తోంది దానికి. ఈలోపుగా ఏమైనా చేస్తే చెయ్యాలి.... ఇదీ నాతాపత్రయం... ఈమధ్య నేను మళ్లీ మా ఆడపడుచు భర్తకి రిజిష్టర్ ఉత్తరంకూడా వ్రాశాను, సలహాపైని. అందినట్టు రసీదు వచ్చింది కాని, జవాబు లేదు... ఇంకా చాలా చరిత్ర ఉంది. చెప్పమంటే చెప్తాను.... విజయకీ నాకూ ఇప్పుడు మీకంటె కావలసినవాళ్ళు లేరు. అందుకోసం మిమ్మల్ని బాధపెట్తున్నాను."

"విజయతో మీరు ఈ ఆస్తుల విషయమైకాని, దావా విషయమైకాని ఎప్పుడైనా మాట్లాడేరా ?"

"ప్రత్యేకించి ఈ విషయాలు మాట్లాడలేదు. కాని తనకి ఈ ఆస్తి ఉన్నట్టు విజయకి తెలుసును.... ఈ ఉత్తరం చూడండొకసారి. ఏడెనిమిదేళ్ళ కిందట మా వదినగారికి నేను ఉత్తరం వ్రాస్తే మా వదినగారి భర్త నాకు జవాబు వ్రాసేడు .... చూడండి..... ఆస్తులన్నీ విజయకి ఒప్పచెప్పడానికి ఏమీ అభ్యంతరం లేదనీ, కాని విజయ నన్ను విడిచిపెట్టి వాళ్ళ చెప్పుచేతలలో ఉంటున్న రోజునకాని అలా ఒప్పచెప్పడం జరగదనీ వ్రాసేడాయన.... అంటే విజయకి హక్కులున్నట్టు మేనత్తా మేనత్త భర్తా ఒప్పుకుంటున్నట్టే కాదండీ ?"

"అలాగే కనిపిస్తుంది .... పట్టాలూ దస్తావేజులూ మీరు అపహరించారని వ్రాస్తున్నా రీయన...."

"ఆయన వ్రాయడానికేంలెండి.... విజయ తండ్రిగారు మా బెజవాడ ఇంట్లోనే పోయారు. ఆయన పోయినప్పుడు ఆయన కాగితాలూ ఆయన పెట్టెలూ నేను జాగ్రత్తగా దాచుకున్నాను.... అదీ కడుపుమంట వాళ్ళకి."

"మీరు ఆయనతో కాపురం చేస్తుండగానే పోయారా ఆయన ?"

"అవును."

"విజయ కెన్నేళ్ళం దప్పుడు ?"

"మూడునాలుగేళ్లుంటా యనుకుంటాను.... అప్పటికప్పుడే బాగామాట లొచ్చాయి దానికి.... నన్ను మీరీ ప్రశ్నలన్నీ ఎందుకు వేస్తున్నారో నాకు తెలుసును.... కిందటేడు నేను మా ఆడపడుచుకీ ఆవిడ భర్తకీ వకీలు నోటీసు లిప్పిస్తే వాళ్ళ జవాబిదిగో, చూడండి.... విజయ వాళ్ళ అన్నగారి కూతురే కాదని జవా బిప్పించిందావిడ. ఇంగ్లీషులో, వకీలు ఎవరిచేతో ఇప్పించిందా జవాబు.... జరిగినవాటి కన్నిటికీ నామీద కక్షపెట్టుకుంటే అర్థం ఉంది. పిల్ల గొంతుక కోస్తానంటే ఎలాగ ? .... చూసేరా ఉత్తరం ?"

"చూసేను."

"విజయ పుట్టినప్పుడు మేనత్తా కుటుంబమూ అల్లూరులో ఉండేవారు. విజయ తండ్రిగారికి మేనత్తభర్త అప్పుడు వ్రాసిన కార్డొకటి కాగితాలలో దొరికింది..... చూపిస్తా నుండండి. వీరు కూతురు పుట్టినట్టు బావమరిదికి వ్రాసేరు. ఆవిడ బెజవాడలోనే ఉన్నారప్పుడు....ఇదీ ఆకార్డు.....ఆయన జవాబన్నమాట....ఇప్పుడు మరి, విజయ ఎవరికి పుట్టిందోకూడా తెలియదని బూకరిస్తున్నారు, చూడండి.... చూసేరా కార్డు?....ఇదికాక ఇంకా ఎన్నో కాగితాలున్నాయి....విజయది వాళ్ళ నాయనమ్మపేరు. జాతకంకూడా వ్రాయించా రాయన."

"ఈ విషయాలన్నీ మీరు అప్పుడే బాగా ఆలోచించినట్టు కనిపిస్తుందే!"

"డాక్టరుగారు,....సుమిత్రరావుగారు ఎవరో వకీలు స్నేహితుడికి ఈ కాగితాలన్నీ చూపించారు. నాకు హక్కు ఉండదన్నా డాయన. విజయ హక్కుకి అడ్డు లేదన్నా డాయనే....కాని కేసు బెంగుళూరులో నడపడానికి వీలులేదట. బెజవాడ లోనో బందరులోనో కేసు పెట్టాలట. విజయపేరట పెట్టాలి.... బెజవాడలో ఇల్లూ, బందరులో నివేశన స్థలమూ చెప్పతగ్గ ఆస్తులుకావు....గుడివాడ తాలూకా భూములే ఇప్పుడు చాలా లాభకరమైనవి....ఆ భూము లసలు రాజావారే.... జమీందారుగారే ఇప్పించారు...."

"ఏ జమీందారుగారు?"

"అదొక పెద్దగాధ....విజయకి తెలియదు. నే నెప్పుడూ చెప్పలేదు....విజయ తండ్రిగారు అయిదారు నెలలకి పోతారనగా ఈ భూములు దఖలుపడ్డాయి.కొన్నట్టు పత్రం ఉందికాని, సొమ్మిచ్చికొన్నవి కావు. అమ్మిన ఆసామి రాజావారి సేవకుడు...."

"ఎవరీ రాజావారు?"...

"నా చరిత్ర విజయకి కొంత తెలుసును. ఆ కొంతా మీకూ తెలిసే ఉంటుంది."

"కొంత తెలుసును."

"అంతా చెప్పమంటారా?"

"చెప్పండి."

"బెజవాడలో మా ఇంటిగుమ్మంలో కూనీ జరిగిన విషయం విజయ చెప్పే ఉంటుంది."

"చెప్పింది."

"నా చరిత్ర అంతా చెప్తాను. వినండి.... ఈ గాధ ఎక్కడ ప్రారంభించ డమో తెలియడంలేదు........ నా దసలే సిగ్గుమాలిన బ్రతుకు. ఎవరికి చెప్పుకునేం దుకూ లేదు. అందులో మీకు చెప్పుకోడం మరీ సిగ్గుచేటు. అయినా, మీ సహాయం ఒకవైపు కోరుతూ, చెప్పవలసినదంతా మీకు చెప్పకపోతే ఎలాగ? అసలు విజయకీ మీకూ ఉన్న స్నేహాన్ని పాటించికూడా, ఆ స్నేహం చెడకుండా ఉండేందుకైనా,

మాగురించి అన్నిసంగతులూ మీకు నేను చెప్పకతప్పదు.......కాని, నేను చెప్పిన ఆస్తి విజయకి రావలసిఉంది. ఇప్పుడిక్కడ నేను అప్పులలో మునిగి ఉన్నాను. ఆస్తో, లేకపోతే, ఆస్తికిబదులు దాని ఖరీదో ముట్టచెప్తే తప్ప, తేలేమార్గంలేదు... మా ఆడపడుచూ భర్తా నన్నెన్నిమాటలన్నా పడతాను. నేనామాటలు పడకతీరదు. నేను చేసినదంతా తప్పే. నా బ్రతుకే తప్పు. అయితే, నా సాకున పిల్లని మోస పుచ్చడం న్యాయంకాదు. పాతిక ముప్పయివేల రూపాయిల ఆస్తి దానిది దానికి రావలసి ఉంది.......... చదువు పూర్తిచేసుకొని ప్రాక్టీసు ప్రారంభించే వేళకి దానిచేతిలో ఎన్నో కొన్నివేల రూపాయలుపెట్టి, కొనవలసిన మందులూ సామగ్రీ సామానూ కొనుక్కోమందామని అభిలాషపడ్డాను. ఆఖరికి, చేసిన అప్పులతో, ఈ ఇల్లుకూడా దానికి కాకుండా చేస్తానేమోనని భయంగాఉంది. సొమ్మంటే నా కెప్పుడూనిర్లక్ష్యమే. ఈ ఆస్తులగురించి ఇదివరలో ఎన్నడూ నేనింతగా ఘోషించ లేదు. ఇప్పుడు వాటికోసం ఎంతప్రయత్నమైనా చెయ్యవలసివస్తోంది. నేను ఒక్కత్తెనీ తలపెట్టి చెయ్యగలిగిన పనైతే ఇదివరకే చేసుందును. ముఖ్యంగా విజయే పూనుకోవాలట....పట్టుమని కూర్చుని విజయతో ఈ విషయాలన్నీ మాట్లాడేందుకు నాకు ధైర్యం ఎప్పటికీరాదు. దానితో ఈవిషయాలు మాట్లాడే తాహతు అసలు ఎన్నడో పోగొట్టుకున్నాను. నేను దాని తల్లినీకాను, అది నా కూతురూకాదు: ఈ బాంధవ్యమే దాని మనసులో ఉంచుకోదది. జరిగిపోయిన జన్మలలోనూ, ఈ జన్మ లోనూ కూడా నేనుచేసిన తప్పులన్నిటికీ ఒక్కసారిగా ఈజన్మలోనే నన్ను శిక్షిం చేందుకు దేవుడు దానిని ప్రత్యేకంగా నా కడుపున పుట్టించినట్టు ప్రవర్తిస్తుందది. నే నంటే దానికి అభిమానంలేదు,ప్రేమలేదు,దయాదాక్షిణ్యాలు లేవు.ఇంటి పిల్లికంటేనూ, ఇంటి కుక్కకంటేనూ దానికి నేను కనిష్టం...... ఆసారి వచ్చినప్పుడు మీరు చూసేరుకా!....ఎన్నడూ ఒక రెదుట ఏడవనిదానికి, మీ ఎదుట నాకీపరాభం తప్పడం లేదు. మీరు నన్ను క్షమించాలి....నాకు ముక్తిరావడం మరి ఎన్నడో, ఏవిధం గానో నాకు తెలియదు....నేరంచేసినవాళ్లు, ఖైదునుంచి బయటపడ్డాక, నేరానికీ శిక్షకీ చెల్లు అనుకుని మళ్లీ తలలెత్తుకు తిరుగుతారేమో. నా కలాకాదు. నా ఇంట్లో కూడా నాకు తలెత్తుకు తిరిగే యోగ్యతలేదు. నా బ్రతుకే నానేరం. నా బ్రతుకే నా శిక్ష....ఇలా ఒకటే మాట్లాడేస్తున్నాను! మీ రేమనుకుంటూన్నారో!"

"పరవాలేదు లెండి... అనుకోడాని కేముంది?........విజయకి మీరంటే ప్రేమ లేదని మీరు బాధపడుతున్నారు. ఆస్తులు తిరిగితెచ్చుకునీ, సొమ్ములు విజయచేతిలో పెట్టీ, విజయప్రేమని సంపాదించగలరనే మీ ఆశ?"

"దానిప్రేమ సంపాదించగలనన్నఆశ ఎన్నడో పోయింది........"

"ఎక్కడో ఉన్న ఆస్తులగురించి ఎందుకు మరి మీ కీ తాపత్రయం?"

"దానిప్రేమ నే నెలాగా సంపాదించలేను; కాని నాప్రేమ నే నెలా చంపుకో గలను?... విజయకి నే నక్కర్లేదు కాని, విజయలేకపోతే నా కేముందీలోకంలో?

ఎవరికోసం నేను బ్రతకడం?.... అది నాగురించి ఎంత సిగ్గుపడుతున్నా, నేను దాని తల్లి నేకా! అందరు తల్లులలాగా నాకూ దానికి ఇది చేసిపెట్టాలనీ అది చేసిపెట్టాలనీ ఉండడం అసందర్భమా?..."

"చదువుకునేందుకే మీ సొమ్ము తనకి వద్దన్న విజయకి మీరు మిగిలినసౌకర్యాలు సమకూరుస్తానంటే ఒప్పుతుందా?.... విజయ వద్దు వద్దు అంటుంటే ముందర ఆ ఇల్లు కట్టించారు...."

"అది కట్టించేందుకు ఈ ఇల్లు తనఖా పెట్టేను. తనఖాసొమ్ము చాలక మీ దగ్గరా మీ దగ్గరా వేరే అప్పుకూడా చెయ్యవలసి వచ్చింది."

"విజయ ఒప్పనప్పుడు ఎందుకు కట్టించారు?"

"ఎందుకంటే ఏమి చెప్పగలను?.... ఎప్పటికైనా ఒప్పుకుంటుందేమో అని ఆశ. మీరూ మీరూ బోధపరిస్తే 'సరే' అంటుందని ఆశ. ఆఖరికది ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, అది చదువులు పూర్తిచేసుకునిరాగానే, దానికి నేను చేయగలిగినదంతా చేసి ఎదుట పెట్టాలని ఎన్నేళ్లబట్టో కోరిక."

"కావచ్చు... అయితే, నేను చెప్పినంతమాత్రాన విజయవింటుందా?"

"మీరు చెప్తేనే వినకపోతే, మరెవరుచెప్పినా వినదు............ మీ ఉద్యోగం ఇప్పుడు బెంగుళూరులోనే కనుక, విజయా మీరూ ఏమైనా నిశ్చయించుకున్నారా?"

"ఏ విషయంలో?"

"....విజయని మీరు పెళ్ళిచేసుకోరూ?.... ఇలా చటుక్కున అడుగుతున్నానని మీరు మరొాకలా అనుకోకండి........ మీకా ఉద్దేశ్యం లేదా?"

"విజయ మీతో తనకా ఉద్దేశ్యం ఉన్నట్టు చెప్పిందా?"

"నాతో అది ఈ విషయాలేవీ మాట్లాడదు.... మీ కిదివరకే చెప్పేను...."

"విజయా నేనూ పెళ్లిచేసుకుని ఈ ఇంట్లో ఉంటామని ఆశపడుతున్నారా?"

"నే నెంతైనా ఆశపడొచ్చు. నా ఆశలతో మీకు నిమిత్తంలేదు....విజయ వచ్చిన వెంటనే మీరు పెళ్ళి చేసుకుంటారన్న ఆశ లేకపోయినా, ఎప్పటికో విజయా మీరూ భార్యాభర్తలవుతారని అనుకుంటూఉన్నాను........ విజయ నాగవ్వతో చెప్పిందట కూడాను. నాకు నాగవ్వ చెప్పడమే....విజయని పెళ్ళిచేసుకోరా మీరు?"

"విజయ వచ్చాక విజయనే అడగండి!"...

"ఈ ఇంటివిషయమై మీరు చెప్తే విజయ తప్పకుండా వింటుంది."

"విజయని పెళ్ళి చేసుకున్ననాడు నాకు మాత్రం ఈ ఇంట్లో ఉండాలని ఎందుకుంటుందండీ?....నా ఇంటికి విజయవస్తే అది మా ఇద్దరి ఇల్లూ అవుతుంది కాని...."

"అంతవరకూ అయినా విజయ ఈ యింట్లో ఉండొచ్చునుకా.... అదీ ఆలోచించాను నేను. మీ రుండడం వేరే ఉంటున్నా, దాని ఆసుపత్రి ఇక్కడుండొచ్చునుకా!.... ఈవిషయం వేరేఉంచండి .... గుడివాడతాలూకా భూముల గురించీ బెజవాడ ఇంటిగురించీ బందరు నివేశనస్థలంగురించీ మీరు నాకు సహాయపడాలి."

"నన్నేం చేయమంటారు?"

"విజయతో మాట్లాడి గట్టిగా చెప్పాలి."

"ఏమని?"

"అవసరమైతే దావాచేసి తనహక్కు స్థిరపరచుకునేందుకు తయారుగా ఉండాలని. తనే దావాచెయ్యాలట. నేనుచేసినా ప్రయోజనంలేదట.... అదేకర్మం....నా కీ సహాయం చేసిపెట్టాలి మీరు. ఈ విషయంలో, మీ మాట తప్పకుండా వింటుందది."

"మీరిందాకా చెప్తూ, ఈ ఆస్తులు విజయ తండ్రిగారు డబ్బిచ్చి కొన్నవి కావన్నారు....ఎవరో జమీందారు..."

"ఆస్తు లన్నీకాదు. గుడివాడ తాలూకా భూములు మాత్రం....ఇల్లూ, నివేశన స్థలమూ వారివే. అవి పిత్రార్జితం."

"జమీందారు ఎవరో, సొమ్మివ్వకుండా భూములు దాఖలుపడడం ఏమిటో, మీరు చెప్పేరుకాదు."

"నా జీవితవృత్తాంతం అంతా చెప్తే తప్ప ఆ విషయం బోధపరచడం జరగదు. ....చెప్పమంటారా? మీకు విసుగ్గా ఉంటుందేమో. ఇప్పటికే ఈ విషయం ఆవిషయం చెప్తూ మిమ్మల్ని చాలా బాధ పెట్టేను."

"నన్ను విసుగించరు, చెప్పండి. అంతా తెలుసుకుందామని చాలా కుతూహలంగా ఉన్నాను-"

"అయితే వినండి. ఎప్పుడు విసుగ్గాఉంటే అప్పుడు చెప్పండి. అప్పుడు మానేస్తాను........ మొదటినుంచీ చెప్తాను.... అక్కడ పెట్టు, నాగవ్వా. మీరు తింటూ ఉండండి, నేను చెప్తూఉంటాను .......నేనేమీ తినను. నా ఒంట్లో బాగాలేదు.......... నాకు చిన్నతనంలోనే తల్లితండ్రు లిద్దరూ పోవడంవల్ల యలమంచిలిలో మా మేనమామగారింట్లో పెరిగేను. మాఅమ్మమ్మ పెంచింది నన్ను. నాపదోఏట మాఅమ్మమ్మ కూడా పోయింది. నా పదకొండోఏట నాకు పెళ్ళిచేసేడు మా మేనమామ. అప్పటి కప్పుడే ఏభై ఏళ్లుదాటేయి విజయతండ్రిగారికి.మా మేనమామకి చాలా డబ్బిచ్చారాయన. మా మేనమామ పోయిన ఏడు, పోయినవెంటనే, బెజవాడ కాపురానికి వెళ్లేను. చిన్నతనం. ఏమీతెలియదు. పుట్టింటి దిక్కులేదు.........వెళ్ళినపేటికో ఎడున్నర్థానికో విజయ పుట్టింది....విజయతండ్రిగారికి ఏ ఉద్యోగమో, డబ్బు ఎలా సంపాదించేవారో నా కిప్పటికింకా సమంగా తెలియదు. పక్కజిల్లా జమీందారుగారి దివాణంలో ఏదో ఉద్యోగంఅన్నట్టు చెప్పేవారని జ్ఞాపకం. తిండికి ఎన్నడూ లోటుండేదికాదు........ మా వీధిలోనే, ఇళ్ళకి వెళ్లి సంగీతంనేర్పే పెద్దమని షౌకడుండేవాడు. నాకు చిన్నప్పటి నుంచీ సంగీతం అంటే చాలా అభిలాష. నా కొక వీణకూడా ఉండేది. మా మేనమామ నాకు చిన్నప్పుడు సంగీతం నేర్పేడు. ఇంట్లోకూర్చుని పాడుకుంటూ ఉండేదాన్ని....మా వీధిలో ఉండే సంగీతం మాస్టరుపేరు రాజభూషణరావు. ఒక రోజున

విజయతండ్రిగారే అతన్ని మా యింటికి తీసుకువచ్చారు.... ....విజయ పుట్టకమునుపే అది....అతని కంఠగా సంగీతజ్ఞానంలే దసలు, అతని గొంతూ అంత అంద మైనదికాదు. నడివయస్సు మనిషి...అదే మాస్నేహానికి ప్రారంభం. అప్పుడప్పుడు వచ్చి నా పాట విని పోతూవుండేవా డతను. నా వీణ బాగుచేయించాడు. నా పాట పొగుడుతూ ఉండేవాడు. పాటమధ్య సంగీతంవిషయంలో సలహాలిస్తూ ఉండేవాడు. ఆ రోజులలో విజయతండ్రిగారికి అతనంటే చాలా యిష్టం. అతని భార్యా పిల్లలూ మా ఇంటికి వస్తూఉండేవారు. నేనూ అతని భార్యనీ, అతని అక్కగారినీ చూడ డానికి వెళ్తూఉండేదాన్ని.విజయతండ్రిగారు బయటిఊరికి వెళ్ళినప్పుడల్లా ఆ అక్కగారు రాత్రుళ్లు నాకు నహాయంగా మా యింటికి వచ్చి పడుకుంటూ ఉండేది. విజయ పుట్టి నప్పుడు ఆవిడే నాకు తోడు. వేళకి రాలేదు మా ఆడపడుచు...కొన్నాళ్ళయాక నాకు అతని కుటుంబంతో స్నేహం తగ్గి అతనితో స్నేహం పెరిగింది. విజయతండ్రిగారికి ఆకాశరామన్న ఉత్తరాలుకూడా వచ్చాయి. అప్పటినుంచీ ఆయనకీ నాకూ కూడా సుఖంలేదు. ప్రతిదానికీ కసిరేవా రాయన. ప్రతిదానికీ విసుక్కునేదాన్ని నేను. రాజభూషణరావంటే ఆయనకి అనుమానం ఎక్కువయిన కొలదీ రాజభూషణ రావంటే అభిమానం నాకు ఎక్కువవుతూ వచ్చింది. ఇంట్లో పోరుపడలేక ఒకనాడు పిల్లనితీసుకొని యలమంచిలో విజయనగరమో పోదామని ప్రయాణంఅయాను. అప్పటికింకా నిజంగా రాజభూషణ రావుతోకాని ఇతరులతోకాని తప్పుడుతోవని పడలేదు... ఈ రాజభూషణ రావన్న తని గురించి ఎందుకింతగా చెప్తున్నా నను కుంటున్నారేమో. తర్వాత కూనీకాబడ్డ మనిషి ఈ రాజభూషణరావే....అల్లూరు నుంచి మా ఆడపడుచూ పిల్లలూ వచ్చి రెండు మూడు నెలలు మా ఇంట్లోనే ఉన్నారు. ఇంట్లో తగాదాలు ఇంకా పెరిగిపోయాయి. అన్నా చెల్లెలూ కలిసి నన్నొకరోజున చావ తన్నేరు. పేట అవతల రాజభూషణరావూ నేనూ కలుసుకున్నామని ఎవరో విజయతండ్రిగారికి చెప్పేరు!.... మేము కలుసుకున్న మాట నిజమే!....కొన్నాళ్ళయాక మా ఆడపడుచూ పిల్లలూ వెళ్ళిపోయారు. దివాణంతో సంబంధం ఉన్నందున రౌడీలని తెప్పించి రాజభూషణరావుని కొట్టింపించారు విజయతండ్రిగారు...."

"ఏ దివాణం ?"

దివాణం పేరు చెప్పిందావిడ.

"ఇప్పటి జమీందారుని నే నెరుగుదును. చాలా చిన్నవాడు." అన్నాను.

"ఈయన తండ్రిగా రుండేవారప్పుడు. వారు చాలా విద్వాంసులూ రసికులూ కూడాను...వారే నన్ను బెంగుళూరు పంపించి, బెంగుళూరులో ఈ స్థలమూ ఇల్లూ నాకు కొనిపెట్టేరు.... వారిదాకా రాలేదు నాకథ....ప్రతివేసంగికీ బెంగు ళూరు వచ్చి నెలో రెండునెలలో ఈ ఊళ్ళో ఉండేవారు రాజావారు. అందువల్ల నన్ను బెంగుళూరు పంపించారు. నేను బెంగుళూరు వచ్చాక ఒక్కసంవత్సరమే

వారు బెంగుళూరులో వేసవికాలం గడిపేరు. మరుసటి సంవత్సరం హఠాత్తుగా పోయారు రాజావారు....రాజభూషణరావు గురించి చెప్తూ ఆగిపోయాను....విసుగ్గా ఉంటే చెప్పండి."

"నాకు వినాలనే ఉంది....ఏవోకొన్ని కథలు వ్రాసేనని పేరు నాకు. మీరు మీ జీవితకథ మేము చెప్పేకంటే చమత్కారంగా చెప్తున్నారని నాకు తోస్తోంది....రాజభూషణరావు అన్నతన్ని ఎవరు కూనీచేసేరు? జమీందారుగారు విజయతండ్రిగారికి ఆస్తెందు కిప్పించారు? ఆయన మీకీ బెంగుళూరు ఇల్లు కొనిపెట్టడం ఎలాజరిగింది? జమీందారుగారికీ రాజభూషరావు కూనీకి ఏమైనా సంబంధముందా?.... ఈ ప్రశ్న లన్నీ నా బుర్రలో పనిచేస్తున్నాయి. అన్నివివరాలూ తెలుసుకుందా మనిపించేటట్టు చేస్తున్నాయి....అందువల్ల, సంశయించకండి. చెప్పండి....అదికాక,నన్నొక పెద్ద సందేహం బాధిస్తూ ఉండేది. ఆ సందేహం ఏమిటోకూడా చెప్తాను: నిజంగా మీరు విజయ తండ్రిగారితో కాపురం చేస్తూఉండగా, అంటే, ఆయన్ని మీరుకాని, మిమ్మల్ని ఆయనకాని, వదలిపెట్టకమునువు, మీకు విజయపుట్టిందో లేదో అన్న సందేహం........ఆ సందేహనివారణ కూడా అయిపోయింది...."

"విజయతండ్రిగారిని నేను వదిలిపెట్టలేదే!....ఆయన నన్నూ వదిలిపెట్టలేదు....మీకా సందేహం ఎందుకు కలిగింది?"

"ఎవరో చెప్పేరు...."

"విజయ చెప్పిందా?"

"లేదు....ఎవరో జ్ఞాపకంలేదు....ఆయన పోయేవరకూ మీరూ విజయా ఆయనా కలిసే ఉండేవారన్నమాట."

"అవును."

"ఆయన పోయాక ఎన్నాళ్లున్నారు మీరు బెజవాడలో?"

"ఆరునెల లున్నానేమో....ఆరునెలలుకాకపోతే ఏడాదేమో...ఏడాదికి తక్కువే. ఆయన పోయిన నెలా రెండునెలలకల్లా కూనీ జరిగింది. ఆ తర్వాత సుమా రొక సంవత్సరం బెజవాడలోనే ఉన్నాను."

"కూనీ జరిగిన కొన్నాళ్ళకి బెంగుళూరు వచ్చేసేరు కాబోలు!"

"లేదు....కేసు జరిగింది. నేను సాక్ష్యం ఇవ్వవలసి వచ్చింది...."

"ఈ సంగీతంచెప్పే అతన్ని....రాజభూషణరావుని ఎవరు చంపేరు?"

"రాజావారిమనిషే. జగన్నాధరావన్నతను - రాజావారికి దూరపుచుట్టం....రాజభూషణరావునీ నన్నూ విడతీయడానికి ప్రయత్నిస్తూ ఈ జగన్నాధరా వన్నతని వలలో పడ్డారు విజయతండ్రిగారు.... ... ఒకనాడు బందరు వెళ్తున్నానని చెప్పి పొద్దున్నబండికి బయలుదేరేరాయన. విజయని దాసీమనిషికి ఒప్పచెప్పి రాజభూషణరావుని కలుసుకునేందుకు అలవాటుప్రకారం మధ్యాహ్నం అతని స్నేహితుడి గదికి

వెళ్ళేను. ఆయన బందరు వెళ్ళలేదు. నాకు తెలియకుండా వీధులంట నా వెంట పడా రాయన. రాజభూషణరావూ నేనూ పట్టుపడ్డాం. రాజభూషణరావు తప్పించుకు పారి పోయాడు.... జగన్నాధరావుఇల్లు ఆప్రాంతాలలోనే. విజయతండ్రిగారు నన్నువీధిలో పెట్టి కొట్టుంటే అతనుబయటకివచ్చి అడ్డుపడ్డాడు.విజయతండ్రిగారు అతన్నెరుగును. ఆ రోజున అతనువచ్చి నన్ను రక్షించకపోతే నా ప్రాణం అప్పుడే పోయుండును. వీధిలో పరువు పోగొట్టుకోకుండా ఇంటికి తీసుకువెళ్ళి ఏమితోస్తే అది చెయ్యమని సలహా ఇచ్చాడు. తనుకూడా ఇంటికి వచ్చి మధ్యవర్తిత్వం అవలంబించి, రాజ భూషణరావుని నే నెన్నడూ కలుసుకోనని నాచేత వాగ్దానం చేయించాడు. విజయ తండ్రిగారు ఊళ్ళోలేకుండా చూసి నన్నుచూడడానికి ఇంటికి వస్తూఉండేవాడు. రాజ భూషణరావువిషయంలో విజయతండ్రిగారికంటెకూడా తను నామీదఎక్కువ కాపలా కాస్తూవచ్చాడు. అన్నివిధాలా నన్ను లోబరచుకునేందుకు ప్రయత్నం చేసేడు. చక్కటి కబుర్లుచెప్పి విజయతండ్రిగారిని బుట్టలోవేసుకున్నాడు. రాజావారిపేరుచెప్తే ఇద్దరం లొంగుతామని చెప్పి ఒకనాడు రాజావారు బెజవాడ వచ్చినప్పుడు వారిని పిలిచి తన యింట్లో నాచేత సంగీతం పాడించాడు. ఆ రోజునుంచీ రాజావారి పరి చారకులు నా వెంట తిరుగుతూవచ్చారు. జగన్నాధరావుకి అది మళ్ళీ నచ్చలేదు - ఒకనాడు రాజభూషణరావూ నేనూ అతనికి పట్టుపడ్డాం. ఇదే సమయమని నన్ను భయపెట్టి బలాత్కారంగా నావిషయమై ఉన్న కోర్కె తీర్చుకున్నాడు. అప్పటినుంచి అనేకసార్లు, అసహ్యంచూకుంటూ, అతను రమ్మన్నచోట్లకి రమ్మన్నప్పుడు అవకాశం చేసుకుని వెళ్తూఉండేదాన్ని. రాను రాను రాజభూషణరావుకి దూరమైపోయాను. ఈ లోపున నాకు రాజావారితో సంబంధంకూడాఏర్పడింది. మూడునాలుగురోజులు పైఊళ్ళలోఉండవలసి వచ్చేపనులు విజయతండ్రిగారికి పురమాయించి బాగాడబ్బిచ్చే వారు. మొదట్లొ ఒకటిరెండు రాత్రుళ్లు రాజావారే మా ఇంటికివచ్చారు, తర్వాత ఆయన బంగళాకి నేను వెళ్తూవచ్చాను-ఆయనకి నేనంటే ఎంతో ఇష్టంగా ఉండేది. జగన్నాధరావుకి ఇది తెలిసింది.... మొదట్లొ ఒకనాడసలు రాజావారు ఇంట్లోఉండగా జగన్నాధరావువచ్చి తలుపుకొట్టేడు. వారికొకటేకంగారు. వారినిలోపలకూర్చోమని, వెళ్లి, మా ఆడపడుచు యింట్లో ఉందని చెప్పి తప్పించుకు మళ్ళీ లోపల పడ్డాను.... ఆ సారే జగన్నాధరావు అనుమానపడ్డాడు. కొన్నాళ్ళకి జగన్నాధరావు విజయ తండ్రిగారికి చెప్పేసేడు. ఆయన మళ్ళీ ఎగిరి పడ్డారు. కొట్టేరు.... రాజావారికి కబురు వంపేను. కొన్నాళ్లు పోనిచ్చి, రాజావారే ఆయన్ని పిలిపించి ఆయనతో మాట్లాడేరు. జగన్నాధరావుని నమ్మవద్దని చెప్పేరు. జగన్నాధరావుతో జాగ్రత్తగా ఉండమన్నారు.... ఇదిజరిగిన రెండుమూడు నెలలకి గుడివాడతాలూకా భూముల దస్తావేజు పుట్టింది. ఎవరో జమీందారుగారికి బాకీ ఉండి భూములు వ్రాసి ఇస్తామన్నారనీ, భూములుమంచివనీ, బాకీసొమ్ముకి జమీందారుగారికి విజయతండ్రి

గారు నోటువ్రాసిఇస్తే భూములువారికి ఒప్పచెప్తామనీ, అయిమీజుతోనే నోటుసొమ్ము నాలుగైదేళ్ళలో తీర్చివేయవచ్చుననీ, ఇష్టమైతే వచ్చి దస్తావేజు వ్రాయించుకోమనీ విజయతండ్రిగారికి దివాణంలో నుంచి కబురొచ్చింది. బాకీదారు విజయతండ్రిగారికి ఆస్తివ్రాసిచ్చేసేడు. మీరుచూసినకాగితమే. నోటువ్రాసి దివాణంలోఇస్తే, రాజావారు, నోటు తిరక్కొట్టేస్తూ, తీర్చగలిగినప్పుడు తీర్చమనీ, లేకపోతే తీర్చనేఅక్కరలేదనీ విజయతండ్రిగారికి చెప్పేరు."

"ఈ సంగతి విజయమేనత్తకీ మేనత్తభర్తకీ తెలుసునా అండి?"

"తెలుసును. తెలియకేమీ?....దస్తావేజులో మా ఆడపడుచు భర్త సాక్షిసంతకం ఉంది. బావమరదు లిద్దరూ స్వంతసేద్యం చేద్దామని నిశ్చయించుకున్నారు. మా ఆడపడుచూ భర్తా అల్లూరునుంచి గుడివాడ ఆ సంవత్సరమే కాపురం మార్చేరు. నోటుబాకీ వెంటనే తీర్చనక్కరలేదని రాజావారు చెప్పేరంటే, నోటు పుచ్చేసుకోమని సలహాచెప్పినది మా ఆడపడుచు భర్తే...అడగండి కావలిస్తే ఎప్పుడైనా?"

"విజయ తండ్రిగారూ మీరూ కాపురం గుడివాడకి మార్చలేదా?"

"లేదు. నేను గుడివాడ వెళ్ళనని పంతంపట్టి కూర్చున్నాను. హోరా హోరీని యుద్ధాలు జరుగుతూ వచ్చేవి. ఆరు నెలలలా గడిచాయి. బెజవాడా గుడివాడా మధ్య ఆయన తిరుగుతూ ఉండేవారు. ఈలోపున ఆయన పోనేపోయారు........ కర్మ నేనే చేయించాను. విజయ మేనత్తనీ భర్తనీ జోక్యం కలుగచేసుకోనివ్వ లేదు. కాగితాలూ పెట్టెలూ ఉన్న గది ఎప్పుడూ తాళం వేసి ఉంచాను. కర్మకి సొమ్మిస్తానంటే రాజావారు సొమ్ము అప్పుడే పంపించారని చెప్పేను. భూములు నాకు ఒప్పచెప్పమన్నాను. ఆఖరికి నాపేరట కవులైనావ్రాసిమ్మన్నాను.... మా వివాదాలు అలాగేఉన్నాయి. ఇంతలో కూనీజరిగింది........విజయ తండ్రిగారు పోయాక రాజభూషణరావు నన్ను చూడడానికి తరచు వస్తూఉండేవాడు. రానిచ్చే దాన్ని. అతనంటే నాకు జాలిగాఉండేది. విజయతండ్రిగారు పోయినకొత్తలో రెండు మూడు నెలలు నేను రాజావారిని కలుసుకోలేదు, ఎవరికో ఇచ్చి రెండు మూడు వందల రూపాయిలు నాకు వారే పంపించారు. అంతే. పని ఏమన్నా ఉంటే రాజభూషణరావే ఎప్పుడో ఒకప్పుడు వచ్చి చూసిపోతూ, మొగతోడుగా ఉండేవాడు...జగన్నాధ రావుని చేరనిచ్చేదాన్ని కాను. అతనికి కడుపుమంటగా ఉండేది. రెండు మూడు సార్లు మా ఇంట్లోనే కొట్టుకునేటంత పనయింది. వీధుల్లో కూడా వాళ్లుకలుసుకుంటే గలాటాలవుతూఉండేవి. ఎప్పుడో ఒకప్పుడు రాజభూషణ రావునీ నన్నూకూడా చంపేస్తానని భయపెట్టేడు జగన్నాధరావు. నేను రాజావారికి కబురు చేసేను. రాజభూషణరావు కుటుంబ స్నేహితుడనీ, దిక్కులేనిదాన్ని కనుక అతడు నాకు సహాయకరంగా ఉంటుంటే ఈ జగన్నాధరావు నన్ను హింసిస్తున్నాడనీ వారికి ఉత్తరం వ్రాసి పంపేను. వారు జగన్నాధ రావుని పిలిచి కూకలేసే

రట...ఆ రాత్రే కూనీ!...కత్తులతో గుమ్మంలో కాచుకునిఉండి, రాజభూషణ రావుని నరికి, పారిపోదామని చూసేరు. పట్టుబడ్డారు. రాజా వారు జగన్నాధరావుని పిలిచి కోప్పడ్డ సంగతి పోలీసుకి తెలిసిపోయింది. ఆయనకీ నాకూ ఉన్న సంబంధం నేను పోలీసువాళ్లకి చెప్పేస్తానని రాజావారు భయపడ్డారు. జగన్నాధరావు మీదా మరొకడిమీదా పోలీసువాళ్లు హత్య కేసు పెట్టేరు. నా భర్త దివాణంలో పనిచేస్తూ పోయిన మనిషి కనుక రాజావారి సహాయం నేను కోరేననీ, రాజావారి దూరపు చుట్టం కనుక జగన్నాధరావు విషయం వారికి నేను మనవి చేసుకున్నాననీ, రాజావారిని నేను ఎన్నడూ చూడలేదనీ చెప్పేను. పోలీసుకీ అదే చెప్పేను. కోర్టులోనూ అదే చెప్పేను. ఆయన విషయంలో అంత తెలివిగానూ అంత జాగ్రత్తగానూ ప్రవర్తించినందుకూ, సాక్ష్యం ఇస్తూ ఆయన గౌరవం కాపాడినందుకూ, మెచ్చుకుని, కేసు అయాక నన్ను బెంగుళూరు పంపిస్తాననీ, బెంగుళూరులో ఇల్లూ ఆస్తీ కొనిపెట్తాననీ, నాకు మరే బెంగా లేకుండా చేస్తాననీ వారు వాగ్దానం చేసేరు. చేసినట్టే, కేసు ఆఖరయాక, బెంగుళూరు పంపించారు, ఇల్లు కొనిపెట్టేరు. డబ్బిచ్చారు. స్వదేశంలో ఉన్న ఆస్తులగురించి ఏదో ఏర్పాటు చేయస్తామన్నారు. బెంగుళూరులో ఒక వేసవికాలం నాకు దివ్యంగా గడిచించి....నాగవ్వ వారి బంగాళాలో పని చేస్తూఉండే దాసి. వారే నాగవ్వనినాకు తోడుగా ఉండమని పంపించారు. అందుకే నాగవ్వకి నేనంటే గురి.....నా దురదృష్టంవల్ల ఏడాది తిరగకుండా రాజావారు హఠాత్తుగా చెన్నపట్నంలో ఆసుపత్రిలో పోయారు. ఈ ఇల్లూ స్థలమూ నాపేరట ఉన్నాయి. అంతే...తిండికి గతిలేదు.....చేతిలో ఉన్న డబ్బు అయిపోయాక, రెండు మూడిళ్లల్లో ఆడపిల్లలకి సంగీతం నేర్పి జీవనోపాధి చూసుకుందామనుకున్నాను. బాగా పాడగలిగేదాన్ని. నేర్పలేకపోయేదాన్ని....సుమిత్రరావుగారు అప్పుడు ఇక్కడికి చాలా దగ్గరలో ఉండేవారు. వారి పెద్దమ్మాయికి సంగీతం నేర్పేదాన్ని. వారితో పరిచయం అలా కలిగింది. రెండు మూడేళ్లు చూసేను. నగలు తాకట్టుపెట్టడందాకా వచ్చింది....నాటక కంపెనీలోకూడా చేరేను. రెండు కన్నడ నాటకాలలో చిన్న పాత్రలు తీసుకున్నాను. ఆ కంపెనీలో ఉన్నది రెండు మూడు నెలలేకాని, అప్పటికప్పుడే దిగనాసిల్లుతున్నాను.....విజయకి అయిదేళ్లుంటాయేమో అప్పుడు...."

"దిగనాసిల్లేనన్నారే,.........అవిధంగా బెజవాడలో జీవితం గడపలేదా?.... విజయ తండ్రిగారు పోకమునుపుకాని, పోయాకకాని?"

"అంటే?"

"మీరు చెప్పినదే....అంటే...."

"సందేహించకండి. అడగండి. మీ ప్రశ్న నాకు బోధపడలేదు.....లేకపోతే జవాబు చెపను."

" విజయకి అయిదేళ్లు వచ్చినప్పటినుంచీ, సామాన్య వేశ్యలాగే.... బెంగుళూరులో మీరూ వృత్తి సాగించానని చెప్పేరని అర్థం చేసుకున్నాను...."

" అవును— "

" బెజవాడలో మీరు వృత్తి సాగించలేదా అని అడిగేను.''

" బెజవాడలో వృత్తెక్కడ ?....మీ రడిగేదిప్పుడు బోధ పడింది!—బెజవాడలో ఊళ్లోవాళ్ళందరూ, డబ్బివ్వగలిగినంతమాత్రాన, రాత్రికాని పగలుకాని నా తలుపు కొట్టేవారు కాదు...."

" జగన్నాథరావో ?....రాజభూషణ రావో ?....జమీందారుగారో ?

" జగన్నాథరావు దగ్గర ఎన్నడూ నేను డబ్బు పుచ్చుకోలేదు. రాజభూషణ రావుకి నేనే ఎప్పుడైనా డబ్బిచ్చానేమో కాని నాకతనెన్నడూ డబ్బివ్వలేదు. సరే, రాజావారు ముఖ్యంగాఇచ్చినది అప్పటికి గుడివాడతాలూకా భూములే—అవి విజయ తండ్రిపేరటే పుట్టేయి.....వారిదగ్గర డబ్బు పుచ్చుకునేందుకు నే నెన్నడూ సందేహించలేదు. వారు బ్రతికి ఉంటే ఎన్నడూ సందేహించకపోదును.... ఆజన్మాంతరమూ వారిపోషణలోనే ఉండాలని నిశ్చయించుకుని బెంగుళూరు వచ్చాను.... దేవుడు నాకు అడ్డు తగిలేడు....అన్ని విషయాలలోనూ నాకు అడ్డు తగులుతూనే ఉన్నాడా పాపిష్టి దేవుడు. ఈనాటికి నా పాపాలన్నీ పూర్తిగా పండేయి,....అన్ని కష్టాలకీ తట్టుకుని, అందరికీ లోకువై, సిగ్గుమాలిన బ్రతుకు బ్రతుకుతూ, దానికి చదువుమాత్రం చెప్పించాను. చదువు పూర్తయింది. పిల్ల నేడోరేపో ఇంటికి వచ్చేస్తుంది. దానికి అప్పుల జాబితా తప్పితే నే నివ్వగలిగినదేమీ లేదు....''

" ఇంకా ఏమివ్వాలంటారు ?....చదువు చెప్పించారు చాలదూ ?—ఇకమీదట విజయనే సంపాదించి మిమ్మల్ని పోషించ నివ్వండి. ఈ ఇల్లు మీదీ. మీరిక్కడే ఉండండి. మీరే మార్గంతప్పి సంపాదించిన ఆస్తులుకనుక మీరు అనుభవించడంలో తప్పేమీ లేదు. ఈ ఇల్లుకాని, మీ గుడివాడ తాలూకా భూములుకాని విజయకి రావాలని మీరు తాపత్రయపడడం శుద్ధ తప్పు. సిగ్గులేక విజయ మేనత్త కుటుంబమూ ఆ భూములు అనుభవిస్తున్నారు కాని, మీరు చెప్పినదంతా విన్నాక విజయకి ఈ ఇల్లంటే ఎంత అసహ్యమో ఆ భూములంటేకూడా అంతఅసహ్యమూ కలుగుతుంది.... ఆ భూముల విషయంలో మీకు నేను సహాయపడలేను. సహాయ పడడానికి ఒప్పను....విజయకూడా ఒప్పదు. నాకు తెలుసును, వినండి."

"అది ఒప్పదు. నాకు తెలుసును. అన్నిసంగతులూ తెలిస్తే అసలే ఒప్పదు.... మీరు ఒప్పిస్తారేమోనని ఆశపడ్డాను.... ఇక్కడ నా అప్పులసంగతి ఏమికాను?''

"విజయ సంపాదించి తీరుస్తుంది. అడగండి."

"అంతేనా మీ సలహా?''

"అంతే."....

తర్వాత ఆమె మాట్లాడలేదు. నే నింటికొచ్చేసేను. (సశేషం)

# వార్తాచిత్రాలు




"పోలీసువారు త్రాగుడునేరమును నివారించుటకు బదులుగా వారే త్రాగుడు నేరము చేయుట మిక్కిలి శోచనీయము" అంటూ ప్రొద్దుటూరు స్టేషనరీ సబ్-మేజిస్ట్రేటు గారు నెం. 289, నెం. 945 పోలీసులకు మద్య నిషేధ చట్టంప్రకారం మూడు నెలల కఠినశిక్ష విధించిరి. —వార్త

# నా చిన్ననాటి ముచ్చట్లు

కె. యన్. కేసరి

## లలితకళాభిలాష

చిత్రకళ, నాట్యకళ, గానకళ మొదలగు లలితకళలందు నాకు చిన్నప్పటినుండి నైజము గానే ఎక్కువ అభిలాషగలదు. శాస్త్రయుక్తముగ ఆయావానిని అభ్యసించుటకు నాకు పూర్తిగ అవకాశము లేకపోయినను ఆయావానినిచూచి, వాని ప్రాశస్త్యమును తెలియగల సహృదయు డను అని నా మిత్రు లనుచుందురు. నాకుగల ఈ సహజాభిలాష, అభిమానము - ఎట్లు నా జీవితమున వ్యక్తమైనదియు, మరియు ఆయావానిని హర్షించుటలో నా అనుభవములను వివరింతును. వీనిని రెండుభాగములుగ విభజింపవచ్చును. చిన్ననాడు మా యూరియందలి నా అనుభవములు; నగరవాసుడనైన పిదప నాగరికులతోడి నా యనుభవములు.

### గృహనిర్మాణము:

గృహనిర్మాణ మొకశిల్పము. దాని రహస్యము లెరుంగుటయు నొక విశేషమే. చిన్న తనములోనే నాకు ఇందు నేర్పు గల్గినది. కుఱ్ఱతనమున ఆడబిడ్డలకు బొమ్మరిండ్లను అంద ముగ కట్టుచుంటిని. అందువల్ల ఊరివారందరు వారిబిడ్డలకు బొమ్మరిండ్లు కట్టిపెట్టుమని నన్ను ఆశ్రయించేవారు. ఈ విద్య నేను శిక్షణలేకనే అలవరచుకొన్నది. తరువాత పెద్దవాడనై ఆరోగ్యసూత్రముల ననుసరించి పూరియింటిని మట్టిగోడలతో నిర్మించగల సామర్థ్యమును సంపాదించియున్నాను. కాలక్రమమున పట్టణమునందు కట్టబడు పెద్దభవనములు ఎట్లు నిర్మించిన అందముగాను, ఆరోగ్యప్రదముగను ఉండునో ఆ రహస్యముల తెలిసికొంటిని. ఇప్పటికి మద్రాసులో లక్షలాదిపెట్టి కట్టించిన నా భవనములన్నియు నా స్వంత ప్లానులతో కట్టినవే. నా యీశక్తినెరింగిన మిత్రులుకూడ నా చేతనే తమ యిండ్లకు భవనములకు ప్లాను లను చెప్పించుకొందురు. కావున ఇండ్లు కట్టుటయందును, కట్టించుటయందును నాకు కొంత నేర్పరితనము గలదని చెప్పకొనుటకు సాహసించెదను.

## చిత్రకళ, చిత్రలేఖనము:

ఇందును చిన్నతనమునసే అభినివేశము ఏర్పడినది. మా అమ్మ పండుగలకు ఇల్లంతయు సున్నము కొట్టించేది. ఆ తెల్లనిగోడలు చూడగానే నాకు ఉత్సాహముకల్గి బొగ్గుతీసికొని నాకు తోచినట్లు బొమ్మలు గీచేవాడను. వానిని చూచినవారు ఆయాబొమ్మల ముక్కు కన్నుతీరు బాగున్నదనియు, నా చేతిలో శిల్పమున్నదనియు మెచ్చుకునేవారు కాని, మా అమ్మ తెల్లని గోడలను బొగ్గుతోగీచి పాడుచేసితినని నన్ను తిట్టేది.

నేను మద్రాసు వచ్చిన పిదప మద్రాసులో గోవిందప్పనాయుని వీధియందు టి. సుబ్బన్న అండ్ బ్రదర్సు (T. Subbanna & Bros) అను పేరుతో చిత్రములవ్రాయు ముచ్చివారుండిరి. వీరు కార్వేటినగరం సంస్థానమున రంగుచిత్రములను వ్రాయుచుండిరిగాని, ఆ సంస్థానము తగ్గుదశకు రాగానే వారు మద్రాసుకు వచ్చి బొమ్మలనువ్రాయు వ్యాపారమును స్థాపించిరి. వీరు పలకలమీద చింతవిత్తనముల జిగురుతో బొమ్మలనువ్రాసి దానిమీద సన్న బంగారురేకులను అంటించి మెరుగుపెట్టి పటములను తయారుచేయుచుండిరి. అట్లు తయారైన పటములు యెంతకాలమైనను మాసిపోక మెరుగుతో తళతళ లాడుచుండును. వీరు ఈలాటి పటములను తయారుచేయుటలో చాలా మంచినేర్పరులు. పూర్వము మద్రాసులో ఈపటములకు మంచి గిరాకీ యుండెడిది. మద్రాసులో ఇప్పుడును అనేకులఇండ్లలో వీరి పటములు గలవు. ముఖ్యముగ గోవిందప్పనాయుని వీధియందలి ఉప్పుటూరి ఆళ్వారుశెట్టిగారి రామానుజ కూటమున ఇవి గలవు. ఈ పురాతన చిత్రకళ క్రమముగ నశించిపోవుచున్నది; నశించిపోయినదనే అనవచ్చును. నేను వీరివద్ద ఈ పటములను వ్రాయుపద్ధతిని కొంతకాలము నేర్చుకొంటిని. అయితే నా వృత్తి వ్యాపారములు ఈ కళావ్యాసంగమున కాటంకములైనవి.

అయినను నాకు సైజముగాగల చిత్రకళాభిమానము ఈ అభ్యాసమువలన స్థిరపడినది. అందుచేతనే ఎక్కడ ఏ ఉత్తమచిత్రము కన్పించినను అది నన్నాకర్షించును; అది విలువకు లభ్యమగుచో, తెచ్చి మాయింట నుంచుకొనుటకు కోరుదును. చిత్రకళోపాసకులను నేను పూజించి, ఆదరించుటకు అదే కారణము. వెనుక "గృహలక్ష్మి" లో మొదట పనిచేసిన శ్రీ కొత్తా శ్రీరామశాస్త్రి కుమారులు నా కభిమానపాత్రులై నావల్ల కొంత సాహాయ్యమును పొందిరి. పిదప పెనుకొండవాస్తవ్యులు వెంకట్రావుగారు, చిత్రకళలో చక్కని నేర్పుగలవారు, నాకు పరిచయమైరి. వారి బొమ్మలు మద్రాసులో పలువురిఇండ్ల నలంకరించియున్నవి. వీరు అప్పుడప్పుడు గృహలక్ష్మి పత్రికకొరకు త్రివర్ణ చిత్రములను నేర్పుగ చిత్రించి యిచ్చెడివారు. ఈ చిత్రకళోపాసకుని నా శక్తికొలది ప్రోత్సహించుచుంటిని. పాపము వా రిప్పుడు స్వర్గస్థులు.

## శ్రీమతి రత్నాల కమలాబాయిగారు:

ఈమెయు తాను చిత్రించిన త్రివర్ణచిత్రములతో గృహలక్ష్మిపుటల తరచు అలంకరించు చుండినసంగతి పాఠకులకు జ్ఞప్తియుండును. ఈమె చిత్రకళానైపుణ్యమునకు మెచ్చి ఒకసారి గృహలక్ష్మి స్వర్ణకంకణమును తొడిగి గౌరవించితిని. ఇంకను అనేకులు చిత్రకారులు వ్రాసిన చిత్రములను కొని ప్రచురించి వారికి ప్రోత్సాహ మొసంగితిని. ఆ పఠముల నన్నిటిని నా యింటియందు గోడల కలంకరించితిని. మద్రాసులో అప్పుడప్పుడు జరుగు చిత్రకళా ప్రదర్శనములకు నా పఠములనుకూడ తీసికొనిపోయి వారు ప్రదర్శించుచుందురు.

## నాట్యకళ:

ఆహార్యము, అభినయము, సంగీతము ప్రాధాన్యముగాగల నాట్యకళ బహువిధములు. వీధి భాగవతములు, తోలుబొమ్మలాటలు, భరతనాట్యము, నృత్యము, ఆధునిక నాటకములు - ఇవి అన్నియు ఆ కళక్రిందికే వచ్చును. వీటన్నిటిని క్రమముగా చూచి ఆనందించితిని. వీటన్నిటి పరిణామము ఈ 60 సంవత్సరములుగా నా శక్తికొలది గమనించి గ్రహించితిని.

## వీధి నాటకములు:

నా నాట్యకళాభిమానము వీధినాటకములను చూచుటతో ప్రారంభమైనది. బాల్యమున ఈ వీధి భాగవతములన్న నాకు చాల వెర్రి. మా వూరిలో మద్దెలమీద దెబ్బపడిన శబ్దము వినగనే నే నక్కడ హాజరుగ నుండెడివాడను. నాకు ఈ పిచ్చి ఎందువల్ల కలిగినదంటే, నాకు ఇద్దరు మేనమామ లుండెడివారు; పెద్దమామయ్యపేరు ములుకుట్ల మహాదేవయ్య; చిన్నమామయ్య పేరు ములుకుట్ల సుబ్బయ్య. పెద్దవారు చక్కడ పాడనేర్చినవారు; చిన్నవారు చక్కగ ఆడ నేర్చినవారు. మా ఊరికి భాగవతులు వచ్చి నాటకములు ఆడునప్పుడు పెద్ద మామయ్యగారిని తెరచాటున పాడుటకు పిల్చేవారు. చిన్న మామయ్యను వేషములువేయుటకు పిలిచేవారు. వీ రిరువురితో కూడ నేనును హాజరయ్యేవాడను. కనుక మేనమామల పోలికలు నాకు రాక పోయినను వీరిగాలి నాకును కొంత సోకి ఆటపాటలమీద అభిరుచిమాత్రము కలిగియున్నాను.

## మాలనాటకములు:

నా కుఱ్ఱతనమున మొట్టమొదట నే జూచినవి మాలనాటకములు. ఆ రోజులలో మా వూరి మాలవాడనుండి మాలవారువచ్చి గ్రామమునకు దూరముగ స్థలమును ఏర్పాటు చేసుకొని రామాయణనాటకమును ఆడేవారు. వారు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు మొదలైన వేషములు ధరించి నాటకములాడేవారు. మాసినగుడ్డలను, లక్కరంగు ఆభరణములను ధరించేవారు. కాళ్ళకు గజ్జెలు కట్టుకునేవారు. వాటి ఘల్లుఘల్లునకుతోడు తాళము తప్పెటలు వీరికి (ప్రక్కవాయిద్యములు.) పాడునప్పుడు వీరు అప్పు డప్పుడు తలయెత్తి వెర్రికేకలను

వేయుచుందురు. వారు పాడెడువానికి తిలాలోక లేకపోయినను రామాయణకథనే వారిభాషలో కీర్తనలుగా పద్యములుగా తమ యిష్టమువచ్చినట్లు కవనముగట్టి పాడేవారు. ఈ నాటకములను చూచుటకు ముఖ్యముగా బ్రాహ్మణేతరులే వచ్చేవారు. ఈ నాటకములాడు మాలవారు బ్రాహ్మణుల నాశ్రయించరు. వేషములు వేసేవారందరును పురుషులే. సీతా రామలక్ష్మణుల అరణ్యవాసము, లక్ష్మణ మూర్ఛ, సీతమ్మశోకము వీటి నాడుచు ఆయాపాత్ర లభినయించునపుడు అమ్మ లక్కలు కండ్లనీళ్లు పెట్టుకొని దుఃఖించేవారు. ఆ రాత్రి అంతయు నాటకము ఆడినందులకు వారికి పదిమందికలిసి సలకవరిగెలను, దివిటీలకు ఆముదమును యిచ్చేవారు.

ప్రతిపూరి సమీపమునను మాలవాడ, మాదిగవాడ యని రెండుండును. మాలవారు మాదిగవారికంటె గొప్పవారమని చెప్పుకొందురు. మాలవాడలో శ్రీరాముని దేవాలయమును కట్టుకొని రామభజన చేయుచుందురు. వీరిలో హెచ్చుగా భక్తిపరులైనవారు కొందరు ప్రతినిత్యము మొగమునిండ తిరుమణి శ్రీచూర్ణములను, తులసిపేరులను ధరించి భజనకీర్తనలు పాడుచు లౌకిక ప్రసంగములలోను మెట్టవేదాంతమును మాట్లాడుచుందురు. వీరిని మాలదాసరులందురు. మిగతవారును పండుగ పబ్బములకు నామాలుధరింతురు. వీరు సామాన్యముగ ఊరిలోని కాపుల‌యిండ్ల కమతముచేసి జీవింతురు. మాదిగవారు కసాయిపనులుచేయుచు, చచ్చిన జంతువుల చర్మములు వలిచి చెప్పులు, బావులలో నీళ్లు పొలములకుతోలు మోటబొక్కెనలుకుట్టుచు జీవింతురు. వీరు కొందరు పశువులు సుఖముగా నుండి కళేబరములు దొరకక తమ జీవనము గడవని కాలమున దొంగతనముగా పొలములలోని పశువులను తోలుకొనిపోయి చంపి, తోళ్లు వొల్చుకొని పోవుచుందురు. కర్కాశులు కొందరు డబ్బుతీసుకొని కూనీనేరములును చేయుచుందురని నా చిన్నతనములో చెప్పుకొనేవారు. వీరు తప్పెటలు వాయింతురు. ఆయా కారణములచే మాలవారు వీరికన్న అధికులుగా తలంచుటయు పరిగణింపబడుటయు జరుగుచున్నది.

వీధి భాగవతము:

తర్వాత మా గ్రామములో నేనుచూచిన వీధిభాగవతములు, ఉత్తమతరగతివి. ఈ భాగవతములాడినవారిలో ముఖ్యమైనవి రెండుజట్లు. ఒకటి: మా గ్రామసమీపమున తమ్మవరము అనియొక గ్రామమున్నది. ఆ గ్రామమునుండి వచ్చు తమ్మవరపు బోగము వెంకటస్వామి జట్టు. రెండవది కూచిపూడి బ్రాహ్మణుల భాగవతము జట్టు.

వెంకటస్వామిజట్టులో చేరినవారందరు బోగమువారే. పురుషులు పురుషవేషమును స్త్రీలు స్త్రీవేషమును ధరించేవారు. వెంకటస్వామి హాస్యమును ప్రదర్శించుటలో చాల మేధావంతుడు. ఆ నాటకసమాజమంతయు వెంకటస్వామి చేతులలోనే యుండినది. వీరు మావూరికి వచ్చినపుడు పాతకచ్చేరి సావడిలో బసచేసేవారు. పిమ్మట గ్రామకరణమును మునసబును దర్శించి

నాటకప్రదర్శనమును యేర్పాటుచేసుకొనెదరు. ఒకనాటిరాత్రి నాటకమునకు ఒక వరహా సామాన్యమైన యేర్పాటు. వీరందరుకలిసి ఇంచుమించు 10 మంది యుందురు. వీరికి వూరిలో ప్రతియింట నొక్కొక్కరికి భోజనముపెట్టుదురు. సత్యభామవేషమువేయు స్త్రీ అందమైనది. కనుక అందరును తమయిండ్లకు ఆమెనే భోజనమునకు పిలుతురు. ఆమె భోజనమునకువచ్చిన గారెలు, బూరెలు, పరమాన్నముతోకూడ విందుచేసెదరు. అందువలన ప్రతియింటికి సత్యభామయె భోజనమునకు వచ్చునని వెంకటస్వామి కబురుపంపెడివాడు. కనుక జట్టు అందరికీ పిండివంటలతో కూడ విందు జరిగేది. ఆ దినము నాటకమునాడు స్థలమునంతయు, సాయంకాలము ముదాం పెట్టివాండ్రు చిమ్మించి నీళ్లుచల్లి బాగుచేయుదురు. సుమారు రాత్రి 10 గంటలకు నాటకము ప్రారంభమగును. ఊరి జనులందరు వచ్చి కూర్చుందురు. నాటకరంగమునకు ముందు కరణం మునసబులు ఇంక అనేకమంది బ్రాహ్మణులు, కాపులు, రెడ్లు కూర్చుందురు. వేషము యెప్పుడు వచ్చునాయని ఆత్రముతో వేచియుండెదరు. సాధారణముగ వీరు మొదట భాగవతనాటకమును ప్రదర్శించెదరు. దీనిలో ముఖ్యపాత్రలు కృష్ణుడు, సత్యభామ, గొల్లభామ, సుంకర కొండడు మొదలగునవి. మొదటివేషము (అది సామాన్యముగా భామవేషమో, రాజవేషమో) తెరచాటు నుండి వెలుపలికి వచ్చునపుడు రెండు దివిటీలను ఆవేషము మొగమెదుట మోటించి నిల్పి వానిపై గుగ్గిలపుపొడిని జల్లెదరు. ఆ వెలుతురున తెరలోని వేషము బయట పడును. ఇవినేడు సినిమారంగమున Still pose అనియు, నాటకరంగమున Flash light అనియు చెప్పబడు విశేషముల మాతృకలు అనదగును. సామాన్యముగ నీ తెరగుడ్డకు సభలో కూర్చున్న వారి దెవరిదో యొకరిది తలగుడ్డ అడిగి తీసికొని పట్టుదురు.

ఈ వేషధారులు ధరించియుండు ఆభరణములన్నియు తేలిక కొయ్యమీద చెక్కి, కాకి బంగారము అంటించబడినవి. వాటిని యిప్పుడు కూడ కొండపల్లిలో తయారుచేయుచున్నారు.

ఆ కాలమున సత్యభామ తన జడను తెర ఇవతలవేసిన "తనను ఈ సభలో ఎవరైనను భాగవతవిషయమై ప్రశ్నించినచో జవాబు చెప్పగలను" అని సూచన. ఒక్క భాగవతముననే ఏమి? సామాన్యముగా నీ భామవేషమువేయు వ్యక్తి ఆ నాటి సకలశాస్త్రములను తెలిసినదై యుండును. ఈ వేషమున పూర్తిగా యుపన్యసించుటకు ఒకటి రెండు రాత్రిళ్ళుపట్టును. అందు శాస్త్రముల నన్నిటిని తడవి వేషధారి తన విద్వత్తు ప్రకటించును. చూలింతయైన దేవకీదేవి-పిండోత్పత్తిక్రమము, గర్భరక్షక విధులు, పురిటింట సన్నాహము, బాలింత పథ్యపానములు, శిశుపోషణ పద్ధతులు - మొదలైనవాని నన్నిటిని ఆయుర్వేద వైద్యశాస్త్రరీత్య ఉపన్యసించును. సత్యభామ శృంగారరసమందలి సాత్వికావస్థలను, నాయికా నాయక లక్షణములను ఉపన్యసించును. దీనినే భామ కలాపము అందురు. ఇదియొక విధముగ నాటికాలమున ప్రయోజన విద్యావిధానము అనవచ్చును. పైవిధముగా నీ భామ తన జడను తెరలోపలనుండి రంగస్థలము వైపున తెరబయటకుజారవిడువగనే సభాసదులలో, ముఖ్యముగ పండితోత్తములకు ఉక్రోషము

వచ్చి— "ఏమీ ఈ సానిది మావంటి పండితులున్నారనియైన తెలుసుకొనకుండ, జడ ఇవతల వేసి అవమానించుచున్నదే" అని ఉగ్రులై చీకాకుపడి ఆమెను భాగవతములోని పద్యములను కృష్ణకర్ణామృతములోని శ్లోకములను చదివి భావార్థముల చెప్పుమని అడిగెదరు. అవి చెప్పి నంతనే విడువక, ఇంకను భరతశాస్త్రమునందును, అలంకారశాస్త్రమునందును ప్రశ్నింతురు. అన్నిటికి జవాబిచ్చినచో హర్షించెడివారు. ఆ నాటి భోగముపడుచులు సామాన్యముగ విద్వత్తు కలవారై, పండితపరిచయమును కలవారుగనుండిరి. తమ పరిశీకతయు తాశినను మరియు పీర్ష్యాపరులు కొందరు మంత్రశాస్త్రము నాశ్రయించి ఆ భామవేషధారి కేదైన వికల్పము కల్పించుటయు కలదని వింటిని. సామాన్యముగ ప్రతిజట్టులోను నొక మంత్రశాస్త్రవేత్త యుండును. అతడు అట్టి సమయముల దానికి ప్రతిక్రియగావించి సర్దుకొనును.

నాటకము పూర్తిగాకముందు సత్యభామ ముందుకూర్చున్న పెద్దమనుష్య లొక్కొక్కరి వద్దకు వచ్చి కూర్చుండి తన జడను వారివారి మెడలకుజుట్టి రెండుబుగ్గలను వత్తి ఒక జావళి పాడును. అప్పుడతనికి వళ్ళు పులకరించి తబ్బిబ్బులై, తలగుడ్డ ముడినుండి ఒకటో రెండో రూపాయలనుతీసి భామచేతిలో వణుకుచుపెట్టును. అప్పుడు వెంకటస్వామి బహుమతి యిచ్చిన వారి పేరుచెప్పి పొగడుచు పద్యములు చదువును. ఈ పద్యములు సామాన్యముగ ఎవరిపేరైన ఇరికించుటకు వీలుగా పూర్వమే వ్రాయబడి కంఠస్థమైయుండును. ఈ ప్రకారము ఆ రాత్రి బహుమతులు సుమారు 20 రూపాయలకు తక్కువ లేకుండ భామవేషధారి సంపాదించును. ఈ సందర్భమును చూచి తరుచుగా ఊరి పెద్దశెట్టి మెల్లగ వెనుకకు జారుకొనును. నాటకము తెల్లవారి 5 గంటలవరకు జరుగును. అటుపిమ్మట వారందరు ధరించిన వేషములతోనే గ్రామములో ప్రతియింటికి వచ్చి చీరెలను ధోవతులను భిక్షమెత్తెదరు. ఆ కాలమున గుడ్డకరువు లేదుగనుక వారు వేషములనువేయు వస్త్రములను సంపాదించుకొనువారు. ముఖ్యముగ వీరు భాగవతనాటకము, హరిశ్చంద్రనాటకము, నలచరిత్ర, ఉషాపరిణయము, ప్రహ్లాదనాటకము మొదలైనవి ప్రదర్శించేవారు.

## కూచిపూడి భాగవతుల వీధి నాటకములు:

ఈ నాటకసమాజమునకు చెందినవారందరును కూచిపూడి వాస్తవ్యులగు బ్రాహ్మణులు. ఆడవేషములనుకూడ మగవారే ధరింతురు. వీరు రంగస్థలమునకు వచ్చినపుడు పురుషుడు వేసిన స్త్రీవేషములను గుర్తించుట సులభముగ నుండెడిది. వీరి రేటుగూడ అంత జాస్తిగా నుండేదికాదు. వీరు బ్రాహ్మణులు గనుక భోజనాది వసతులు సులభముగ వూరిలో కుదిరేవి. వీరు మధ్యాహ్నపు వేళలో యెవరి యింటిలోనైన వేషములువేయకుండ అష్టపదులు, కృష్ణ కర్ణామృతములోని శ్లోకములు, తరంగములు పాడి, అభినయముపట్టి భరతశాస్త్ర మొనర్చెడి వారు. మరియు పండిత పామరరంజకముగా జాతీయములు చెప్పుదురు. జాతీయములనగా హాస్యప్రసంగములు. ముసలి మగడు-పడుచుభార్య, చాందస గురుశిష్యులు, ఇత్యాదుల సంభా

షణలను—ఒక్కరే రెండు గొంతులతో ఆయారసము లుట్టిపడ చెప్పి సభాసదులను కడుపుబ్బ నవ్వించేవారు. వీరిలో కొందరు గారడీకూడ చేయగలవారుండిరి. వీరు తరంగములు పాడు నప్పుడు అద్భుతముగ నృత్యము చేయుచుండెడివారు. పళ్లెములో నీళ్ళుపోసియుంచి ఒక్క చుక్కనీరైన చిందకుండ దాని యంచుపై నిల్చి నృత్యముచేయుచు గంటలకొలది "బాల గోపాలమా ముద్దరే" అనే తరంగమును పాడగల నేర్పరులుయుండిరి. ఈ తరంగమున శ్రీ నారాయణతీర్థులవారు తాళప్రస్తారమునకు ఎంతో అవకాశము కల్పించి వ్రాసియున్నారు. ఆ కళాసంతతివారు చాలమంది ఇప్పుడు లేరు; ఉన్న కొద్దిమంది సినిమాలలో చేరి ప్రాచీన కళను మరచిపోవుచున్నారు ; చాలపేలవమైన నర్తనపద్ధతుల ననుకరింపబోయి వికృత మొనర్చుచున్నారు. సినిమాలున్నూ, రేడియోలున్నూ ప్రాచీనమగు భరతశాస్త్రమును, సంగీత కళను ధ్వంస మొనర్చుచున్నవని శ్రీ జయకర్‌వంటి పండితోత్తములే గోలపెట్టుచున్నారు.

కూచిపూడివారి పలుకు స్ఫుటముగను, ఉచ్చారణ స్వచ్ఛముగనుఉండును. వీరి హాస్యమును మోటుగాక సరసముగనుండును. వీరికి భాగవతమే విశేషముగ అభిమానపాత్రమగు నాటకము. అందు శ్రీ కృష్ణజనన ఘట్టములో "దాదిని మంచము"— (బాలింతరాలి మంచము) అని వీరు ప్రవేశపెట్టుచుండిన యొక విశేషము నాకిప్పటికిని జ్ఞాపకమే. వెదురుబద్దలతో మంచము. లేసుగా తయారుచేయుదురు. అందు బాలింత శిశువుతో కూడ పడుకున్నట్లు అమర్చుదురు. నడుముకట్టు మున్నగువానితో శృంగారింపబడిన బాలింత మంచముపై పరున్నట్లెయుండి - మంచముక్రిందికి కాళ్ళు దిగవిడుచును. అట్లేయుండి ఆమె నడచుచు పాడుచుండును. మంచ మును ఆమెతో కదలి నడుచుచు చూపరుల కాశ్చర్యము గొల్పును.

## చెంచునాటకములు :

ఆ కాలమున చెంచునాటకములను గొల్లవారు చేరి ప్రదర్శించుచుండిరి. వీరి నాటకములు పల్లెటూళ్ళలో చాల పేరుపొంది యుండినవి. ఒక ఊరిలో వీరు చాలదినములు బసచేసి నాట కము లాడుచుండేవారు. వీరి నాటకములో ముఖ్యమగు ఇతివృత్తము అహోబిల నారసింహ స్వామి చెంచెతను (చెంచువారి పడుచును) మోహించి వివాహమాడుట. ఈ అహోబిల క్షేత్రము కర్నూలుజిల్లాలో చెంచువాండ్రు నివసించు అడవిమధ్య నొక కొండయందున్నది. ఆ స్వామి యుత్సవసమయమున చెంచుపడుచులు విల్లనంబులు చేతబట్టి చురుకుతనముతో యాత్రికుల మధ్య స్వేచ్ఛగా చకపిక తిరుగుచుందురట. వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యముల జూచి అది స్వైరిణీ స్వభావముగా తలంచి ఎవ్వడైన పొరబడెనా వానిని గట్టిగా చెంపవాయ గొట్టుదు రట. ఆ చెంచెతకథనే — "గరుడాచల మహాత్మ్యము" అని పూర్వకవి యక్షగానముగా వ్రాసియున్నాడు. దాని ననుసరించి ఈ నాటకమును వీరాడుదురు. వీనిలోని పాటలు వూరివా రందరు పాడుచుందురు. గొడ్లకాచుకొను పిల్లకాయలు ముఖ్యముగా వీనిని విడువక పాడుచు పొలములలో చెట్లక్రింద ఆడుచుందురు. ఈ పాటబాణీ అందరికి అందుబాటులోయుండును. అందరి నోళ్ళలోను నానేచరణము:—

"నన్ను పెండ్లాడవే చెంచీత"

## తోలుబొమ్మలాట :

మా వూరి రంగిరీజులు గుడ్డలమీద బొమ్మలనువేసి అద్దుటకు అలవాటుపడినవారు గనుక పలచనితోళ్ళను బొమ్మలవలె కత్తించి వాటికి రంగులనువేసి వాని సహాయమున నాటకము లాడుచుండిరి. ముఖ్యముగ నేనుజూచిన నాటకము రామాయణము. ఈ రామాయణ నాటకము లోని దశకంఠుడు, ఆంజనేయుడు, సీత మొదలగువారి చిత్రములతోకూడ వానర రాక్షస సేన యుండెడివి. ఈ బొమ్మలకు చేతులు, కాళ్ళు, తల మున్నగు అవయవములన్నియు విడి విడిగనే చేయబడి - దారములతో కట్టబడియుండును. బొమ్మలకు వెనుకప్రక్క అన్నిటికి కలిసి వచ్చు నట్లు వెదురుబద్దలను కట్టుదురు. ఆ బద్దలకు దారము లమర్చెదరు. ఈ సూత్రములను (దారములను) అన్నిటిని కథనడుపువారు పదిప్రేళ్ళకు తగిలించుకొని చేతబట్టుకొని లోతెరలో తెరపై బొమ్మలనుంచి నిల్తురు. పిదప కథానుసరణముగ ఆయాసూత్రములులాగుచు ఆబొమ్మల అవయాంగముల నాడింతురు. తెరలో దీపములుండును. ఇవతలయుండవు. తెరలోని వెలుతురు వల్ల - ఆ రంగుబొమ్మలు తెరపై ముందుభాగమున పెద్దవిగా ప్రతిఫలించుచు నిజమగు వేషధారు లాడుచున్నట్లుండును. తెరవెనుక నున్నవారు ఆయా కథ పట్టులు - వచనమున, పద్యముల, పాటల పల్కుచుందురు. అందుచే అయా పాత్రలే ఆడుచు పాడుచున్నట్లుండును. బహుశా ఇది భారతీయనాటకముల ఆదియేమోనని నా అభిప్రాయము. ఏమంటే సంస్కృత నాటకముల నాటకమాడించు ప్రధానపురుషుని "సూత్రధారి"అందురు. నిజమున కతడు ధరించు సూత్రమేమియు లేదు. తోలుబొమ్మలాటలోని సూత్రములే. ఈ "సూత్రధారి"కి మూలమేమో? ఈ సూత్రధారి హస్తలాఘవమున రామరావణ యుద్ధమును, సముద్రలంఘనమును, లంకా దహనమును, వానరరాక్షస సమరమును, రథములను- మొదలైన వానినన్నిటిని సందర్భానుసారముగ పాటలతో, మాటలతో, శబ్దములతో, రోదనములతో చిత్రవిచిత్రముగ దృశ్యములుగా చూపగల్గును.

అసలీ తోలుబొమ్మలాటకు మరాటీవారు ప్రసిద్ధి. వారిలో చాలమంది పెద్దవిద్వాంసులు కాక పోయినను-గురుముఖతః విద్వత్తుతోకూడిన నాటకమును వల్లించి, కథనడుపుట నేర్తురు. వీరు కథ నడుపునప్పుడు, సంస్కృతసమాసములను, వాక్యములను చెప్పి- ముక్కముక్కగావిరిచి అర్థము చెప్పుదురు, "అశ్వ-గుర్రములున్నూ, గజ-ఏనుగులున్నూ...." ఈ విధముగా చెప్పుచుందురు. మరియు నప్పు డప్పుడు అమరమునందలి శ్లోకములను చదువుదురు. మా ఊరు అద్దంకిసీమలోనిది. అద్దంకిసీమను కొన్నాళ్ళు మరాఠీలేలినారు, నేటికిని వంగవోలులో మరాటీపాలె మున్నది. బహుశా ఆ సంపర్కముచే మా ఊరి రంగిరీజుల కిది అబ్బియుండును.

సినీమాలు నైన్సుసహాయమున మొదట ఏర్పడినపుడు బొమ్మలు కదిలేవేగాని మాట్లాడేవి కావు; ఇప్పుడు మాట్లాడుచున్నవి కూడ. కాని మన ప్రాచీనులీ అవకాశములను పూర్వమే ఊహించి వారికి వశమైనంతవరకు ఈవిధముగా అమలుబరిపిరి కాబోలు !

ఇప్పటికే ఈ వ్యాసము దీర్ఘమైనది. వచ్చేసంచికలో చెన్నగరవాసినై నాగరికులతో చేరి నే చూచిన నాటకముల విశేషములను వ్రాసెదను.

# అనువాద సాహిత్యం

జెస్సీకి కళ్ళ నీరు తిరిగింది. టామ్‌కోసం అతను నిరీక్షిస్తున్నాడు. టామ్‌వస్తూనే, "దానికేం భాగ్యంజెస్సీ? నీ కెప్పుడు వీలైతే అప్పుడే పనిలో ప్రవేశించు." అంటాడు.

మిసోరీరాష్ట్రంలో కాన్సాస్ పట్టణంనుంచి ఓక్లహోమాలో టుల్సా రావటానికి రెండు వారాలు పట్టింది. కొన్నిరాత్రులు ఎడతెగని వాన. ఒక వారంరోజులు ఎండ కాల్చేసింది. సరిగా నిద్రలేదు, తిండిలేదు. ఈ క్షణంకోసం అదంతా భరించాడు. టామ్ రానేవచ్చాడు, చేతిలో ఏవో కాగితాలు పట్టుకుని. జెస్సీకేసి నిదానించి చూశాడుకూడాను. కాని గుర్తించ లేదల్లేఉంది, మొహం తిప్పేశాడు.... తన బావమరిది.

ఎందుకు గుర్తించలేదూ? గుడ్డలా? తన అవతారం ఎట్లాఉందో జెస్సీకి తెలుసు. కిందటి సారి ఆగినచోట కాస్త మనిషిరూపం తెచ్చుకుందామని ప్రయత్నించాడు. కాని తొందరలో గల్లంతయిపోయింది. గడ్డం చేసుకుంటుండగా చెంప తెగిపోయింది. గుడ్డల నిండా ఎర్రదుమ్ము అతుక్కుని యెంత దులిపినా పోలేదు....లేక తను మొత్తం మారాడా?

ఒకరినొకరు చూసుకుని అయిదేళ్లయింది. అయితే ఏం? టామ్ అయిదేళ్లపెద్దగా కనిపిస్తున్నాడు. అంతేగాని టామ్ లాగా లేకపోలేదే. తను అంతమారాడా?

టామ్ టెలిఫోనుమీద ఏదో మాట్లాడి తన స్ప్రింగు కుర్చీలో వెనక్కువాలి జెస్సీకేసి చిన్నకళ్ళతో అనుమానంగానూ, దూరంగానూ చూశాడు. టామ్‌కిప్పుడు నలభై అయిదేళ్లు. లావుగా ఉన్నాడు. అమెరికన్ లీజియన్ ప్రతినిధిగా పనిచేస్తున్నాడు.

"ఏం? ఏంపనిమీద వచ్చావ్?" అన్నాడు టామ్ జెస్సీతో. అతని గొంతులో క్రోధం లేదు. ఉంటుందని భయపడ్డాడు జెస్సీ.

అతను టామ్ సమీపానికి వచ్చి మాట తడబడుతూ, "నన్ను నువు గుర్తించలేదు, టామ్. నేను జెస్సీని" అన్నాడు.

"ఆఁ?" అన్నాడు టామ్.

"అవును. ఎల్లా నిన్ను అడగమన్నది."

టామ్‌జెస్సీని సమీపించి నమ్మలేనట్టుగా చూశాడు. ఈ మనిషి ముప్ఫైఏళ్లవాడు. ఎత్తుగా ఉన్నాడు. అంతవరకు పోలిక ఉంది. మొహం కుదిరికైన మొహం కాని బావురుమంటున్నది. మనిషి మరీ బక్క చిక్కి ఉన్నాడు. తన బావమరిది కండగలవాడు బలిష్ఠుడు. ఇతన్ని చూసి వెనకటి స్వరూపం జ్ఞాపకం తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉంది.

టామ్ జెస్సీకేసి జాలిగా చూశాడు. జెస్సీకి కోపం వచ్చింది. తనస్థితి యింకా అంత హీనం కాలేదు.

## ఆనందం

ఆల్బర్ట్ మాల్ట్జ్

"జెస్సీవేగాని చాల మారిపోయావు" అన్నాడు టామ్.

"అయిదేళ్ళు కాలా? అయినా నువు నన్ను రెండుమూడు సార్లకంటె చూడలేదు" అన్నాడు జెస్సీ. ఏంమారితే? అందరూ మారటంలా? నేనింకా శవంఅయిపోలేదే అనుకున్నాడు లోలోపల రోషంగా.

"ఇంకా బలంగా ఉండేవాడివి. తూకం తగ్గినట్టున్నావు," అన్నాడు టామ్, ఆశ్చర్య పడుతూనే.

జెస్సీకి లోపల రోషంగా ఉన్నా పైకేమీ అనలేదు. అతనితో పనిఉంది; పోట్లాటదేనికి? బలవంతాన రోషం అపుకున్నాడు. ఇంతలో టామ్ ఏదో జ్ఞాపకంవచ్చినట్టు జెస్సీ చెయ్యి అందుకుని, "ఇదేమిటి? ఇక్కడ నిలబట్టం దేనికి? లోపలికిపోదాం. నిన్ను చూడటం నాకెంతో ఆనందంగా ఉంది. మరోవిధంగా అనుకోకు," అన్నాడు.

"దానికేం లే!" అంటూ జెస్సీ జుట్టు వేళ్ళతో దువ్వుకు సాగాడు.

"కుంటుతున్నట్టున్నావు?"

"బూటులో రాయిదిగబడి అరికాలు గాయమయింది" అంటూ జెస్సీ తన పాదరక్షలు కనిపించకుండా పాదాలు కుర్చీకిందికి లాక్కున్నాడు. అసలే "ధర్మం" వచ్చినవేమో, రెండువారాలు విడవకుండ తొక్కేసరికి ఆ పాదరక్షల పని పూర్తిగా అయిపోయింది.

టామ్ జెస్సీ కాళ్ళకేసి చూడటం మానేశాడు. ఆ కుర్రాడి అవస్థకు జాలేసింది. జెస్సీ కన్న దుస్థితిలో ఉన్నమనిషిని అతనెన్నడూ చూడలేదు. చెల్లెలి దగ్గరనుంచి వారాని కొక ఉత్తరం వస్తూనే ఉందిగాని పరిస్థితు లెంత భయంకరంగా ఉన్నదీ ఆమె రాయలేదు.

"ఏమిటి విశేషాలు? ఎల్లా ఎట్లాఉంది?" అన్నాడు టామ్.

"బాగానే ఉంది." తను చెప్పవలసిన విషయం ఎట్లా ప్రారంభించాలో అతనికి తెలీలేదు.

"పిల్లలు?"

"బాగానే ఉన్నారు.... చిన్నవాడు పరిగెత్తలేదు కాని, తెలివిగలవాడు తెలుసా? బొమ్మలూ అవీ వేస్తాడు, తెలుసా?"

"ఓహో! అట్లాగేం!" అని టామ్ ఆగాడు. ఒక్కక్షణం ఇద్దరూ మాట్లాడలేదు. జెస్సీకి నోరు పెగలకుండా ఉంది. టామ్ ముందుకు వంగి జెస్సీ మోకాలిమీద చెయ్యిపెట్టి, "పరిస్థితులు బాగాలేవని ఎల్లా రాయలేదు జెస్సీ. రాస్తే ఏదైనా చేసిఉందును" అన్నాడు.

"ఎట్లాగులే? నీ ఇబ్బందులు నీకు లేవూ?"

టామ్ కుర్చీలో వెనక్కువాలి "అవును. నా దుకాణం పోగొట్టుకున్నా. తెలుసుగా?"

జెస్సీ ఆశ్చర్యంతో "అవునవును. రాశావు. అదే నేనన్నది" అన్నాడు.

"ఏం దుకాణంలే? మూడేళ్ళు నష్టంమీద నడిపే, మనదనే అభిమానంతో. నీ విషయం ఏమిటి? నీ ఉద్యోగ మేమయింది?"

"అదంతా తరవాత మాట్లాడదాం, టామ్ ముందు నేనొకటి చెప్పాలి." అన్నాడు జెస్సీ ఆత్రంగా.

"నీకూ ఎల్లాకూ చెడలేదుగదా?"

"ఎబ్బే. నీకట్లా ఎందు కనిపించిందీ? నేనూ, ఎల్లా—ఎల్లా అంటే నాకు ప్రాణం. అంతకన్న నాకింకెవ్వరున్నారు టామ్?"

"అవునులే, అవునులే" అంటూ టామ్ పిచ్చినవ్వొకటి నవ్వి పక్కమొగం పెట్టాడు. జెస్సీ ఆ మాట అన్నతరవాత ఆ మొగుడు

పెళ్ళాల కేమైనా సహాయం చెయ్యగలిగితే బాగుండు ననిపించింది.

"టామ్, ఒకఉద్దేశంతో ఇక్కడికి వచ్చా. నీ సహాయంకావాలి,"అన్నాడు జెస్సీ.

"పిచ్చివాడా, నాకు వారానికి ముప్ఫయి అయిదు డాలర్లిస్తారు. దాంతో నే గడుపుకుంటున్నా. నావల్లఏంసహాయంఅవుతుంది?"

"నాకు తెలుసు. నువు డబ్బు సహాయం చెయ్యలేవు. కాని, నువు నాకు పని ఇప్పించగలవని ఒకడు చెప్పాడు."

"ఎవడు చెప్పాడు?"

"నాకెందుకు రాయలేదూ? ఈ మాట వినగానే బయలుదేరి వచ్చేశా. రెండు వారాలు నడిచా."

"కాన్యాన్‌పట్టణంనుంచి నేనిచ్చే ఉద్యోగం కోసం రెండువారాలు నడిచివచ్చేవా?"

"అవును, టామ్. ఇంకేం చెయ్యనూ?"

"ఉద్యోగా లెక్కడున్నాయిజెస్సీ. తరుణం కూడా కాదు. ఈ నూనె సంగతి నీకు తెలీదు. ఇదంతా అదోపద్ధతి. ఇక్కడ లీజియనులో నాకు స్నేహితులున్నారు. కాని వాళ్లా ఏమీ చెయ్యలేరు. ఏదైనాఉంటే నేను నిన్ను పిలిపించనా?"

"అదికాదు, టామ్. నువు మనుష్యులను తీసుకుంటావని ఈ మనిషి చెప్పాడే. ఇతను నీ కింద ట్రక్కులు నడుపుతాట్ట. నీకుఎప్పుడూ మనుషులు కావలిసేఉంటుందిట."

"ఓ....నాడిపార్టుమెంటులోనా?" అన్నాడు టామ్ చిన్న గొంతుచేసి.

"అవును, టామ్."

"నా డిపార్టుమెంటులో నువెట్లా పని చేస్తావ్? ఆ పనేమిటో నీకు తెలీదు."

"నాకు తెలుసు. నీవు ట్రక్కుల్లో డైనమైటు పంపుతావు, కాదూ?"

"నీ కిది చెప్పినవాడి పేరేమిటి?"

"ఎవరెట్ అనుకుంటా."

"ఎగ్బర్టు కాదుగద? నా లావుంటాడు?"

"అవును ఎగ్బర్టే. దొంగా?"

"కాదు......కాని జెస్సీ, నువు బయల్దేరే ముందు నాకు మాటమాత్రంరాయలేక పోయినావా?"

"రాస్తే వద్దంటావని తెలుసు. ఈ పని ప్రమాదకరమైనదని అతను చెప్పాడు. అయినా నాకు భయంలేదు."

టామ్‌మొహం రాయల్లే అయింది. "నేనెట్లాగైనా వొద్దనే అనబోతున్నా," అన్నాడు.

జెస్సీ ఒక్క కేకపెట్టాడు. "అదేమిటి? అట్లా అంటావేం? ఖాళీలులేవా, టామ్?"

"ఉన్నాయి, లేకేం? కావలిస్తే ఎగ్బర్టు జాగాయే ఉంది."

"ఎగ్బర్టు మానుకున్నాడా?"


"చచ్చిపోయినాడు, ఉద్యోగంలో నే చచ్చాడు జెస్సీ. నిన్నరాత్రే."

"ఓ....అయితే అయింది,"

"చూడు, జెస్సీ. ఈ ట్రక్కుల్లో వెళ్ళేది డైనమైటు కాదు. నూనెబావులు తవ్వటానికి డైనమైటు లాంటి పేలపిండి వాడరు. నైట్రోగ్లిసరిన్ వాడుతారు. అసలైన పురుసు."

"నాకు తెలుసు, టామ్. తెలీదనుకోకు. వాడు నా కంతా చెప్పాడు."

"నోరు మూసుకుని నే చెప్పేది విను. దీనికేసి చూస్తేచాలు పేలుతుంది. గట్టిగా దగ్గావా పేలుతుంది. దీనికోసం వేరేట్రక్కులున్నాయి. వీటిని రాత్రిపూటే నడుపుతారు. వెళ్ళటానికి మామూలు రోడ్లుకాదు, వేరేరోడ్లు. వాటిని ఉంచటానికి వేరే గరాజిలు, ఎంత ప్రమాదకరమో ఊహించు."



"నాన్నా! త్వరగా రా, ఇంకా తోక కనిపిస్తూ ఉంది!"

"నేను మెల్లిగా జాగ్రత్తగా నడుపుతాలే."

"ఎగ్బర్టు జాగ్రత్తగా నడపలేదంటావా?"

"నన్నట్లా భయపెట్టలేవు, టామ్. నాకీపని కావాలి. ఎగ్బర్టు మైలుకు డాలరు సంపాదించేవాట్ట. నెలకి 15 రోజులు పనిచేస్తే అయిదారు వందల డాలర్లు దొరికేవిట. నాక్కూడా అట్లా దొరుకుతుందా?"

"కంపెనీవాళ్ళు మైలుకు డాలరు చొప్పున ఎందుకిస్తున్నారనుకుంటావు? దారిలో ఏమైనా కావచ్చు. చక్రం రాయిమీదిగా పోవచ్చు. నీ కంటో ఏదోపడి చక్రం పక్కకితిరగొచ్చు. ఎగ్బర్టుకేం జరిగిందో ఎవరు చెప్పగలరు. పులుసెందుకు చిందుతుందో ఆరా తియ్యటానికి ట్రక్కుండదు, బుల్లూఉండవు, మనిషీ ఉండడు. ఒక్కోసారి దూరంపొలాల్లో ఒక ఇనపరేకు వొంకర్లుపోయి దొరుకుతుంది. డ్రైవరుకాలిగోరైనా దొరకదు. రాత్రి ఎగ్బర్టు బ్రిడ్జిమీదిగా పోతుండగా ఏదో అయింది మరి. ఇప్పు డక్కడ బ్రిడ్జిలేదు, ట్రక్కులేదు, ఎగ్బర్టులేదు. అర్థమయిందికాదూ? అందుకూ మైలుకు డాలరు!"

కాస్సేపు జెస్సీ మాట్లాడలేదు. అతని ఆవేదనంతా అతని మొహంలోనూ, చేతులు మెలిపెట్టుకోవటంలోనూ తెలుస్తున్నది.

"అయితేఅయింది, టామ్. చెప్పేశావుగా, నీ బాధ్యత తీరిపోయింది. నాకాపనిఇచ్చెయ్యి, మంచివాడివి కాదూ?" అన్నాడు జెస్సీ.

టామ్ బల్లమీద గట్టిగాబాది, "ఇవ్వను!" అని అరిచాడు.

"చూడు, టామ్" అన్నాడు జెస్సీ నిమ్మళంగా. "నా కేసిచూడు. నీ కంతా అర్థమవుతుంది. తలఎత్తుకు తిరగలేకుండా ఇట్లా ఎంతకాలం జీవించను?"

"నీకు మతిపోయింది. ప్రతిఏడూ అయిదుగురు డ్రైవర్లకు ఒకడు చొప్పున చస్తూ ఉంటారు. ఏం గిట్టుబాటు?"

"నా ప్రాణానికేమైన విలవఉందా, టామ్? ఇంటిదగ్గిర పస్తులు ఉడుస్తున్నాం. ధర్మ పిండం కూడా యిరికా దొరకటంలేదు."

"ఆ మాట నా కెందుకు రాయలేదూ? అది నీ తప్పు. తిండికి లేనప్పుడు అభిమాన మేమిటి? నే నెక్కడున్నా అప్పుచేసి ఎల్లాకు టెలిగ్రాఫ్ మనియార్డరు పంపేస్తాను. నువ్వింటికి పో. ఈ లోపల ధర్మపిండం దొరకనే దొరుకుతుంది."

"ఆ తరవాత?"

"ఉద్యోగం దొరికేదాకా ధర్మభోజనంతో గడుపు. నువ్వేమన్నా ముసలివాడివా ప్రాణానికి తెగించటానికి?"

జెస్సీ చివాలునలేచి నిలబడ్డాడు.

"ఈకబుర్లు విని నేను చాలా మోసపోయాను. నీ దుకాణం తిరిగొచ్చిన నాడే నాకు ఉద్యోగం దొరికేది. నా చేతులు మొద్దుబారిపోయాయి. ఇప్పుడు లైనోటైపు చెయ్యలేను. ఆరేళ్ళు ధర్మపిండం తిన్నాక ఏమవుతుంది? నా పనితనమంతా పోయింది. పాతా పలుగూ పట్టుకుని పనిచెయ్యటానికి మాత్రమే పనికొచ్చాను. కాటకంవచ్చేసరికి అదీపోయింది."

"ఇంకేమీ పనులే ఉండవా?"

"ఏముంటయ్యో? ఆరేళ్ళబట్టీ లేవు. నాలో నా కిప్పుడు నమ్మకంకూడా పోయింది. ధర్మపిండంకోసం అన్ని వారాలు ఎదురు చూడటంలో పిచ్చెత్తింది."

"నువట్లా అధైర్య పడగూడదు. నమ్మకంతో ఉండాలి."

"ధైర్యం ఉంది, నమ్మకంలేదు. నాకున్న నమ్మకమల్లా వీలోనే."

"నీకు మతిపోతున్నది. ఎల్లా విషయమైనా ఆలోచించు."

"నే నాలోచిస్తున్నది ఎల్లావిషయమే. అందుకనే యీ నిశ్చయం చేసుకున్నా. ఎగ్బర్ట మా యింటికి వచ్చిననాడు ఎల్లా నాకుకొత్తగా కనిపించింది. ఒకప్పుడు ఎల్లా నా పక్క వీధిలో నడుస్తుంటే అందరూ వెనక్కు తిరిగి చూచేవాళ్ళు. ఇంకా ఇరవైతొమ్మిది వెళ్లకపోయినా ఎల్లా అందమంతా పోగొట్టుకుంది, టామ్. వెనకటిలాగ బొమ్మల్లే లేదు."

టామ్ నేలకేసిచూస్తూ గూళ్ళు ముడుచుకు కూర్చున్నాడు.

"ఎల్లాకి అన్యాయంచేశాను. ఎల్లా సుఖపడదగిన మనిషి. దానికి న్యాయంచెయ్యటానికి నా కిదొకటే అవకాశం," అన్నాడు జెస్సీ.

"పిచ్చిగా మాట్లాడకు. ఇదో కరువు. నీ స్థితిలోనే నేనూ ఉన్నాను. ఇంకా లక్షల మంది ఉన్నారు. ఇందులో నీ తప్పేమీలేదు," అన్నాడు టామ్.

"మిగిలినవాళ్ళ సంగతిఏమో. నేను పైకి రాలేక పోవటం నా తప్పే."

"నీ తప్పయితే గ్రహాల తప్పుకూడా కావచ్చు."

"ఏమైనా సరే. నే నీపని చేసి తీరుతాను. నా పిల్లవాడి కాళ్ళకేసి ఇంకా అరేళ్ళు చూడగలనా? 'నాకు తిండిపెట్టక రికెట్స్ తెప్పించావు. నా ఎముకలు మెత్తగా ఉండటంవల్ల నేను నడవలేను,' అని వాడంటే నేనేం కాను?"

"నీవు చస్తే ఎల్లా ఏమంటుంది?"

"చావనేమో. నాక్కూడా అదృష్టమంటూ తిరగదా?"

"అంతా ఆ మాటే అనుకుంటారు. ఈ పనిలో ప్రవేశించిన తరవాత ఇక అదృష్టమనే మాట అవతల పెట్టు. ఎప్పటికోప్పటికి నీకు చావు రాసిపెట్టి ఉన్నదే."

"చస్తే చస్తాను. ఈలోపుగా కొత్త బూట్లు కొనుక్కోగలను గద. కొత్తబట్టలు కొనుక్కుంటాగద. సిగిరెట్లు తాగుతాగద. పిల్లలకి పంచదార బిళ్ళలుకొంటాగద. ఎల్లాకు మంచి గౌనులు కొంటా. మంచి తిండి తినిపిస్తా. మేమంతా కలిసి సినిమాల కెళతాం."

"చాల్లే, నోరుముయ్యి!" అన్నాడు టామ్ విసుగ్గా.

"నేను నిన్నంతలోవిడవను,టామ్. మూడు నెల్లే బతికాననుకో. నెలకు ఆరువందల డాలర్లచొప్పున యెంత వెనకేస్తానో చూడు. వెయ్యిడాలర్లు—ఇంకా ఎక్కువే దాచవచ్చు. ఎవరు చూశారు? రెండేళ్ళు దక్కుతానేమో. ఎల్లాకి ఏ లోటూ లేకుండా చేసిపోగలను."

"బాగుంది. నువ్వీపని చేస్తున్నావనితెలిస్తే ఎల్లా ప్రాణం ఎట్లాఉంటుంది?"

"ఎల్లాకు చెప్పనుగా? నలభై డాలర్ల ఉద్యోగమనే చెబుతాను. మిగిలినదంతా దానిపేర నువు బాంకులో వెయ్యి, టామ్."

"నీ సంగతేమిటి? నువేం సుఖపడతావు? ఏరోజు కారోజు ఇవేళే నాకు మూడిందా అని ఆలోచిస్తూంటావు. రోజువిడిచి రోజు పని ఉంటుంది. పనిచెయ్యనిరోజున ఇంటో కూర్చున్నప్పుడు మరీ బాధపడతావు."

"లేదు, టామ్. నే నెంతో ఆనందంగా ఉంటాను. ఏడేళ్ళకు మళ్ళీ నేనూ ఒక మనిషి నైనాననే సంతోషంతో గొంతెత్తి పాడేస్తాను."

కాస్సేపు నిశ్శబ్దం.

"నాకు ముమ్మాటికీ ఈ పని ఇచ్చితీరాలి, టామ్," అన్నాడు జెస్సీ రహస్యంగా, ఉద్రేకంతో.

చివరకు, టామ్ "సరే నీయిష్టం. నీకర్మ! నేనేం చెయ్యగలను. కావలిస్తే ఇవాళరాత్రే ట్రక్కు తోలవచ్చు." అన్నాడు.

జెస్సీనోట మాటలేదు. అతని కళ్ళవెంట నీరు ధారలు కారుతున్నది. మాట్లాడబోయి గుటకలు వేసి నోటితో గాలిపీల్చి వదులుతున్నాడు.

"నీకు పని కుదిరిందనీ, రెండు రోజుల్లో అదీ పిల్లలూ రావటానికి డబ్బు పంపిస్తావనీ తంతిపంపుతా. ఈవారం చివరదాకా బతికి ఉంటే అప్పటికి నీ చేతికి డబ్బొస్తుంది."

జెస్సీ మాట్లాడలేక తలఊపాడు.

"ఇదుగో, ఈ డబ్బు తీసుకునిపోయి తుష్టుగాభోంచేసి సాయంకాలం ఆరింటికి రా. ఇదుగో నా ఎడ్రసు. వెళ్ళేటప్పుడు అటువెళ్ళే కారేదైనా ఎక్కు. ఎక్కడదిగిపోవాలో కండక్టరు చెబుతాడు. చక్కగా స్నానంచేసి నిద్రపో."

"థాంక్స్! థాంక్స్, టామ్."

"ఇకపో."

"టామ్?"

"ఏమిటి?"

"ఏం లేదుగాని—"

"నాకు పనుంది," అంటూ టామ్ పెద మొహం పెట్టాడు.

జెస్సీ బయటికి వచ్చాడు. అతని కళ్ళకి నీటిపొర అడ్డం ఉంది. కాని ప్రపంచమంతా ఒక్కసారి కాంతివంత మైనట్టయింది. తన కన్న అదృష్టవంతుడు ప్రపంచంలో లేడనుకున్నాడు.

జెస్సీ వెళ్ళిపోగానే టామ్ తల చేతుల్లో పట్టుకుని కూచున్నాడు. అతని గుండె చాలా బాధగా కొట్టుకుంటున్నది.




విూకు జ్ఞాపకం ఉందనుకుంటాను. ఇదివరకు నేను నా స్నేహితుని చెల్లెలు లీలను ప్రేమించి నిరాశచెందిన సంగతి. ఆ అనుభవం నన్ను శారీరికంగానూ, మానసికంగానూ కూడా చాలా నిరుత్సాహ పరిచింది. మా ప్రణయం భగ్నమయిన రోజునే నేను ఘట్టిగా నిశ్చయించుకున్నాను. ఇక ముందు స్నేహితుల చెల్లెళ్లను ప్రేమించకూడదని, అథవా ప్రేమించవలసివస్తే చెల్లెలి స్నేహితురాండ్రనే ప్రేమించటం ఉత్తమమనీ.

ఆనాటి సాయంత్రం చాలా ప్రశాంతంగానూ, అహ్లాదకరంగానూ వుంది. సూర్యుడు తన ఎర్రని ముదికిరణాల్ని ఎగజిమ్ముతూ పశ్చిమాద్రిని గ్రుంకుతున్నాడు. కవులకు అవేశం పుట్టటానికి ఇది చాలా అనుకూలమైన సమయం. నేను కవిని గాదు, కాని కథకుణ్ణి. కొన్ని కథలు గీకి కొత్తగా వస్తున్న పత్రికల్లో ప్రకటించాను. ఇంకా ఎన్నో కథలకు డిమాండు కూడా వుంది. అయితే లీల ప్రణయవాహినిలో నా రచనా స్రవంతి కలిసిపోయింది. అది ఇంకిపోయేవరకు నేనూ నా రచనా స్రవంతిని మరొక దిక్కుకు మరల్చలేకపోయాను.

కానీండి. ఇప్పుడు గతించినదానికి వగచి లాభం లేదు. కార్యశూరులెప్పుడూ వర్తమానాన్నే చూస్తారు. అలాగే నేను కూడా పూర్వం అసంపూర్తిగా వదిలిన ఒక కథను బైటికి తీసి పూర్తి చేద్దామని కూర్చున్నాను.

“శ్రేయాంసి బహు విఘ్నాని” అన్నారు ఆర్యులు. నేను కథ తీసుకుని రెండు మూడు పంక్తులు రాశానో లేదో మా చెల్లెలు శాంత వచ్చి నా కలం పట్టుకుంది.

నాకు మా చెల్లెల్ని నమిలి మింగివేద్దామన్నంత కోపం వచ్చింది. కసురుకున్నాను కూడా. కాని మా శాంత విడువలేదు.

“మా అన్నయ్యా మంచివాడుకదూ. ఒక పని చేసిపెట్టు” అని గడ్డం పుచ్చుకుని బ్రతిమాలడం మొదలు పెట్టింది.

నాకు కోపంతోపాటు విసుగుకూడా వేసింది. అయినా, ఇకముందు మా చెల్లెలి స్నేహితురాండ్రతో పరిచయం చేసుకోదలచుకున్నాను కాబట్టి అమెను

నొప్పించదలుచుకోక "ఏం పనీ?" అని విసుగ్గా అన్నాను.

"నా స్నేహితురాలు చిత్రలేఖను వాళ్ల యింటిదాకా పంపి రావాలి. వాళ్లవాళ్లు వస్తామన్నారు, కాని ఇంతవరకూ రాలేదు" అన్నది.

నాకు ఇంకా విసుగువేసింది. చిత్రలేఖ అంటే నాకు మొదటినించీ ఇష్టం లేదు. ఎందుకంటే ఆమె అందకత్తె కాదనికాదు. మహా తలబిరుసుదని. మా చెల్లెలు స్నేహితురాళ్లు ఇంకా ఒకరిద్దరు వున్నారు. అందులో సుశీల మంచిది. మంచిదంటే అందకత్తెనికాదు. ఎప్పుడూ నవ్వుతూ, ఉత్సాహంగా వుండేది. నాతో కులసాగా కబుర్లు చెప్పేది. ఇక ఈ చిత్రలేఖ సుశీలకంటే కొంచెం అందమైనదైనా హుషారుగా, ఉత్సాహంగా వుండేదికాదు. నేను ఒకసారీ, అరసారీ పలకరించికూడా చూచాను. ఊహుఁ, మన కెప్పుడూ జవాబు రాలేదు. అలాంటి చిత్రలేఖను వెంటబెట్టుకు వెళ్లితేమాత్రం నాకు కలిగే ఆనందమేమిటి? అంచేత నేను సమాధాన మివ్వలేదు.

"చెప్పు అన్నాయ్. ఈ ఒక్క సహాయం నాకు చేసిపెట్టు. ఇక నిన్నెప్పుడూ ఏదీ అడగను'' అన్నది శాంత.



నేను కొంచెం మెత్తబడ్డాను. అయినా ఇందులో కాళ్లతిప్పట తప్పితే నష్టమే ముంది? అనుకుని - "సరే, నువ్వుపోయి చిత్రలేఖను తయారుకమ్మను. నేను దిగివస్తున్నాను." అని క్రిందికి బయలు దేరాను.

శాంత ముందుపోయి చిత్రలేఖను పిలి చింది. చిత్రలేఖ ముందూ నేను వెనకా బయలుదేరాము. దోవలో మేము ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. చిత్ర లేఖ తలవొంచుకునీ, నేను దిక్కులు చూస్తూనూ నడిచాము. హఠాత్తుగా చిత్రలేఖ ఒక పెద్ద ఇంటిముందు ఆగి, నా వేపుకు తిరిగి చిన్న నమస్కారం చేసి - "ఇదే మాయిల్లు. యిక నేను పోగలను, మీరు వెళ్ళండి" అన్నది.

నాకు చాలా నిరాశ కలిగింది. ఇంత దూరం వచ్చినందుకు ఇంటోకి పిలిచి టీ ఇవ్వలేదు సరికదా, ఆఖరికి కృతజ్ఞత కూడా తెలపలేదు. సుశీల వెంటవస్తే ఎంత చక్కగా వుండేది. కనీసం దోవ పొడుగునైనా కబుర్లు చెప్పతూ, నన్ను ఆనందపెట్టేది. నాకు ముందు కష్టం వేసింది. కాని చిత్రలేఖ ముఖం చూసిన మీదట నేను అంతా మరిచిపోయాను. అ సాయంత్రపు వెలుగులో చిత్రలేఖ ముఖం అమాయకత్వంతో తొణికిసలాడు తోంది. నేను ఇక గత్యంతరం లేక - "సరే అయితే వస్తాను" అని ఇంటికి వచ్చేశాను.

అంతే. మళ్లీ నేను చిత్రలేఖను చూడ లేదు. ఈమధ్య నేను మా చెల్లెలి సహ కారంతో సుశీలను తరుచుగా కలుసు కుంటున్నాను. చిత్రలేఖ ఎలా ఉన్నదని కూడా నేను కనుక్కోలేదు.

ఆవాళ సినిమా థియేటరు దగ్గర నూటు వేసుకున్న ఒక యువకునితో చిత్రలేఖ హఠాత్తుగా కనిపించింది. నా వంక చూసింది కాని, ఎన్నడూ నన్ను చూడనట్టే, అసలు నన్ను ఎరగనట్టే, థియేటరులో జొరబడింది. అవమానంతో నా వొళ్లు మండిపోయింది. ఎందుకీ పిల్ల కింత అహంకారం? ఆమె అందాన్ని చూసి నేను పొంగిపోతున్నాననా ఆమె భావన?

నేను యింటికివచ్చి మా చెల్లెలిని ఎత్తిపొడిచాను. "చూశావా? నీ స్నేహితు రాలు చిత్రలేఖ ఏం చేసిందో? థియేటర్ దగ్గర కనిపించి నన్ను గుర్తుకూడా పట్ట లేదు."

శాంత తన స్నేహితురాలినే సమర్థిం చింది. "ఒక వేళ నిన్ను చూడ కుండానే ఉంటకూడదా?" అంది.

నేను కావాలనే కొంచెం లేనిది కలిపి అన్నాను. "తప్పకుండా చూసింది. మా ఇద్దరి కళ్లూ కలిసిన తర్వాతనే తన మొహం అవతలకు తిప్పుకుంది."

ఇంక దీనికి శాంత సమాధానం ఏమి చెప్పుతుంది. ఇక ఈ ప్రసంగం మార్చి- "ఆవాళ తన్ను ఇంటికి చేర్చినందుకు చిత్రలేఖ నీకు కృతజ్ఞత తెలపమంది, అన్నాయ్." అన్నది.

"అలాగా. అయితే ధన్యుణ్ణి." అన్నాను ప్రతీకారంగా నవ్వుతూ.

ఇది జరిగి కొంతకాలమైంది. నే నొకసారి సాయంత్రం సినిమాకి వెళ్లి ఇంటికి వచ్చి చూద్దునుగదా, నా టేబిలు మీది పుస్తకాలన్నీ కదిలించి వున్నై. మా శాంత ఎప్పుడూ నా గదిలో పుస్త కాలు గానీ, ఏమీగానీ కదిలించదు. మరి, యిది ఎవరిపని? నేను కోపంతో శాంతను కేకవేశాను.

శాంత పాపం ఆదరాబాదరా పైకి వచ్చింది. "నువ్వు నా పుస్తకాలు ఏమైనా కదిలించావా?" అని అడిగాను.

శాంత టేబిలువంక చూసి, ఆశ్చ ర్యంతో నాలుక కొరుక్కుని - "నేను కదిలించలేదు అన్నాయ్. ఇవ్వాళ సాయంత్రం చిత్రలేఖ, సుశీలా వచ్చారు. వాళ్లు చూశారనుకుంటాను పుస్తకాలు! అన్నట్టు సుశీల నీకథలు భలే మెచ్చు కుంది అన్నాయ్." అన్నది శాంత.

అసలు సుశీల వచ్చిందనేసరికే నా కోపం సగం చల్లారింది. పైగా సుశీల నా కథలు మెచ్చుకుందంటే ఇంక చెప్పాలా? నాకు పరమానందమైంది. కాని అది శాంతకు వ్యక్తం చెయ్యకుండా - "సరే నీ స్నేహితురాలు చిత్రలేఖ ఏమన్నది? అసలు పుస్తకాల వంకనైనా చూసిందా?" అన్నాను.

చిత్రలేఖ అంటే నాకు గిట్టదని మా శాంతకు తెలుసు. అంచేత మొహం చిన్నబుచ్చుకుని- "ఏమీ అసలేద"ని వెళ్లి పోయింది.

ఆ సంవత్సరం నేను మా క్లబ్బు బాడ్మింటన్ టోర్నమెంట్సులో ఫైన ల్సుకు వచ్చాను. ఆవాళ ఫైనల్సు. నా ప్రత్యర్థి మంచి ఆటకాడు. అతన్ని ఎలా గెలవటమా అనే ఆలోచనతో నేను ర్యాకెట్ తిప్పుకుంటూ క్లబ్‌కేసి పోతు న్నాను. హఠాత్తుగా నాకు సుశీల కని పించి, - "ఎక్కడికి పోతున్నావు రావ్?" అని అడిగింది.

నేను ఆనందంతో పరవశమైపోయాను. ర్యాకెట్ ఇంకోచుట్టు ఎక్కువ తిప్పుతూ, నా ఫైనల్సు సంగతి చెప్పాను. సుశీల మహా ఉత్సాహంతో - "గుడ్‌లక్! నువ్వు తప్పకుండా గెలుస్తావు. నాకు నీ ఆట చూడాలనికూడా వుంది," అన్నది.

"అయితే తప్పకుండా రండి. మీరు వస్తే నాకెంతో వుత్సాహంగా ఉంటుంది." అని ఆమెను ఆహ్వానించాను.

"బాడ్‌లక్. నాకు చాలా అవుసరమైన పనివుంది. మీ ప్లే మిస్ అయినందుకు నాకు చాలా విచారంగా ఉంది." అన్నది.

ఆమె పరిస్థితి చూసేవరకు నాకు నిజంగా జాలి కలిగింది. ఆమె రాలేకపోయినా ఆమె ఇచ్చిన ప్రోత్సాహంతో నేను గేమ్ గెలవగల ననుకున్నాను.

నేను ర్యాకెట్‌తోపాటు కోర్టులో ప్రవేశించేదాకా సుశీల అన్న ముక్కలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నై. నేనొకమారు వచ్చిన ప్రేక్షకులవంక చూశాను. హఠాత్తుగా నా కళ్లు ఒక కుర్చీ దగ్గిర ఆగిపోయినై. ఎవరా పిల్ల? చిత్రలేఖ కాదూ? అవును చిత్రలేఖే. ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు? ఆమె ప్రక్కని సూటు వేసుకున్న కుర్రవాడు ఎవరూ? బహుశా నా ఓటమి చూద్దామని వచ్చిందనుకుంటాను. అందుకనే ముందు వరుసలో కూర్చుంది. ఇంకేం వచ్చాము. సుశీల నాకు ఇచ్చిన కాస్త ఉత్సాహమూ చంపటానికే చిత్రలేఖ వచ్చిందనుకున్నాను.

ఆట మొదలుపెట్టాము. సర్వింగ్ నా ప్రత్యర్థిదే. నాలుగుసార్లు బంతి తిరిగిన తర్వాత అతను "చాఫ్" కొట్టాడు. నాకు ఇలాంటివి తియ్యటం అలవాటే. రాకెట్ అడ్డం పెట్టగానే బంతి లేచిపోయింది. చూసేవారంతా చప్పట్లు కొట్టారు. నేను వోరగా చిత్రలేఖ వేపు చూశాను. చిత్రలేఖ నన్ను చూసి చప్పట్లు కొట్టేదల్లా మానుకుంది.

ఏమిటి చిత్రలేఖ ఉద్దేశం? ఈమె ప్రశంశకోసం నే నిక్కడ వాచిపోతున్నానా? లేక నా ప్రత్యర్థికోసమై కొట్టి వుంటుందా?....ఎవరికోసమైనప్పటికీ నే నెక్కువ బుర్ర బద్దలు చేసుకోదలుచుకోలేదు. నా ఆట నేను ఆడివేశాను. జయం సంపాదించానుకూడా. కోర్టులో వున్న వాళ్లంతా వచ్చి నన్ను కంగ్రాచ్యులేట్ చేశారు. చిత్రలేఖ కొంచెం దూరంగా నిలబడి ఆ యువకునితో ఏదో వుత్సాహంగా చెప్పతోంది. నేను గెలిచినందుకు నిజంగా చిత్రలేఖకు సంతోషంగా వుందా? నాకు ఆశ్చర్యం వేసింది. నేను వాళ్ళ ప్రక్కగా వెళ్లాను. నన్ను చూడగానే చిత్రలేఖ మాటలు ఆపి ముఖం గంభీరంగా పెట్టింది. చిత్రం - ఏమిటీ చిత్రలేఖ నటన?

ఇది జరిగి కొన్నాళ్లయింది. నేను టేబిలు దగ్గర కూచుని కథ గీకుతున్నాను. ఇంతలో శాంత అక్కడికి వచ్చి - "నీకు తెలుసునా అన్నాయ్? సుశీల పెళ్ళట. నన్ను ఆహ్వానించిపోయింది. కాని నేను వెళ్ళటంలేదు." అన్నది.

నా గుండె గుభుక్కుమన్నది. సుశీల మీద ఎంతో ఆశపెట్టుకున్నాను. ఆఖరికి ఆమెకూడా ఇలా మోసపుచ్చింది. నా నోటవెంట మాటరాలేదు. ముఖం వాడిపోయింది. చివరికి ఎలాగో కాస్త నవ్వు తెచ్చుకుని - "ఇంకేం. శుభవార్త. మరి నువ్వెందుకు పోవు?" అన్నాను.

"ఎలా పోయేది? ఇటు చిత్రలేఖకు కూడా పెళ్లిమాటలు జరుగుతున్నాయి. ఆ పిల్లకు పెళ్లి ఇష్టంలేదు. నేను ఎంతో చెప్పాను. ఉహుం. తను పెళ్లి చేసుకో దట, సరేకదా, సుశీల పెళ్లికికూడా రానన్నది" అన్నది శాంత.

"ఏం, పెళ్లి చేసుకుంటే? ఆ పిల్లకు అన్నిటిలోనూ బడాయి!" అన్నాను నేను.

శాంతకు చాలా కష్టం వేసింది. చిత్రను ఏమీ అనగూడదు. "అలా అనకు అన్నాయ్. చిత్ర మంచిది," అని విచారంతో శాంత వెళ్లిపోయింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

కాసేపు ఉన్న తర్వాత శాంత మళ్లీ నా గదిలోకి వచ్చింది. అప్పటికి ఆమె ముఖాన విచారమేమీ లేదు. ఏదో చెప్ప టానికి గట్టి సంకల్పంతో వచ్చినట్టు కనిపించింది.

నేను కొంచెం ఆశ్చర్యంతో శాంత వంక ప్రశ్నార్థకంగా చూశాను. శాంత దగ్గరికి వచ్చి అన్నది. "అన్నాయ్, నువ్వు చిత్రకు ఒక సహాయం చేసి పెట్టాలి. చెప్పు, చేసిపెడతావుకదూ? నీ మీదనే ఎంతో ఆశపెట్టుకువుంది" అన్నది.

ఏమిటి శాంత చెప్పేది? చిత్రలేఖకు నా సహాయం కావాలా? ఏమిటీ చిత్రం. ఆమె గర్వమంతా ఏమయింది? నాకు ఆశ్చర్యంతోపాటు చిత్రమీద కొంచెం జాలికూడా కలిగింది.

"ఏమిటే నువ్వు చెప్పేది? చిత్రలేఖకు నా సహాయమెందుకు? అయినా నేను చెయ్యగలిగిన సహాయమేముంది?" అని అడిగాను.

శాంత కొంచెం బ్రతిమాలుతున్నట్టుగా - "ఏమైనా చెయ్యగలిగితే నువ్వు ఒక్కడివే చెయ్యగలవు అన్నాయ్. ఇంక ఇతర్లవల్ల కాదు" అన్నది.

"ఎలా?" అని అడిగాను నేను, మరింత ఆశ్చర్యంతో.

ఈమాటు మా శాంత సమాధానం వినేవరకు నాబుర్ర తిరిగిపోయింది.

చిత్ర నన్ను తప్పితే పెళ్లి చేసుకోదట. ఇంకెవరికన్నా ఇస్తే భావిలో దూకుతా నంటున్నదట. ఈ సంగతి చెప్పి శాంత అన్నది - "అన్నాయ్, ఏదో విధంగా నువ్వు దాన్ని ఉద్ధరించు. చిత్ర చాలా బుద్ధిమంతురాలు. దాని ప్రాణం నీ చేతులోవుంది. నామాట విని దాన్ని పెళ్లిచేసుకో. నువ్వు సరే నంటే నేను అమ్మనూ, నాన్ననూ కూడా ఒప్పిస్తాను. చెప్పు అన్నాయ్." అని బ్రతిమాలడం మొదలుపెట్టింది.

నాకు ఇంకా పాత సందేహాలు కొన్ని తీరలేదు. ఆశ్చర్యంతో మా శాంతను అడిగాను. "ఏమే శాంతా. నిజంగా నన్ను చిత్రలేఖ పెళ్లి చేసుకోవాలంటు న్నదా? ఆ పిల్ల ఎప్పుడూ కూడా నన్ను చూస్తే ఇష్టం లేనట్టు అదో రకంగా మూతి

పెట్టేది. నా గాలి సోకితే అక్కడ ఉండేది కాదు. ఆఖరికి నా కథలు కూడా ఆ పిల్లకు ఇష్టంలేదన్నావు కదూ?"

"నువ్వు చిత్రను సరిగా అర్థం చేసుకో లేదన్నాయ్. చిత్రకు నువ్వంటే మొదటి నించీ పెద్ద అడ్మిరేషన్. అయితే దానికి గొంతుమునగ సిగ్గు. చస్తే అది బయట పెట్టదు. నీ కథలంటే దానికి మహా ఇష్టం. నువ్వు చూడలేదేమో, ఈమధ్య "కాటుక" అనే మాసపత్రికలో నీ కథ లను పొగడుతూ ఒక వ్యాసం రాసింది. దానిదగ్గర నీ కథల కటింగ్స్ అన్నీ ఉన్నై." అన్నది మా శాంత.

అయినా కూడా నా సందేహా లింకా పూర్తిగా వదలలేదు. అడిగాను. "అయితే ఆ పిల్ల వెంట వుండే యువకుడెవరే? ఎప్పుడు చూసినా అతను తయారు."

మా శాంత పకపక నవ్వి "ఓసి భలే డింకీ కొట్టావు ఇక్కడ. ఆ కుర్రవాడు చిత్ర అన్నే. ఆ పిల్ల ఒక్కతే ఎక్కడికీ పోదు. ఆవాళ నా దగ్గర నీ టోర్నమెంటు సంగతి విని, వాళ్ళ అన్నను బ్రతిమాలి వెంటబెట్టుకు పోయింది. ఇక ఆ మరు నాడంతా నేను దాని నోటినించి నీ కౌశ లం వినలేక చచ్చాను" అన్నది.

నేను శాంతను కొంచెం తాజాచేస్తూ "మరింతకాలం ఆసంగతి నాకు చెప్పనే లేదేమే. ఎప్పుడూ సుశీలనే పొగుడుతూ ఉండేదానివి" అన్నాను.

"నిన్ను గమ్మత్తు చేద్దామనే." అన్నది శాంత.

"గమ్మత్తుకాదు నీ మొహం. నీవన్నీ కోతి చేష్టలు" అన్నాను నేను తెచ్చు కున్న కోపంతో.

శాంత ఏమీ మాట్లాడలేదు. నవ్వు కుంటూ వాకిలిదాకా పోయి - "అన్నాయ్ నువ్వెక్కడికీ పోమాకు. అమ్మను కను క్కొని నీకు మళ్లీ ఏసంగతీ చెబుతాను" అని వెళ్లిపోయింది.

నా కళ్లముందునించి ఏదో పెద్ద అడ్డం తొలగినట్లయింది. నే నింతవరకూ చిత్ర లేఖ సిగ్గును అహంకారమని భావిస్తూ వచ్చాను. ఇప్పుడు నా మనసేకాదు, శరీరం కూడా తేలిక అయింది. ఆనంద వాయువులలో తేలుతున్నట్లనిపించింది. నా స్నేహితుడి చెల్లెలు లీలనూ, నాచెల్లెలి స్నేహితురాలు చిత్రకూ ఎంత తేడా! అయినా అంతా స్నేహితుల చెల్లెళ్లే వెంటనే పడతారు!

నేనుమాత్రం ఆనాటినుంచి నా స్నేహి తులకు చెల్లెలి స్నేహితురాళ్లనే నమ్ముకో మని ఉపదేశమిస్తున్నాను. అయినా నా అనుభవంకూడా ఎంత? "స్త్రియాంచ చిత్తం పురుషస్యభాగ్యం, దేవా నజానంతి కుతో మనుష్యః" అన్నారు పెద్దలు. అంచేత అలా సలహా ఇవ్వటం కూడా నాది తప్పేనేమో.

# నెలమణి

ఇన్నాళ్ళకు - ఈవాళ ఉదయం అటు సూర్యుడు ఇటు పొడిచాడు:

ఇలా జరిగిందని నీవూ నేనూ, ఆశ్చర్య పడుతున్నామా? విస్తుపోయి చూస్తున్నామా? నహి! - ఒట్టుకోసం వాడుకునే పాతప్రయోగం ఒక్కసారి, ఎందుకో నిజమైనప్పుడు - మన అదమరపు పెట్టే బాధకు ధరీ అంతూ అంటూ ఉండదు.

- వెంకటపతి, - ఈ బాధంతా, - జాలితో అర్థంచేసుకున్నాడు: దైవం ఎట్టకేలకు మనమీద దయ దలచాడు!

అసలు అంతేకద:- నీవూ నేనూ, - మనమందరం మంచి గృహస్థులం: చౌక్కా పంచా, గట్టిగా మాపు తేలకముందే, - మడతలు మార్చుకునేందుకు నోచుకున్నవాళ్ళం; కాఫీహొటలు లోకి, ధీమాగా, రొమ్ము విరుచుకుని, జైత్రయాత్రకు వేసే అంగలతో ప్రవేశించి, కమ్మగా తిని, గర్రున త్రేన్చి, - ఘంగున యాపాయితీసి, బల్లముందు వాడి మొగాన కొట్టి, యాదాలాభంగా, పెడ మొగంతో, వాడు అందిచ్చిన చిల్లర, ఎడమచేతిలో వేయించుకుని, ఆ చెయ్యీ చెయ్యీ అపాళంగానే, గుమ్మం మొగదల కూర్చున్న కిల్లీ దుకాణదారుడి కళ్ళముందు విప్పి, - కావలసిన సరంజామా, కనుసైగతో విప్పి చెప్పి - అంది పుచ్చుకుని, - కాలణా ధర్మంచేసి పోతా మేమోనని, గంపెడు ఆశతో, మన చుట్టూ మూగే, దిక్కుమాలినవాళ్లకు ఒక్క కటాక్ష వీక్షణం పారేసి, - ఇప్పుడు చిల్లర లేదని, - ఖచితంగా చెప్పి - అప్పటికీ పట్టిపల్లార్చేవాడిని అలవోకగా గద్దించి, - ఇంకా విడవకుండా అనుగమించేవాడిని - హుంకరించి, - హితబోధచేసి, - రాజెవరి కొడుకన్నట్టు, - పురివిప్పి - నిలుచుంటాం! అలా నుంచోగలం! -

మన ముందర వెంకటపతి, - ఏపాటి? అసలు వాడుకూడా ఓమనిషేనని, లోకం ఎందుకు అనుకుంటూందో, అనుమతిస్తూందో, మన కెవరికీ నిజానికి, అర్థం కావడం లేదు కాదూ? - ఇదే, ధర్మప్రభుత్వమై - మనం మెసులుతూన్నదే, ఏవంతైనా సత్యయుగమైతే, - వాడిని నాలుగు కాళ్ళమీద నడిపించవద్దూ? -

మనం పుట్టకముందునుంచీ, - వెంకటపతి, పరమ దరిద్రుడు: కర్ణుడి సహజ కవచ కుండలాలల్లే, వీడు తల్లి

మల్లాది రామకృష్ణశాస్త్రి

గర్భంలో నుంచి,- అలా చీలికలు వాలి కలతోనే పుట్టి ఉండాలి: వాడి చొక్కా జేబుకన్న మరో వ్యర్థపదార్థం సృష్టిలో ఎక్కడన్నా ఉందా ?- అతగాడికి అరచెయ్యే జేబు- నీవో నేనో ఈ పీడ వదిలించేందుకు,- నాడూ నేడూ పావో - పరకో రాలిస్తే- దాన్ని తక్షణం,- వాడు ఏ యిడ్లీలోకో మరుక్షణంలో వినిమయం చేసేస్తాడు- పొగ చేసేస్తాడు-

వాడు కనబడటం భయంకద!- కంటపడితే, - అడగకుండా మానడు కద,- బ్రతికున్నన్నాళ్ళూ పరగడుపే!- ఎవడు ఆరుస్తాడు,- ఎవడు తీరుస్తాడు- ఇలా అన్నమానం, నిన్నూ నన్ను పట్టుకు వేధించకపోతే,- ఏలేందుకు అంటే దేశాలు, ఎవడికీ ఈనాడు లేకపోతే: పోవచ్చును కాని,- సప్తద్వీపాల్లో, మహరాజు లాగా ఎత్తుకు తినవచ్చునే-పాడేం?

ఎలా బ్రతుకున్నాడు- మన అందరం దయతలచబట్టి ? - అంతేకద ?-

మరి, ఎందుకు బ్రతుకున్నాడు-తినేందుకు, తిండిలేక,- ఉండేందుకు ఉనికి లేక,- ఓనాడన్నా, బట్టమార్చి బట్ట కట్టుకునేందుకు,- మరో పంచా చొక్కా అంటూ లేక-

ఏమో,- నీకూ నాకూ అర్థంకాదు: 'ఏం పంతులూ; ఇలా బ్రతకడం కన్న,- కాస్త ఓపికపట్టి,- కళ్లు మూసేసుకున్నావంటే- నీకు నీబాధా తప్పుతుంది; మాకు నీ పీడా వదిలిపోతుంది-' అని లక్షసార్లు మనం మనసులో విసుగుతో, అనుకున్నామే కాని, ఒక్కసారన్నా నోరు విడిచి వాడితో, అనలేక పోతున్నాం,- అందుకు, మన మంచితనమే,- మన భూతదయే కారణం- కావడానికి ఏ మాత్రమూ సందేహం లేదు!-

ఏ విధానన్నా- ఒక్కరోజన్నా, వాడిని మరచిపోదామన్నా- ఇవాళిటికీ వెంకటపతి బెడదలేకుండా పోయింది - అని అనుకుందామన్నా - ఏదీ, ఆ సుదినం ఎంతటికీ రానిదే!-

వాడి బ్రతుకుమీద, మనకు విసుగేసి పోయింది కాని,- వాడికి, ఏ మాత్రమూ ఆ యింగితం, లేందే!-

*

నిన్నా మొన్నా,- వెంకటపతి కనబడలేదు-

-ఇప్పటికప్పుడే చూసి,- వారం దాటుతూంది-

నీకూ కనబడటం లేదు- నాకూ కనబడటం లేదు - లేక ఏమైపోయినాడు-?

అఁ- ఏమైపోతాడు అంత హఠాత్తుగా ఉన్నట్టుండి ?-

జబ్బు చేసిందా - ?

జబ్బుఅంటూ వాడికి, ఇవాళ కొత్తగా చేయాలా ?- వాడిని చూస్తేనే, ఎదుటివాడికి ఖాయిలా చేస్తేఅంత రోతమారితనంలో ఇన్నాళ్లనుంచీ బ్రతకడంలా ?- అలాటివాళ్లకు, - రోగం రొష్టూ, ఈ

భయాలేం లేవు: ఎల్లకాలం ఉట్టి కట్టుకు వూరేగుతారు ! -

అయినా,- ఒకవేళ, దేహం శాశ్వతం కాదు గనుక, రాలిపోయినాడేమో?- పోతే పోనూ వచ్చు : అందులో మహావిడ్డూరం ఏముంది ? - ఎండాకాలంలో, టప - టపా, అగమ్మ కాకులూ - గబ్బిలాలూ ఎన్ని రాలిపోవడంలా ? - అంతే ఇదీని!-

అంతేకాని, - అలా కాదులే, - ఎంత చచ్చు గా బతికినా, - ఉన్నన్నాళ్లూ,- కొంచెం కుడి ఎడమగా, మనిషి క్రిందనే జమకట్టింది లోకం - క ను క, రోడ్డు పక్కనో, సైడ్ కాలువలోనో, ఏ కుక్క పిల్లో బిర్రబిగిసి పడిఉంటే, - కాలుకు తాడుకట్టి యీడ్చి అవతల పారేస్తాం - అంతకన్న - దాని కుల గోత్రా లేమిటా అంటూ అజ కనుక్కోం !- మరి, - మని షన్న తరువాత అ లా కా దే ! - ఎంత దిక్కుమాలిన పోత పోయినా, - బతికి ఉండగా, - వాడిని మనం బతికినవాడి క్రింద కట్టకపోయినా, తీరా ఓ ప్రాణి పోయింది అని ఖచితంగా తేలినమీదట- మట్టి మట్టిలో కలిపేముందు - ఆ జీవి పూరూ పేరూ ఎలాటిదో,- కొంత భోగట్టా తెలుసుకునేందుకు దర్యాప్తు చే స్తాం ! - ఎందుచేతనంటే, - వాడు బతికి ఉన్న న్నాళ్ళూ ద య్యం - చచ్చిన తరువాత మనలాటి మనిషే - అవునా ? -

తెల్లవారి లేవగానే, పత్రిక తెరవడానికి భయం - ఏమో ఎక్కడన్నా ఆ వార్త కంట పడుతుందేమో ?- 'ఫలానా చోట- అనవాలు తెలీని మొగ కళేబరం-'అన్ని తాణాల్లోనూ దాని బొమ్మలుంటాయి - ఎవరన్నా చూసి గుర్తించేందుకు అవ కాశం ఉంది!

ప్చ్ !- ఎన్నాళ్లు ఎదురు చూసినా, ఆ పోణెము లేకపోయె ! - వెం క ట ప తి ఇన్నాళ్లూ కంటపడి వేపుకు తినేవాడు - ఇప్పుడు ఏ మై నా డో తెలియకుండా, - పీడిస్తున్నాడు: ఎలా, మనకు యీ బాధ వదిలేది ?— ఏదో, ఓ చల్లని కబురు, నికరంగా తెలిసేది ? —

*

ఆ వాళ, వెంకటపతి, కనబడటమేమిటి,- మన ప్రాణాలన్నీ ఈ మూల నుంచి ఆ మూలకు లేచిరావడ మేమిటి ?-

మళ్ళీ కళ్లకు కనబడడు అనుకున్న ఘటం చూపులకు అం దా డు అ నే విస్మయం - విషాదం,- రవంత భయం- మన కవళిక దానంతట అదే, అభిన యించగలదు: కాని, ఏమని, పలుక రించాలి ? - ఎ లా ప్ర శ్నిం చా లి ? - ప్రశ్నించామే బో -

'ఎప్పుడొచ్చావురా ? - '

'నేను- ఎక్కడకి వెళ్లాను ? - '

'మరి - యిన్నాళ్ల నుంచీ ఏం చేస్తు న్నావ్ - '

'మీ అందరూ చేసేదే - '

'అనగా-'

'బ్రతుకు తున్నాను - బట్ట కడు తున్నాను! -'

'అర్థం కావడంలేదు-'

'-అయితే బ్రతకడం సుదుర్లభం-'

-ఊహు! - ఏమిటి వీడి వాలకం ? - వెర్రా ? - తలపొగరా ? - ఏదీ , పరకాయించి చూడనీ -

అరె! - వీడికి యీ ఇస్త్రీ మడతలు ఎక్కడివి ?- అరెరె! వీడి చింకిరిజుట్టు,- క్రాపింగ్‌గా మార్చడానికి వీలుందా ? - ఇదేమిటి,- వీడూ మనిషిలాగా తయారైనాడేం?, ఇంచుమించు అచ్చంగా మనం ఉన్నట్టే ఉన్నాడేం ? -

-ఇన్నాళ్లకు తీరా ఇప్పుడు పుట్టిందేం, వీడికి యీ దుర్బుద్ధి ? - ఏ మహరాజో, ఈ శని వదుల్చుకునేందుకు, ఒకటో రెండో మొగాన కొట్టాడనుకుందాం : అది పాదంగా ఉంచుకుని,- ఏ పది రోజుల పాటో కలో గంజో త్రాగకుండా-ఎక్కడో యీ గుడ్డలు పడిదెకు తెచ్చుకుని ఉంటాడు- అక్కడికి ఆ సింగారం చాలనట్టు, పనిలో పనిగా,- తల అంబట్టుడికి దర్శించుకొని ఉంటాడు-ఇలా ఆ కాసూ వీసమూ క్షౌరం చేసుకుని, - మళ్లీ యధాప్రకారం తయారు!-

మునుపటికన్న తరహా మారిందాయెను - దానం మోతాదు కూడా, ఎక్కువ వడేస్తాడేమో ? - పరకో పాతికో, కాకుండా,-కరుకులు రాల్చమంటే-మనం ఇహ వీడిని తప్పించుకునేందుకు పూరు విడిచి పారిపోవాలి!- అందుచేత, ముందు కాళ్లకుబంధంగా, వాడు అడగకముందే,- ఎరవేసి చూద్దాం ! - కొద్దిలో సర్దుకుపోతుంది:

'ఏంరా కాఫీ త్రాగుతావా ? -'

-వీడు పుట్టి బుద్ధెరిగిన తరువాత, ఎవడన్నా, ఎన్నడన్నా ఇంత అప్యాయంగా ఆహ్వానించాడా?- ఎగిరి గంతేయవద్దూ?-

'ఊహుం. త్రాగను-'

- ఏమిటీ వింత?- ఆ గుక్కెడు వేన్నీళ్ళు కొనుక్కునేందుకు వెధవ - బేడ డబ్బులకోసం- ఉదయం రెండు ఘళ్లూ, సాయంత్రం రెండుఘళ్లూ - కాళ్లు బలపాలు కట్టేట్టు తిరిగేవాడే - ఎవడు కనబడుతాడా అని, అడుగడుగనా కాపేసేవాడే- కనబడ్డవాడినల్లా దేవిరించేవాడే!- అల్లాంటివాడు- వీడు - ఈ వెంకటపతి - కాఫీ యిప్పిస్తానంటే, నదురూ బెదురూ లేకుండా అక్కర్లేదని, చెప్పేరోజు కూడా వచ్చిందీ అంటే - యిది, పచ్చికలి గాక మరేమిటి ? -

' అదేమిటిరా - కాఫీ త్రాగక పోవడమేమిటి ? '

'మానేశాను!-'

'మానేస్తే - మరి ఎల్లా?-'

'ఎల్లాగో అల్లాగే వెళ్ళబుచ్చుతున్నాను-'

'పాపం!'-

-అవును పాపం,- విసుక్కున్నా నసుక్కున్నా - ఎరుగున్న వాళ్లం - మొదటి నుంచీ వాడిస్థితి ఎరుగున్నవాళ్లం- మేము దయ దలచాలికాని, లోకానికేం?- సవాలక్ష యాచకుల్లో వీడొకడు!—

-'ఏంరా, అలా కాఫీనీళ్లన్నా లేకుండా, మాడుతూ - కనబడకుండా మాయమైనావేం?-'



'ఏంచేయను? రోజులు మారినాయ్!'

'మా రోజులు మారలేదులే - ఎంత కాటకమైనా - నీకు కాఫీకి ఎన్నడన్నా కాసిని డబ్బులు యివ్వడానికి గతిమాలే స్థితికి రాములే!-రా,-రావోయ్! మొగమాట మెందుకూ ? -'

చెయ్యిపుచ్చుకుని, వాడిని బలవంతం చెయ్యాలని, ఎందుకో మనసైంది నాకు: పిడు లోపలికి, వచ్చేపోవెంలో లేదు అని అంతర్వాణి, మనకు, నికరంగా అభయం యిస్తూంది: అందువల్ల అంత ధైర్యంగా పిలిచాను:

ఊహూఁ!- వాడు రానన్నాడు!-

రాకపోతే, నామీద ఒట్టు : అందాం అనేంతవరకూ వచ్చాను గాని, - తీరా నోరు జారిం తరువాత, నన్ను అనుగ్రహించడానికో అన్నట్టువాడు, వెంట వేంచేసి, విరుచుకుతిన్నాడా అంటే-అనక పస్తాయించి లాభంలేదు :

మెత్తపడతాడేమోనని భయంవేసింది-అందుచేత,- సరే పోన్లేరా, నీ యిష్టం! -

అని నిష్ఠురంవేశాను: వెంకటపతి తనలో తాను నవ్వుకున్నాడు-

'కాఫీ వద్దకపోతే మానె, ఒక్క సిగరెట్ వేసుకో!-'

వాడు, పెదవి విరిచాడు - 'అదీ జలాయేరా అబ్బి!-' అంటూ!

'అ!'-అంతకుమించి మరో అక్షరం నాలోంచి పెగిలిరాలేదు-

'మరేరా, నాన్నా-పెద్దవాణ్ణవుతున్నానా ఆ రోజు కారోజు - ! - అస్తమానం కాఫీ సిగరెట్లూ పోసిపోసి,- యీ తిత్తీ-ఆ తిత్తీ, దెబ్బ తినేట్టు ఉన్నాయి - కొంత కాలం వాటికి స్వస్తిచెప్పడం మంచిదని,- ఇది నాకుపుట్టిన బుద్ధి కాదనుకో - మొత్తానికి అలానే నాకూ తోచింది - అంచేత, ఏవో పళ్ళూ పాలూ, గ్లూకోజ్, ఓవల్‌టీన్,- ఇలా లఘువుగా పోనిస్తున్నాను!-

'ఉఁ-పోయిరా ? లోపలికి-ఆకలేస్తున్నట్టున్నావ్-' అంటూ, నన్ను గుక్క తిప్పుకోనీకుండా,-నిదానంగా, నిర్లక్ష్యంగా నడిచి వెళ్ళిపోయినాడు-

-వాడు అన్నమాటలు నిజమేమో అన్నంత భయంవేసింది: గుండెలు ఎగిరెగిరి పడ్డాయి- తలా నొసలూ బిర్ర బిగుసుకు పోయినాయి : ఒళ్లంతా పూదర పెట్టింది-

కాని,- కాని,- ఇదొక తరహా పిచ్చేమో, ఇలా, పైత్యం ముమ్మరంగా ప్రకోపిస్తే- అన్నం నీళ్ళూ ముట్టకుండానే, - ఆ హెచ్చు దిగేంతవరకూ, వెర్రి బలంగానే ఉంటారు ! - అంతే అయిఉండాలి: - వాడి చూపూ, వినురూ, ఆమాట విరుపూ అంతా, - ధోరణి అలాగే ఉంది : నిజంగా ఇది పిచ్చే!-

అమ్మయ్య,-ఇప్పటికి మనసు కుదుట పడ్డది-

-ధర్మదాతలం అందరం కూడబలుక్కున్నాం!- సులువుగా ఏకాభిప్రాయానికి వచ్చాం!- ఇక అనాటినుంచీ, వాడికోసం వేట ప్రారంభించాం! రోజూ ఓ గంటో అరగంటో వాడు తగిలితే, ఎంత బాగుండును! - వెర్రివాడి భరతం పట్టొచ్చు: వాగించి,- అధోరణికి మనం ఆనందించవచ్చు! - ఇంతకాలం నుంచీ తప్పని సరిగా, వినోదంపన్ను చెల్లగడుతూన్నందుకు, ఫలం ఇహనుంచన్నా అనుభవించవద్దూ ? - కాని, ఎంత గాలించి చూచినా, వెంకటపతి చిక్కందే!

వెర్రివాడు కనుక, జనం విశేషంగా ఉండే ప్రదేశాలన్నీ పరిహరించి,- ఒంటరిగా ఎక్కడన్నా ఆత్మానుసంధానంలో పడి,- మమ్మల్నీ తన్నూ మరిచిపోయినాడేమో అని, - మా నగర పరిసరాలైన సుందర నిర్జన ప్రదేశాలన్నీ వస్త్రఘాలితం చేశాం - కాని ఒక్క అణువైనా, వాడి ఆచోకీ అందలేదు-

ఇక మరి, ఎక్కడ వెదకం? ఎక్కడ ఉన్నాడని వెదుకం!- ఈ అన్వేషణావస్థనే- అదుర్దానే, వైష్ణవులు, వాళ్ల పరిభాషలో ఏదో ముద్దుపేరున పిలుచుకుంటారు:

కాని, మేం మట్టుకు వెర్రి ఎక్కేంత స్థితికి వచ్చి, - అంతటితో మా అదృష్టం కొద్దీ తెప్పరిల్లి - ఇక వాడి ప్రసక్తే తల పెట్టడం మానేశాం!- జీవితానికి ఇద్దరిని, వెంకటపతి మళ్లీమనకు తగలడంఅనేది



సంభవం కాకపోవచ్చునని, మనసుకు సంబాళించుకున్నాం!- కచ్చగా!- మాకూ వాడికీ, అంతవరకే రుణమా?-

★

ఆవాళ, సూర్యోదయానంతరం-

హొటల్లో యథాస్థానంలో కూర్చుని, ఇడ్డెన్లు కబళిస్తున్నాను:

యథాస్థానమంటే- నాకు ఎందుచేతనో ఆడవాళ్ల బల్లదగ్గిర చతికిలబడటం అలవాటైంది - అది మరీ వేకువ కనుక, స్త్రీజనం మేతకు తరలిరాదు - అందుచేతనే కాబోలు, హొటలు ఆసాములు నన్ను, అక్కడ కాదని మందలించకుండా, చూసీ చూడనట్టు వూరుకుంటున్నారు- ఒకవేళ, ఏ ముగుద అయినా, రావడం అంటూ తటస్థించినా, నన్ను మీరిన వయసుదైతే, నేను అక్కడలేనట్టు, సరసనే చతికిలబడుతుంది: మీరని పడుచైతే నిర్లక్ష్యంగా, మెదరిక్కించి, మరో స్థావరం ఆశ్రయిస్తుంది-

ఇది అంతా కేవలం అప్రస్తుతప్రశంస అనుకునేరు: కాదు, కథకు గంపెడంత సంబంధం ఉంది కనుకనే-

-సరే, నేను అలా తలవంచుకు భుజిస్తున్నాను- ముగిసేలోపుగా,- ఆవిడ వచ్చి, నా ఎదురుగుండా కూర్చుంది: నేను,

అదరిపాటున తలఎత్తి చూస్తే, పరకా యింపుగా చిరునవ్వు నవ్వింది - అతి మామూలుగా పలుకరించింది:—

'ఏమండీ!- మీస్నేహితులు ఏరీ?'

-ఎవరా అన్నట్టు చూశాను-

'వెంకటపతిగారండీ! -సాధారణంగా ఈ వేళకు మీరందరూ ఇక్కడ కలుసు కుంటారటగా!-'

'ఏమో,- కనబడలేదు!' అని ఉక్కిరి బిక్కిరిగా అన్నాను,-

ఆవిడ నవ్వుతూ, - కాఫీ త్రాగివేస్తూ- 'ఉంటా నన్నారే, - తప్పకుండా-' అని తనలో తాను అనుకుంటున్నట్టు బిగ్గరగా అనేసి,- నా తాలూకు బిల్లుకూడా, కుర్రవాడి చేతులోనుంచి కముచుకుని,- నన్నుమందలింపుగా ఒక్కచూపుచూసి,- విసురుగా, వెళ్లిపోయింది: నేను ఏమీ అనలేక, లోలోపల, కుతకుత లాడుతూ, తలవంచుకుని ఆవిడ వెనువెంటే బయటికి నడచి వచ్చింది - వచ్చిందంటే, - ఈ కాయం!-

ఆవిడ, రోడ్డెక్కి,- కా రె క్కిం ది: - కారు సాగిపోతూంటే నన్నుచూసి,- వెళుతున్నానన్నట్లు అద్దంమాటౌతూనవ్వింది-

ఎందుకు నన్నల్లా అ కా ర ణం గా పరాభవించింది? -

ఆవిడ ఎవరో, - నే నెరుగున్నాను - మీ రెరుగున్నారు. మన రాయల్లందరూ అడియానగా కలలు కనే ఆంధ్ర సర్వస్వమంత గ్రంధసాంగురాలు - నాకూ ఆవిడకూ ఏమిటీ పేచీ?' కలనైనన్, మెలకువ వేళలనైన,- ఎన్నడూ, మా కత్తులు రాపాడలేదే ? -

వెంకటపతి పేరెత్తింది, ఎందుకు ?- అన్నీ మానుకుని, వీడు ఇప్పుడు అక్కడ కొలువుకు కుదిరాడా? - అయితేమాత్రం, వాడి కర్మం వాడిది, - నన్ను తవ్వించవలసిన అగత్యం ఏమిటి?- వాడు కనబడితే,- నిలవెయ్యనూ ?-

- మనసులో అనుకుంటూండగానే, అడుగో, వాడూ ప్రత్యక్షమైనాడు!- కనీ కనపడటంతోనే, - ఏమిటిరా భడవా! ఈ అగడం ? - అం టూ, సూత్రప్రాయంగా ఎత్తుకుని, దులిపివదిలిపెట్టాను. వాళ్లిద్దరినీ కలిపి, - నానోటికి వచ్చినట్లల్లా అన్నాను: వాడు, మళ్లీ జన్మ జన్మాలకు తలఎత్తుకునేందుకు వీలు లేకుండా గదిమాను:

అన్ని దులుపులూ దులపనిచ్చి,-వాడు వీసం అన్నా తొణకకుండా అంటాడు కదా - 'ఏంరా భాయ్!- ఎందుకింత తామసం నీకు? - మనలో మనకు ఎలాటి అరమరికలూ లేవుకదా? - నా బిల్లు ఎన్ని లక్షలసార్లు, నీవు పుచ్చుకున్నావ్?- నేనేమన్నా గింజుకున్నానా? - ఆవిడ తీసుకుంటే—'

'ఆవిడ అంతరం ఏమిటి - నా అంతరం ఏమిటి? -' అని మాట తెగేశాను-

'ఏమీలేదు- మీ యిద్దరూ నాకు ఒకటే-'

ఆ మాట నాకు, కమ్చీ తగిలినట్టు తగిలింది - అది కనిపెట్టి, వాడు భుజం మీద చెయివేసి, నర్దిచెప్పాడు- 'అన్నట్టు- మే మిద్దరం పెళ్లిచేసుకున్నట్టు - నీకు చెప్పలేదు కదూ ?-' నేను, వెనువెంటనే నిర్ఘాంతపోయినాను-

'నిన్నా?- ఏం చూసి చేసుకుందిరా?-' నా మనశ్శాంతి కోసం పగలబడి నవ్వాను -

'నేను అ ప్రశ్న అడగలేదురా భాయీ!- చేసుకుంటానంది, - నరే నీ యిష్టం అన్నాను- నేను అయింటివాణ్ణయినాను-'

-ఇదంతా గట్టి బుకాయింపేనని నా నమ్మకం - కాని, నిజమేనేమోనని, ఏదో బిక్కు బిక్కుగా ఉంది-నిజమే అయినా, నేను నమ్మతలచుకోలేదు -

'రేపు సాయంకాలం టీకి రావోయ్-' అని వెన్నుఛళ్లుమని చరచి వెంకటపతి మహా పని ఉన్నవాడిలాగా వెళ్లిపోయి నాడు -

-ఉత్తర క్షణంలో ఈ కబురు కార్చిచ్చులాగ పూళ్లో అంటుకున్నది - నేనే అంటించాను - ఎవడు చూసినా నమ్మననే వాడే, - విడ్డూరంగా మరొకడికి, ఈ విషయం చిలవలు పలవలుగా, వివరించే వాడే ! -

ఎవడికి వాడు, - ఈ హంశంలో ఉన్న కిటుకేమిటో తెల్చుకునేందుకు వ్యూహ గానం ప్రారంభించాడు - కాని, ఎన్ని విధాల ఉల్టాసీదాచేసి చూసినా, చిక్కు చిక్కుగానే ఉంది -

అవిడ కేమన్నా పిచ్చి ఎక్కిందా ? - అసంభవం !-

ఏం తక్కువని, ఈ ఏబ్రాసిని కట్టుకుంది ? - ఇంత కాలంనుంచి, దేశం ఏలుతూందే ? -

నరే వాళ్లయింటికి వెళ్లిచూస్తే - ఈ భాగోతమేమిటో అర్థమౌతుందిగా !-....

-వెంకటపతి కారు పంపించాడు: టీకి వెళ్లాను-ఇంటి నౌకర్లందరూ, వాడిని అయ్యగారంటూ అతిగౌరవం చేస్తున్నారు: అవిడ, - టీకు - టాకు ఏమీ లేకుండా, అతి అమాయికపు ముత్తైదువల్లే, - ముసిముసి నవ్వుతూ, పది అడిగితే, ఒక్కటి అతిముక్తసరిగా సమాధానం చెవుతూ, - మగడంటే ఎంతో అణకువతో, వినయ విధేయతలతో,-మెలగింది - వెంకటపతికూడా,-ఏమీ ఎబ్బెట్టు లేకుండా, - ఎంతకాలంనుంచో కాపురం చేస్తున్న నరిపాత - గృహస్థల్లే, - పుటకతోనే ఇంత ఐశ్వర్యం, ఇంత ఠీవి అలవాటైనవాడల్లే - అనిపించాడు - ఎవరూ అంతు చిక్కనీయలేదు -

చివరికి, ఇక మనసు పట్టలేక, - తెగించి, అవిడను అడిగాను - నవ్వి పూరుకుంది - అ నవ్వు సొంతం వినడానికి నాకు భయంవేసింది - ఇంకా అక్కడ ఒక్క నిమిషం ఉండలేక వచ్చేశాను-

- వెంకటపతీ, - అవిడా కనపడుతారేమోనని, - కొన్నాళ్లు వీధులోకి రావడం మానేశాను -

- నేనేకాదు, మాదృశులందరికీ, - ఇదే గ్రహచారం !-అందరంపోగై, మనస్సులో

-మనస్సులో పిసుక్కునేవాళ్లం - ఆవిడ దురదృష్టానికి అప్యాయనంగా వాపోయే వాళ్లం-ఈ దాంపత్యం, మూడునాళ్ల పట్ట పగలేకాని, -నిలవబోయిందా అని, పూర డిల్లేవాళ్లం -

-ఆ శుభ ముహూర్తం కోసమే, నిమి షాలు యుగాలుగా పరిగణించుకుంటూ గడిపాము- కాని, రోజులు గడుస్తున్నాయే కాని,- వాడిరేఖ మారందే!-

ఎక్కడ చూద్దామన్నా, వాళ్లిద్దరే ప్రత్యక్షం - చిలకా గోరింకలకన్నా ఉండదు అంత అన్యోన్యం- ఇదంతా అ వెర్రిబాగులది తెచ్చిపెట్టుకున్న మోజు- వాడి గ్రహబలం -

వాళ్లను చూద్దామంటే చచ్చినచావుగా ఉంటూంది- అగర్భ శ్రీమంతుడల్లే-డబ్బు కాళ్లా చేతులా విరజిమ్ముతాడు - మొన్న మటుకు మొన్న, మా మనుమరాలిని బుజ్జగించడానికి, అలా షికారుగా సముద్రంఒడ్డుకు వెళుదునుకదా - అక్కడ వీళ్లు తయారు!-చూసీ చూడటం తోనే పిల్లదాన్ని ఆవిడ చంకను వేసు కుంది, - వెంకటపతి, నన్ను నెత్తి కెక్కించుకున్నంత హంగామా చేశాడు : ఓ పట్టాన క్రిందికి దించందే!-

పిల్లదాన్ని బులిబుచ్చికం చేసి, అవీ యివీ కొనిపెట్టి యిట్టె నిమిషంలో మప్పు కుంది- అది ఆవిడ కంఠానికి చుట్టుకుని దిగనంటుందే-చివరకు, ఓ ప్రొద్దువేళకు కారులో ఎక్కించుకుని, నాలుగుబజార్లూ తిప్పి, కనిపించిన బొమ్మా- బొటిగా అల్లా కొనిపెడుతూ, మేటెడు సామానుతో, మమ్మల్ని ఇంటిదగ్గర దిగవిడిచి చక్కా పోయినారు- నేనేమో దుబారాగా దుకాణా లన్నీ కొనుక్కువచ్చానని - పిల్లదాని ముత్తవతల్లి, - యిల్లుతీసి పందిరి వేసి నంత పనిచేసింది : అదంతా మన ప్రయోజకత్వంకాదు, - సంభావనవచ్చిన బాపతు అని చెప్పి, - పిల్లదాని చేత సాక్ష్యంచెప్పించి-ఎలాగో మాటదక్కించు కున్నాను - అప్పటకు :

ఇదొక్కటేకాదు- వాళ్లు కంట పడ్డారా అంటే, ఇలాగే దినదిన గండం-

నన్నొక్కడినే కాదు- కనబడ్డ స్నేహి తుణ్ణల్లా వెంకటపతీ, ఆవిడ కలసి ఇలాగే వంచనచేయడం సాగించారు : సిరి అంతా మా ముందు వలకబోసే వారు- కసితీర్చుకుంటున్నట్టు!-అందరం శతవిధాల- వాడిమర్యాదకు అందకుండా తప్పించుకునేందుకు యత్నం చేసే వాళ్లమే, కాని-ఎప్పుడో ఒకప్పుడు చిక్కు తూనే వచ్చాం- ఈ నాటకానికి అంతు ఎన్నటికో తెలియలేదు-

అయితే, ఎల్లకాలం ఇల్లాగే ఉండ వచ్చారా,- ఎప్పటికో అప్పటికి ఆవిడ తెప్పరిల్లి, చేసిన తెలివితక్కువ పనికి రోసి, విడిని తన్ని తగిలెయ్యదా - అనే మా ధైర్యం-....

-దైవం మమ్మల్ని చల్లగాచూడబట్టి,- చివరకు అలాగే జరిగింది - ఒకనాడు ప్రాతఃకాలంలో, వెంకటపతి మాకన్నుల పండువుగా మా మూలు చింకిరితనపు పోడిమితో సాక్షాత్కరించాడు - చూసీ చూడగానే, ఏనుగునెక్కినంత సంతోషం వచ్చి-



‘వెంకటపతి మాకన్నుల పండువుగా మామూలు చింకిరితనపు పోడిమితో సాక్షాత్కరించాడు.’

‘ఏంరా! ఇలా ఉన్నావేం?’ అని మా గొంతులన్నీ ఏకంగా ప్రశ్నించాయి!-

వెంకటపతి, ఎంతో జాలి పడుతూన్నట్టు, -‘మీ కోసమేరా!’ అన్నాడు! -

ఎవడికి వాడికే - ఆ జవాబులో ఏదో మెలిక, పెంకెతనం ఉన్నట్టే అనిపించింది కాని, నలిసుగా అర్థం కాలేదు -

అంటే -

‘మామూలుగానే ఉన్నాను!’ – మేమేమో ఇన్నాళ్లూ, పీడకలలు కన్నట్టూ, -తానేమీ ఎరుగనట్టూ, - ఆ గొంతు!-

‘మరి, ఇన్నాళ్ల నుంచీ ఏలుతూన్న రాజ్యం - ఏమైందిరా -’.

‘రాజ్యం చల్లగానే ఉంది, - కాని, రాజు మాత్రం, ప్రజల యోగక్షేమనిమిత్తం గద్దె దిగి, మళ్లీ కాలినడకలోకి వచ్చాడు -’ వాడి మాటలో చక్రవర్తి ఠీవి ఉంది: వాడి మాటలో మేము అంతకుముందు ఒరసుకోని వాడి తేలుతూంది -

‘మీ కోసమేరా-మీ అందరికోసమేరా-నేను మళ్లీ యీ స్థితికి వచ్చాను! - నా ఒక్కడి సుఖం చూసుకుంటే - మీ అందరూ మంచం ఎక్కేట్టున్నారు -

‘ఇన్నాళ్లనుంచీ, కానీకోసం, మిమ్మల్ని దేవిరిస్తూ, మీరు కనికరించందే ఒక పూట గడవని యీ వెధవాయ్,-మిమల్ని వెక్కిరించినట్టు - మీ ధర్మగుణాన్ని కాలదన్నినట్టు - తగుదునమ్మా అని, తానూ నేటికి ఓ మనిషల్లే తయారై - మీబిచ్చం ఆసించకుండా బ్రతకడం - మీకు తలవంపులు కాదూ? - నే నిలా సుఖంగా ఉంటే - అది మీకు రంపకోతకాదూ - భరించగలరా - బ్రతకగలరా? -

‘నా ఒక్కడి సుఖం ఏ మొచ్చె - ఇన్ని ప్రాణాలు నిలపడం మేలుకాదూ? - అందుచేత, అకారణంగా సంప్రాప్తించిన సిరికి - గట్టిగా ఆలోచించి - మ్యోకాలు అడ్డేశాను - మళ్లీ, - మీతల్లి కడుపు చల్లగా- మీ కృపకు, పాత్రుణ్ణయినాను - ఇక ఎన్నటికీ మీ దయకుమీరి బ్రతకనని అభయమిస్తున్నాను - ఇక గుండెలమీద చేతులు వేసుకుని హాయిగా నిద్రపొండి!-’


- వెంకటపతి ఇలా మనవిచేయడం, కొరడా ఝుళిపించినట్టయింది-

ఇదేమిటి - మళ్లీ వీడు, యీ ధోరణిలోకి వచ్చాడు-అవిడకు మొగం మొత్తి- వీడిని ‘తన్ని తగిలేసిందా? - లేకపోతే - యీ వెర్రివాడే అన్నంతపనీ చేశాడా? ఇద్దరు వెర్రివాళ్లూ, ఎవళ్లకి వాళ్లే తెప్పరిల్లి, కళ్లు తెరిచి, దూసుకున్నారా? అసలు ఎల్లా తంటసమైందో, - ఎందుకు విడిపోయినారో, - వీడిచేత పలికించడం ఎలా?-

‘-ఏంరా, మరి?-’

తెప్పరిల్లి, పలుకరిద్దామనుకుంటూండగానే,- వాడు ఎటో మాయమైనాడు-

కాని,-ఎక్కడికిపోతాడు?- వాడుచెప్పిన మాటే నిజమయితే మళ్ళీమనపాల పడ్డట్టే కదా?- ఇక,- ఇప్పు డెక్కడికిపోతాడు?- మోరాయింపుకైనా, ఎన్నాళ్లని పస్తుంటాడు?- అదేకదూ, మన ధైర్యం-!






[జూలై సంచికలోని మొదటి అంకం తరువాయి]

## రెండో అంకం

మొదటి అంకంలో కనిపించినగదే. ఆ అంకంలో సంఘటన జరిగి పది పదిహేను నిమిషాలైంది. కాంతారావు ఇంకా అలాకుర్చీలో కూలబడి, చేతుల్తో తల పట్టుకునే వున్నాడు. గోవిందు ఒక పక్క చుట్టా, పెట్టా పట్టుకు లోపలి నించి వొచ్చి పైకి వెళ్లిపోతాడు. అవి పైన పెట్టేసి మళ్లీ లోపలికెళ్లి, వెంటనే మరికొన్నివస్తువులతో స్టేజిమీది కొస్తాడు. లోపలినుంచి జ్యోత్స్న, 'గోవిందూ ఓ బండికూడా కేకేసుకురా వెంటనే' అంటుంది. ఆ మాట వినేదాకా కాంతారావుకి చైతన్యంలేదు. జ్యోత్స్న కంఠం అతన్ని లేపింది; ఒక్క! తట్టుతట్టి లేచి కూచుంటాడు.

కాంతారావు: సామానేమిటిరా గోవిందూ ?

గోవిందు: అమ్మగారిది బాబూ.

కాంతారావు: ఎక్కడికి తీసుకుపోతున్నావు ?

గోవిందు: బయట వరండాలో పెడుతున్నా బాబూ.

కాంతారావు: ఎందుకూ ?

గోవిందు: బండిలో పెట్టడానికి.

కాంతారావు: ఏ బండి ?

గోవిందు: పిలుచుకొస్తా బాబూ. కేకేసుకు రమ్మన్నారు.

కాంతారావు: ఎక్కడికి వెళుతున్నారమ్మగారు ?

గోవిందు: నాకు తెలవదు బాబూ. సామాను బయటపెట్టమన్నారు. పెడుతున్నాను. బండి కేకేసుకు రమ్మన్నారు. పిలుస్తాను.

కాం: అందరికీ వెఱ్ఱెక్కి పోతోంది. పో యింట్లోకి పో.

గో: [ఆశ్చర్యపోతాడు. వాడికి సంగతేమీ అర్థంకాలేదు.] బాబూ.

కాం: సామా నింట్లోకి తీసుకుపొమ్మని నీకే చెప్పేది। దీపస్తంభంలా నించోకు.

గో: చిత్తంబాబూ, అమ్మగారు.... [అని రెండడుగులు లోపలికేస్తాడు. ఈ మాటలు విన్న జ్యోత్స్న స్టేజిమీదికొస్తుంది.]

జ్యోత్స్న: [గోవిందుతో] ఇంకా ఇక్కడే వున్నావా? సామాను వరండాలో పెట్టేసి త్వరగా బండితీసుకరమ్మని చెప్పలేదూ?

గో: అమ్మా....అయ్యగారు....

జ్యో: [ఆమాట వినిపించుకోకుండా] వెళ్లు. త్వరగా వెళ్లు. [అని గోవిందు లోపలికి వెళ్లకుండా అడ్డు నించుంటుంది]

గో: చిత్తం. [అని ఒక అడుగు పైకేస్తాడు.]

కాం: గోవిందూ, సామాను లోపలపెట్టమని చెప్పాను.

జ్యో: గోవిందూ, సామాను వరండాలో పెట్టమని చెప్పాను. [గదిమధ్యన సామానుతో గోవిందు నిలిచిపోయి తెల్లబోయి ఇద్దరివైపూ చూస్తాడు.]

కాం: నీకు చెవుడా ఏమిటి? చెబుతూ వుంటే బుద్ధిలేదూ?

జ్యో: (వేలితో పైకి దారిచూపిస్తూ) గోవిందూ, అటూ వరండా!

కాం: (కుర్చీలోంచి అమాంతంగా లేచి, అతి కఠినంగా) గోవిందూ, వెళ్లు ఇంట్లోకి.

జ్యో: (అంత తీక్షణంగానూ) గోవిందూ, పైనబెట్టు సామాను.

[గోవిందు యిటునించి అటూ, అటునించి యిటూ చూసి అకస్మాత్తుగా సామానక్కడే కిందకి దించేస్తాడు. చేతులుజోడించి దండంపెట్టి]

గో: ఈ నౌకరీ నావల్ల కాదు బాబూ. సామానెక్కడపెట్టాలో తేలింతరవాత కబురెట్టండి. శలవు (అని వెళ్లిపోతాడు, బయటికి.)

జ్యో: ఒకభార్య పోతే, మరోభార్యని కట్టుకోవడం ఈ రోజుల్లో తేలిక. నౌకరు మానేస్తే మళ్ళీ దొరకడంలేదు. మొదట వెళ్ళి వాణ్ణి బతిమాలి తెచ్చుకోండి. లేకపోతే చాల కష్టపడిపోగలరు!

[కాంతారావూ, జ్యోత్స్నా ముఖాముఖీనిలుచుని వుంటారు. ఒక్క క్షణం నిశ్శబ్దం.]

కాం: ఏమిటి జ్యోత్స్నా నీకి వెఱ్ఱి?

జ్యో: వెఱ్ఱేముంది? ఇక్కణ్ణించి ఎలాగా వెళ్ళవలసిందాన్నేగా! మీరు గెంటించకుండా వెళ్ళిపోతున్నాననా? పోనీ. అనండి. "పో, ఈ యింట్లోంచి" అనం డిప్పుడు. [ఒక్క క్షణం వూరుకుంటుంది. తరవాత కొంతసామాను చేత్తోపుచ్చుకుని] అనండి మరి, ఇంకా ఆలస్యంచేస్తే అర్ధరాత్రయి పోతుంది.

[కాంతారావు ధోరణి మారుతుంది. అతను జ్యోత్స్న నిజంగా వెళ్లాలనిగాని, వెళుతుందని కాని అనుకోలేదు. నిజంగా వెళ్ళిపోతుందేమోనని భయం పట్టుకుంది.]


కాం: ఎక్కడికి వెళ్ళతావిప్పుడు?

జ్యో: ఈ విశాలప్రపంచంలో నాకు తల దాచుకోడానికి చోటే దొరకదా! ప్రస్తుతం ఈ యింట్లోంచి బయటపడితే మీకు చాలుగా.

కాం: (బాధతో) జ్యోత్స్నా, ఆవేశంతో అన్నమాటలకి అంత పట్టింపా?

[జ్యోత్స్నకి అతని బాధనుచూసి కొంచెం జాలేస్తుంది కాని, బింకం విడవదు.]

జ్యో: పట్టింపేమీ లేదండీ. పరిస్థితి అలా వొచ్చింది. అడ్డుతీస్తారా? వెళ్ళనా మరి?



" ఒరే, వెధవా ? మీ బాబుని నిదర లేపమాకు.
నిన్నరాత్రి ఎల్లా మేలుకుని యివి తెచ్చాడు !"

కాం: ఈ అర్ధరాత్రి నా యింట్లోంచి లేచిపోయి నా కపర్దిష్ట తెస్తావా ? నిన్నిలా రాత్రికి రాత్రే పంపించేశానంటే. నే వీవూళ్ళో ఇంక పెద్దమనుష్యులదగ్గిర తలెత్తుకు తిరగ్గలనా ?

జ్యో: నేనే లేచిపోయానని చెప్పండి. అందరితోటీ. మీ పేరు ప్రతిష్టలకేమీ ప్రమాదం వుండదు, విన్నవాళ్ళందరూ, "అయ్యో మీ కెంత కష్టమొచ్చింద"నే అంటారు.

కాం: ఏమిటంటే దానికే పెడర్థాలు తీస్తావుగదా. నువ్వు ఏమీ తిన్నగా ఆలోచించనివ్వవు.

జ్యో: ఇంకా ఆలోచించేందు కేముందండీ. బుర్ర వేడెక్కిపోయేలాగ ఇదివరకే ఆలోచించే శారుగా.

కాం: నే తొందరపడ్డా ననుకో పోనీ...మరి నువ్వా తొందరపడితే ఎలాగ ?

జ్యో: తొందరపడ్డాని కే ముం ది. నేను పరాయిస్త్రీని. మీ యింట్లో ఎలా వుండగలను చెప్పండి మీరే;

కాం: నువ్వు పరాయిస్త్రీ వేమిటి ?

జ్యో: కాక; అప్పుడే మరిచిపోయారుటండీ. మనవివాహం వివాహమేకాదు, ఏ నిమిషాన్ని ఐడితే ఆ నిమిషం, ఆయనెవరోవొచ్చి "రావే" అంటే నేవెళ్ళాలాయె. మరి నే పరాయి దాన్ని కాక....

కాం: వా డెవరో వొచ్చినపుడు చూసుకుందాం, ఈలోపుగా లోపలికి పద.

జ్యో: ఇది అసలే తిన్నగా ఆలోచించకుండా అంటున్నమాట సుమండీ. వా దొచ్చేదాకా నే యిక్కడే వుండిపోతే, మీ రసలు జైలుకికూడా వెళ్ళాలిస్తొస్తుందేమో. ఇప్పుడయితే తెలిసిచేశాము. తెలీగానే తప్పు దిద్దుకున్నా మనన్నా చెప్పుకో వొచ్చు.

కాం: ఏదంటే దానికేచెబుతావు. ఏంచెయ్యడానికి పాలుపోకుండా వుంది.

జ్యో: అంచేతే అడ్డుతగలకుండా, నన్నిలా పోనివ్వండంటున్నాను.

కాం: మళ్ళీఅదేమాట! ఏమీఆలోచించకుండా అన్నానని ఒప్పుకున్నానుగా. (అతి జాలిగా మొహంపెట్టి) ఈ ప్రయాణం మానుకోవూ?

జ్యో: ఈ ప్రయాణం అసలుమానుకుంటే ఎలాగలెండి. కాదాఅంటే, ఈ రాత్రికి మానుకుని తెల్లారగానే వెళ్లాలి.

కాం: (అతృతతో) ఈ రాత్రికి వుండి పోతావుగద! రేపటిసంగతి రేపు చూసుకుందాంలే. పద లోపలికి [అని చేతులో సామానుతీసుకు, చెయ్యి పట్టుకోబోతాడు]

జ్యో: అబ్బ, ముట్టుకోకండి మరి! నేను పరాయిదాన్నని మరిచిపోనని, మాటిస్తేనే లోపలి కొస్తాను. వంటింట్లోనే పక్కేసుకు పడుకుంటాను సుమండీ........

[అంటూ లోపలికి వెళుతుంది. సామానుపట్టుకుని కాంతారావు లోపలికి అనుసరిస్తాడు. మళ్ళీ వొచ్చి, పైకివెళ్ళి, పెట్టెపట్టుకు లోపలికి వెళుతూవుంటాడు. ఇంతలో రావుగారూ అంటూ, లోపలికొస్తాడు వెంకటేశ్వర్లు. నన్నంగా బక్కపలచగావుంటాడు]

వెంకటేశ్వర్లు: Excuse me Sir, క్షమించాలి. లోపలికి రావచ్చునా?

కాం: (ఇహ చేసేదేమీ లేక) రం....డి.

వెం: (కుర్చీలో కూలబడి) Thanks.... నే ఇలా వొచ్చేసినందుకు మీ రేమీ.... (నసుగుతాడు)

కాం: (సంకోచిస్తూ పెట్టె కిందపెడతాడు)

వెం: క్షమించాలి సార్, మీకు పనిలో అడ్డుతగిలాను. నేను పెట్టె లోపల పెట్టెయ్యనాండి?

కాం: అవసరం లేదు లెండి.

వెం: పోనీండి సార్, నేను కొంచెం ఓచెయ్యి సాయంచెయ్యనా?

కాం: అక్కర్లేదండి, అట్టే బరువులేదు.

వెం: బరువులేదంటారా? నిజంగా నా సహాయం అక్కర్లేదంటారా?

కాం: వొద్దండీ, వొద్దు.

వెం: ఈవూళ్లో ఇదొకటి చాలాచిక్కు సార్. బండివాడు ఒక్కసామానుదింపి మనకి సాయం చేసి పెట్టడుకద! మన వూళ్లో జట్కాబండివాడు చూడండి. రైలుదిగి, టిక్కట్టిచ్చి బయట పడకుండానే, మన్ని పట్టేసుకు, చేతులోవున్న సామాను అపహంగా లాగేసుకు, బండిలో మన్నికూడా మోసేసుకు బండిలో పారేస్తాడు. ఆ సామానంతా మళ్ళీ యింట్లోచేరుస్తాడు. ఇక్కడీ సామాను మనమే మోసుకోవాలి.

కాం: [లోపలికి వెళ్లిపోవాలని ఆత్రుతగావుంది. కాని ఇతన్ని వొదిలించుకోడ మెలానోతెలీక] అవునవును.

వెం: అయితే నా సాయం అవసరమే లేదంటారు.... పోనీలెండి గాని, మీతో కొంచెం మాట్లాడాలిసార్, మీకేం అభ్యంతరం కాకపోతేను.

కాం: అలాగే అలాగే.

వెం: కూచుంటారా?

కాం: [కాంతారావు ఏమిచెయ్యాలోతెలీక, కుర్చీలో కూలబడతాడు. వెంటనే లేచి] ఇది లోపలపెట్టేసి వొస్తాను.

వెం: పెట్టేసి వొస్తారా? అలాగేసార్. నాకు అవతల మించిపోయే పనేంలేదు. ఊ(. మీ పని చూసుకునేరండి. నే వుంటా నిక్కడ.

కాం: ఇప్పుడే వొస్తా. (అని లోపలికి వెళతాడు)

(పైనించి కాంతారావుగారూ అని బాపయ్య కేకేస్తాడు.)

వెం: తలుపు తీసేవుంది.

[బాపయ్య, రామారావు లోపలికొస్తారు]

రామారావు: (బాపయ్యచెవిలో) వీడప్పుడే ఎక్కణ్ణించో పనికట్టి వొచ్చేశాడే.

బాపయ్య: పనికట్టడాని కేముందిరా. వొద్దు వొద్దంటూంటే నువ్వు సుబ్బాయమ్మగారి మొగుడితో వూ పేశావు. అవిడది Information and Broadcasting deptకద!

ఈ పాటికి వూరంతా కబురు అందేవుంటుంది. నాకు కొంచెం అనుమానంగానే వుంది, అవిడనే చూస్తామేమో ఇక్కడని. అవిడకి ఇలాటి తగాదాల్లో తీర్పులుచెప్పడం భలే సరదా, తెలుసుగా.

వెం: వొచ్చి కూచుంటారా! కాంతారావుగా రిప్పుడే వొస్తారు.

బాప: మీకు కాంతారావుగారి దర్శనం అప్పుడే అయిందా ఏమిటి?

వెం: నే వొచ్చేనరికి వా రిక్కడే వున్నారు. ఎవరో చుట్టా లొచ్చారండి వారింటికి!

బాప: (రామారావుతో) బ్లిట్జుక్రీడ్‌లాగ జరిగిపోతోందే వ్యవహారం. (వెంక॥తో) వాడు పరాసరి ఇక్కడికే వొచ్చేశాడన్నమాట.

రామా: మీరతన్ని చూశారన్నమాట.

వెం: ఎందుకు చూళ్లేదు.

రామా: మాట్లాడారా?

వెం: ఓ. ఇప్పుడే వొస్తానని లోపలికెళ్లారు.

కాం: ఎలావున్నాడు, గడ్డాలూ మీసాలూ వున్నయ్యా? సూట్లూబూటూ వేశాడా?

వెం: గడ్డం పెంచడం ప్రారంభించారాఏమిటి కాంతారావుగారు! ఎప్పట్నించీ?

బా: కాంతారావు కాదండీ - ఆ వొచ్చినాయన - చుట్టరికం ఎలాచెప్పాలి! వారే రామం. ఈ బంధుత్వానికి తెలుగు పేరున్నట్టు లేదేమిట్రా. ఇంగ్లీషులో అయితే co-husband అనెయ్యొచ్చును.

రామా: ఇదివరకు మనకి వెధవపెళ్ళిళ్లూ, డైవోర్సులూ లేకపోబట్టి ఈరకం బంధుత్వానికి అవకాశం లేకపోయింది. ఇప్పుడు మనకీ అన్నీ సంక్రమించాయి కనుక ఏదో పేరుపెట్టాలి. తోడికోడల్లాగ, తోడి మొగుడంటే బాగుంటుంది.

బా: వోయెస్. మంచిపేరే తట్టిందిరా నీకు. కాని వ్యాకరణం రూల్సుప్రకారం అది తోటి మొగుడనాలేమో. దేనికో సంధి నిత్యమంటారుకాదూ?

రా: వెధవసంధులు. ఇంకా యెవడికి జ్ఞాపకమున్నాయిరా? ఆ తెలుగుమాస్టరుతోటే కొట్టుకుపోయాయి. పెద్దయినతరవాత మనంతణిఖీచేసేవి సంధులుకాదు, పందులూగొందులూను.

బా: నోరుమూసుకో. వార్థి ప్రగళ్భాలూ, నువ్వూను! చేసేవాడికన్న చెల్లదు. (వెంకటేశ్వర్లుతో) ఇంతకీ చెప్పారుకాదు ఆయ నెలావున్నారో.

వెం: నే కాంతారావుగారినే చూశాను. మరెవర్నీ చూడలేదే!

రా: మీరే కాదుటండీ, చుట్టాలొచ్చా రన్నారు. చూడకుండా ఎలాగన్నారు. మహా చూసినట్టు.

వెం: నే వొచ్చేసరికి కాంతారావుగారు ఒక పెట్టెపట్టుకు లోపలి కెళుతున్నారు. అంటే ఎవరో ఇంటికొచ్చారనీ, వారు లోపలికి వెళ్లారనీ, తరవాత ఆ పెట్టె కాంతారావుగారు లోపలికి చేరుస్తున్నారనీ ఊహించాను.

బా: అబ్బ! ఎంత లాజిక్కండీ. గొప్ప డిటెక్టివ్‌లా కనిపెట్టారండీ.

వెం: ఇందాకటినించీ చూస్తున్నాను. మీరేదో నా కర్థంకాని పజిల్సు మాట్లాడుతున్నారు.

బా: పజిల్సేమీలేదు సార్. ఏడీ, కాంతారావు, ఇప్పుడే వొస్తాడన్నారు?

వెం: అనే చెప్పివెళ్లారు మరి! నాకు కొంచెం అవసరమయిన పనుంది. కాంతారావుగారితో మాట్లాడేసి వెళ్ళిపోవాలి. (గట్టిగా) కాంతారావుగారూ, కాంతారావుగారూ....

[మెల్లిగా రేఖ బయటికొస్తుంది.]

బా: ఏరమ్మా, మీ నాన్నగారు? చుట్టాలతో మాట్లాడుతూ కూచున్నారా ఏమిటి?

రేఖ: ఏ చుట్టాలండి?

బా: ఎవరో వొచ్చారన్నారు ఈ వెంకటేశ్వర్లుగారు?

రేఖ: ఎవరూ రాలేదండి!

బా: (వెంకటేశ్వర్లుతో) ఏంబ్రదర్. ఇదేమిటి? డిటెక్టివ్‌గారు తిన్నగా కూపీతీసినట్టు లేదే?


రేఖ: ఏమిటండీ వెంకటేశ్వర్లుగారూ, ఎవరినిచూశారు మీరు?

బా: వెంకటేశ్వర్లుగారి సంగతి నీకుతెలియదా ఏమిటమ్మా. వారు ఎవర్నీ చూడనక్కర్లేదు. వారు విషయాలన్నీ పసికట్టి ఊహించేస్తారు. వెంకటేశ్వర్లుగా రిక్కడి కొచ్చేసరికి, మీ నాన్నగారు ఏదో పెట్టెపట్టుకు వున్నారుట. దాంతో మీ యింటికి ఎవరో బంధువులొచ్చారని నిర్ధారణ చేశారు.

రేఖ: అదాండి? అది మా పిన్ని పెట్టె.

రా: పిన్నిగా రెక్కడికన్నా వెళ్ళితుపోన్నారా ఏమిటండి, అప్పుడే?

రేఖ: లేదండి, ప్రస్తుతం ఈ రాత్రికి ప్రయాణం ఆగిపోయింది.



" ఇంకా ఎందుకోయి ముక్కుతావు? పెట్టె నా నెత్తినే పెట్టుకుంటినిగా."

---

వెం: సార్, అడిగానని మరేమీ అనుకోకండి! సంగతేమిటి? అంతా అగమ్యగోచరంగా వుందిసార్.

బా: అదేమిటి బ్రదర్, అలా కాళ్లజాపేస్తే ఎలా? పనికట్టు! కూపీతియ్యి!!

[అంటూ వుండగా మెల్లిగా కాంతారావు లోపలి కొస్తాడు. మొహంకొంచెం తేటగా వుంటుంది]

కాంతారావు: మీ పిన్ని పిలుస్తోంది వెళ్ళు రేఖా.

రేఖ: నాన్నా, వెంకటేశ్వర్లుగారు ఓ పెద్ద డిటెక్టివుట నాన్నా. ఆ పెద్దమనిషి ఎవరో ఈయన కనిపెట్టగలరేమో అడుగు.

కాం: అలాగేలే. నువ్వెళ్ళు.

[రేఖ లోపలికి వెళ్లిపోతుంది. ఒక్క క్షణం నిశ్శబ్దం]

వెం: Excuse me, సార్. అడిగానని ఏమీ అనుకోరుకద? ఆ పెద్దమనిషిని ఎవరినో కనిపెట్టా లంటున్నారేమిటి?

కాంతారావు: అబ్బే. ఏం లేదండి.

వెం: చెప్పండి సార్, ఎవరికోసమన్నా వాకబుచేసిపెట్టాలంటే చేద్దాం. రోజూ వ్యాపారానికి లక్షచోట్ల తిరుగుతాం. ఎక్కడో అక్కడ తటస్థపడొచ్చు.

కాం: (సంకోచిస్తూ) ఇందాకా మా యింటికి ఓ పెద్దమని షొచ్చాడు. ఆయన్ని మళ్ళీ కలుసుకోవాలని. అంతకంటే మరేంలేదు.

రా: వెంకటేశ్వర్లుగారికి అదేం కష్టమయిన పనికాదండి.

వెం: తెలుగువాడేనా?

కాం: ఆ.

వెం: ఇక్కడివాడేనా? ఊరో వూరినించొచ్చాడా?

కాం: ఇక్కడివాడుకాదు. మొన్నే మనదేశంనించి వొచ్చానన్నాడు.

వెం: పేరేమిటి?

కాం: తెలీదండి.

వెం: అరెరే. పేరు తెలీదా? అయితే కనుక్కోడం కొంచెం కష్టమేనే. అయితే ఏంలెండి ... మనిషి ఆకారం అదీ వర్ణించగలరా?

కాం: వర్ణించగల ననుకుంటా.

వెం: ఇలాటిమనిషిని పట్టుకోవాలంటే, అనుకోడాలు పనికిరావు సుమండీ. అంతా ఎక్జాక్టుగా వుండాలి. జ్ఞాపకంచేసుకు చెప్పండి.

కాం: పెద్దవాడే- నలభై, యాభయి ఏళ్ళుంటాయి. మామూలు చొక్కా- కోటుతొడుక్కుని, ఖండువా వేసుకొన్నాడనుకుంటా.... కాలికి ఆకుచెప్పు లున్నట్టున్నాయి. మామూలు మన పల్లెటూరివాళ్ళందరూ వున్నట్టేవున్నాయి. చెప్పులు కిర్రువి.

వెం: ఈ వర్ణన చాలదే, మనిషిని పట్టుకోవడానికి; ఇంకా వివరాలు కావాలిసార్. మీకు జ్ఞాపకం వుండక పోవచ్చు. నేను అడుగుతాను చెబుతారా సార్. మరే మనుకోకండేం........ ఆ మనిషి పొడుగెంత?

వెం: పొడుగు....భారీ మనిషే.

వెం Excuse me. సార్. భారీమనిషంటేకుదరదు. ఉజ్జాయింపు కొలతచెప్పాలి. అయిదడుగులా. అయిదడుగుల రెండంగుళాలా, నాలుగంగుళాలా?

కాం: చెప్పలేనండి!

వెం: పోనీ ముక్కు?

కాం: మామూలు ముక్కే. మరీ పెద్దదీగాదు చిన్నదీగాదు.

వెం: క్షమించాలి. ముక్కు, ఆకారం వివరాలు.... ఆయన్ని పట్టడానికి చాలవండి. మరో దారి తొక్కాలి. పోనీ ఆయన ఖండువాగాని, జేబురుమాలుగాని ఇక్కడమరిచిపోయి వెళ్ళిపోలేదా, సార్.

కాం: మరిచిపోయినట్టు లేదే.

వెం: ఈ కేసు కొంత డిఫికల్టుగానే వుంది.... ఊఁ. వేలిముద్రలేమైనా కనిపిస్తాయా?.... ఏమండీ. వారు టీగాని, మంచినీళ్లుగాని ఏమయినా తాగారా ఇక్కడ.

కాం: వ్యవధేదండి....నే రాకముందేమన్నా ....కనుక్కొస్తాను ఇప్పుడే... (అని లోపలి కెళతాడు)

వెం: వా రిక్కడ మంచినీళ్ళుగాని, టీగాని తాగారనుకోండి. చేతిముద్రలు గ్లాసుమీద పడ్డాని కవకాశ మున్నాయి. ఆ విధంగా పెద్దమనిషి ఆచోకీ తియ్యొచ్చు. ఏమంటారు?

బా: బాగుందండీ బాగుంది. గిరీశంగారన్నట్టు మన ప్రతి ఆచారానికీ ఏదో ఓ ప్రయోజనం సాధించి తీరొచ్చు. ఎవరన్నా అతిథిరాగానే కాస్త మంచితీర్థం ఇవ్వడం ఆచారం మన

వూళ్ళలో. ఇక్కడ టీసీళ్ళు పోస్తారు. ఏమయితేనేం, అది మీరు వేలిముద్దర్లు కనుక్కోడానికి ఉపయోగిస్తుంది.

రా: ఏమండీ, ఆయన చెప్పులగుర్తులుకూడా పరిశోధించకూడదూ? చూసుకుంటూ వెళితే, ఆయ నింటిదాకా వెళతామేమో.

వెం: ఈ తారురోడ్లమీద అది అట్టే లాభంలేదండీ! కాని చెప్పుగుర్తు దొరికితే, దాన్ని బట్టి పాదంకొలతలూ, దానిద్వారా, మనిషిఒడ్డూ, పొడుగూ, కనిపెట్టెయ్యవచ్చు లెండి. చూస్తాను (అని నేలమీదికి వొంగి పరీక్ష చేసుకుంటూ బయటికి వెళ్లిపోతాడు.)

రా: వీడికి వెఱ్ఱా ఏమిట్రా! ఏదో డిటెక్టివ్‌గారూ అంటే, నిజమే ననుకుని చెప్పుల తణికీకి బయలుదేరాడేం?

బా: డిటెక్టివ్ నవలలు చదివి, గొప్ప డిటెక్టివ్ అయిపోయా ననుకున్న మనుష్యుల్లో వీ డొకడూ. తనకి పద్ధతులన్నీ తెలుసునంటాడు. ఈ మధ్య అసలు ప్రయివేటు డిటెక్టివ్ ఏజెన్సీ పెడతానని తిరిగేవాడు. ఈ వూళ్ళో దాని కెంతయినా అవకాశముందిట. పెట్టుబడి ఒక్కటే తక్కువని, అందర్నీ తడిమేవాడు.

రా: వీడి వాలకంచూస్తే, కాంతారావుకి సంభవించిన విపత్తేమీ తెలిసినట్టు లేదే?

బా: నాకూ ఆ అనుమానం లేకపోలేదు!

రా: మరి ఎందు కొచ్చినట్టు ఈ సమయానికి?

బా: అప్పడగడాని కొచ్చాడేమో. వాడలా అడిగినవాళ్ళ నడక్కుండా అప్పులుచేసుకునే బతుకు తున్నాడులే ఈ వూళ్లో.

[అంటూ వుంటే వెంకటేశ్వర్లు లోపలికి తిరిగొస్తాడు.]

రా: ఏమండీ, డిటెక్టివ్‌గారూ, ఏమన్నా ఫలించిందా?

వెం: ఈమధ్య వర్షాలేమీ లేకపోవటంవల్ల ఎక్కడా చెప్పుముద్రలు పడినట్టు లేదండీ.

బా: సరే. ఇహ వేలిముద్దర్లొక్కటే మీకు ఆధారం మిగిలాయన్న మాట.

రా: ఏమండీ, మీకు ఈ కాలిముద్దర్లూ, వేలిముద్దర్లూ ఎందు కసలు. అలా ఒక్కమాటు మనస్సు కేంద్రీకరించి, ఆలోచించేసి "దొరికాడు.... ఫలానిచోటున్నాడు" అన్లేరూ?

బా: ఎందుకన్లేరురా? వారు తలుచుకుంటే. అనవసరంగా బుర్ర అంత పాడు చేసుకోడ మెందుకని ఈ వేలి ముద్దర్లూ, కాలి ముద్దర్లూ అని తంటాలు పడుతున్నారు కాని!

వెం: [వాళ్ళిద్దరూ తనని వేళాకోళం చేస్తున్నారని గ్రహించాడు కాని ఏంచేస్తాడు. వాళ్లిద్దరూ, తను ఒక్కడూ. ఒక్కమాటు ఇద్దరికేసీ కాస్తకోపంగా చూసి] కాంతారావుగా రింకా రారేం?

బా: మీ కేమన్నా అవతల తొందరపనుంటే చూసుకునేరండి. కాంతారావుగారి సంగతి మీ కంత బాగా తెలీదుకాబోలు. ఆయన ఓమాటు లోపలికెళితే అంత సుళువుగా బయటపడే మనిషికాదు లెండి.

వెం: మీకు వారితో చాలా పనుందా?

బా: అబ్బే! మాకేమీ పనిలేదండీ. అంచేతే, ఇక్కడ ఆయనొచ్చేదాక కూచుంటాము; తెల్లారేదాకానయినా సరే!

వెం: అయితే నే వెళ్ళి పనిచూసుకు మళ్ళా వొస్తాను. క్షమించాలి. కాంతారావుగారిని మరేమీ అనుకోవొద్దని చెబుతారా, if you dont mind.

బా: తప్పకుండా చెబుతాంసార్, మీకు అవసరమైన పనుండి వెళ్ళిపోతామంటే అమాత్రం సహాయం చెయ్యమా? మీకోసం చూడమని కాంతారావుతో చెబుతాను లెండి.

వెం: ఇలా చెప్పమన్నానని, మీరు మరేమీ అనుకోరుగద!

బా: ఏమీ అనుకోము; మీరు నిశ్చింతగా వెళ్ళొచ్చు.

వెం: అలానే. వెళ్ళిరానా సార్ (అని మెల్లిగా బయటికి వెళ్లిపోతాడు)

రా: [వెంకటేశ్వర్లు ఇంకా వెళుతూవుండగానే] కాళ్ళీడ్చుకుండా కొంచెం గబగబా నడవండి సార్, if you please...మరే మనుకోకండేం తమర్నిత్వరగా దయచెయ్య మన్నామని!.... వొరే, అసలు ఈ పెద్దమనిషెవరో తెలీదంటున్నారుగదా, మరి ఆయన చెప్పిన మాట నమ్మడంఎలాగరా? కాంతారావుని బెదిరించి ఏమన్నా కొట్టెయ్యడానికి వొచ్చాడంటావా?

బా: ఎవరీ పెద్దమనిషి? ఏమో. అభ్యాగత స్వయంవిష్ణుః అన్నారు. శ్రీమన్నారాయణుడే ఆ పెద్దమనిషిరూపంలో కాంతారావుని పరీక్షించాలని వొచ్చాడో ఏమో. భగవంతుడు ఈ కాంతారావునే ఎందుకు పరీక్షించాలంటావేమో, భగవంతుణ్ణి, మన మెవరం ఎందుకూ అని అయన చేష్టల్ని ప్రశ్నించడానికీ? ఏ భక్తుడిమీద ఏ క్షణాన్ని ఆయన కరుణాకటాక్ష వీక్షణం ప్రసరిస్తుందో. కనకనే అన్నారు భక్తులు "జగదీశు మాయలను వర్ణించుటకు నిల నెవ్వారి తరమౌను."

రా: అబ్బ- వు డరా, మోతాదుసడిన వాడిలాగ నీ ధోరణీ నువ్వూను.

[అంటూవుంటే కాంతారావు లోపలి కొస్తాడు]

కాం: ఆ వొచ్చిన పెద్దమనిషి, మంచినీళ్లూ, టీ ఏమీ పుచ్చుకోలేదట, ఏరీ, ఆయన వెళ్ళిపోయాడా ఏమిటి?

రా: ఎవరూ? వెంకటేశ్వర్లుగారా?

కాం: అవును ఏదో పనుందన్నారు నాతోటి.

రా: వాడికున్నదల్లా ఒక్కటేపని, అప్పుచ్చుకోడం. ఉన్నబాధలు చాలక, నీకు ఈ బాధ కూడా ఎందుకని, నువ్వూ తెల్లవారేదాకా రావనిచెప్పి, వాణ్ణి భేజారెత్తించి పంపించేశాంలే.

బా: బ్రదర్. మేమిలావచ్చి కూచున్నామని నువ్వేమీ అనుకోకేం. ఇందాకా నిన్ను ఆటకి పిలుచుకుపోదామనొచ్చేసరికి అప్పుడే ఆ పెద్దమనిషొచ్చి వెళ్ళడం నిన్ను వెంటనే డిస్టర్బు చెయ్యడ మెందుకని వెళ్ళిపోయాం కాని, నువ్విలా కష్టంలో పడిపోతే అక్కడ పేకాడ్డానికి ఆలోచన ఏంకుదురుతుంది చెప్పు? ఏమైనా నీకు సహాయం కావలసుంటుందేమో నని ఇలా మళ్ళివొచ్చేశాం. నీ కేమైనా కష్టంగావుంటే....

కాం: నా మీద అభిమానముండబట్టి వొచ్చారుగాని....

బా: రాకేం చేస్తాం చెప్పు. అందరికీ వొస్తూవుంటాయి కష్టాలు. అవసరానికి ఆదుకోకపోతే ఎందుకు చెప్పు. మా కసలు ఈ పెద్దమనిషి సంగతంతా అనుమానంగా వుంది. ఎవడో నిన్ను బెదిరించి డబ్బు కొట్టెయ్యాలని ఎత్తేశాడా అనిపిస్తోంది. అఁ. తొందరపడి ఏమన్నా చేసేసేవు. మరేం భయంలేదులే. ఈ వూళ్ళో తిమ్మిని. బ్రహ్మినిచేసేసే ప్లీడర్లున్నారు. ఏడుచింతల సోమయాజులే వొచ్చి నిజంగా కోర్టులో నించున్నా వాడుకాదని సాక్ష్యం చెప్పించేసి. గ్రంథం నడిపించెయ్యగల్రు. ఊ.... ఆ పెద్దమనిషి మళ్ళీఏదో కబురు చేరేసి సొమ్ము కొట్టెయ్యాలని వొస్తాడులే ఈ చుట్టుపక్కలకి. ఈమాటు కనిపిస్తేమాత్రం పోనివ్వకు. పిలక ఎక్కపీకేద్దాం. తరువాత ఇంకోసంగతి. ఇది పదిమంది నోళ్ళలోనూ పడనివ్వకు - ఏమంటావు. అనవసరంగా తలోడూ, తలోటీ అంటాడు. ఆ వెంకటేశ్వర్లుగాడికేమీ అర్థం కాలేదనుకో. ఇహ మేమిద్దరం. మరో చీమకూ్కడా తెలియనివ్వం. ఊ. మేం పోతాం. నువ్వూపోయి పడుకో. పిన్నిగారిని మరేమీ గాభరాపడొద్దని ధైర్యం చెప్పు.... ఈ రాత్రికి మీరేం గాభరాపడకండి. రేపొద్దున్నే వొచ్చి. ఏంచెయ్యాలో ఆలోచిస్తాం మళ్ళీ.... కొంచెం మంచి పిల్లిస్తారా ఏమిటి. తాగిపోతాం.

కాం: అలాగే (అని నాలుగడుగులు ముందుకేసి) మీ సాయానికి కృతజ్ఞుణ్ణి.

బా: అరే బ్రదర్. ఇందులో కృతజ్ఞత కేముంది.

[కాంతారావు లోపలి కెళ్ళిపోతాడు]

రా: పెద్దమనిషి నిజంగా వొస్తాడంటావురా మళ్ళీ ?

బా: ఏమో. వాడు నిజంగా వొచ్చినా రాకపోయినా, వాడు మళ్ళీవొస్తాడు. పట్టుకుని పిలక సాగదీసేస్తానంటే కాంతారావు కసింత సంతోషిస్తాడని అన్నాను అంతే.

రా: నీ వుద్దేశం అసలు ఏమిటిరా చెప్పు. ఇదంతా కాంతారావుని వొట్టినే ఏడిపించడానికి ఎవరైనా చేశారంటావా, లేకపోతే....

బా: వారే సోదిఅడిగితే తెలుస్తుందిరా, ఈ పెద్దమనిషి ఎవరో ఆయ నెప్పుడన్నా మనకి దర్శన మిస్తాడేమోను.

[బయటనించి కిర్రుచెప్పుల ధ్వని. పెద్దమనిషి తొంగిచూసి, కొత్తవాళ్ళిద్దరుండడం చూసి మళ్ళీవెనక్కి అడుగేస్తాడు. చెప్పులు కిర్రుమంటాయి]

రా: కిర్రు చెప్పులు. అడుగో. పెద్దమనిషి.

బా: [మోకరించి] వొచ్చారా ? మమ్మల్ని అనుగ్రహించడానికి సాక్షాత్కరించారా ?

పెద్దమనిషి: (గాభరాపడుతూ) కాంతారావుగారూ....

బా: లోపలున్నారు, పిలుచుకొద్దునా ?

పెద్ద: [కొంచెం లోపలికొచ్చి] వొద్దులెండి. వొద్దులెండి. వారితో ఇందాకా, మిగిలిన సంగతికాస్తా చెప్పేద్దామంటే వారు విన లేదు. ఏదో కళవళపడినట్టున్నారు. చూడండి. మధ్యలో ఆపెయ్యడంవల్ల వారికి, అతనింకా బతికే వున్నాడనిపిస్తుంది ?

రా: ఎవరు బతికున్నాడనిపిస్తుంది.

పె: అతనే. అతని పేరేమిటి ? పది పన్నెండేళ్ళుగా దేశాంతరం పోయాడే....

రా: ఏడుచింతల సోమయాజులా ?

పె: ఊఁ - యేమన్నారూ? ఏడుచింతల సోమయాజులుకాదూ! అవునవును. ఈ పేర్లు చూచారా, అప్పుడప్పుడు నోట్లో ఆడుతూనేవుంటాయిగాని పైకిరావు.

రా: అది సరే ఇప్పుడు ఏమంటారు మళ్లీ. ఆ సోమయాజులు బతికున్నాడా, లేదా?

పె: ఆ సంగతే చెబుదామనొచ్చాను బాబూ. ఆ సోమయాజులు.... సోమయాజులేనా? ఊఁ.... అతను నాతోకనిపించి, మాట్లాడాడా....అప్పుడంతా బాగానే వున్నాడనుకున్నా కాని, ఓ అరగంటలో పట్టుకున్నాయండి పాపం, వాంతులు. ఒకటే వాంతులు. ఒకటే వాంతులు. ఆ రైల్లో ఏమన్నా మందూ, వైద్యుడూ దొరుకుతాడు కనుకనా వెంటనే.... ఏదో స్టేషను రాగానే దింపి మందిప్పించొచ్చుకదా అనుకున్నాము. ఏదీ స్టేషను వొచ్చేసరికి, కాళ్లూచేతులూ చల్లబడి పోయాయి. మరోనిమిషంలో ప్రాణమే పోయింది.

రా: పోయాడూ వాడు?

పె: పోయాడండి పాపం! మాయావిలాసం అంటే మరేమిటి చెప్పండి. పది పన్నెండేళ్ళయిన తరవాత తెలివొచ్చి, మళ్ళీయింటికి పోవాలని బయలుదేరడ మేమిటి? మధ్య దారిలో మహామారొచ్చి ఎత్తుకుపోవడ మేమిటి?

బా: చచ్చిపోయా డనుకున్న ఏడుచింతల సోమయాజులు బతికొచ్చి, మళ్ళీ చచ్చిపోయాడంటారు. ఏమీ సందేహంలేదూ ఈ చావువిషయమై?

పె: ఏమీ సందేహం లేదండి. అనాథప్రేత సంస్కారేణ కోటియజ్ఞఫలం లభేత్ అన్నారు. అందులో మన తెలుగువాడుఅని, అంత్యక్రియలన్నీ నేనేచేసి బయలుదేరానండి ఆపూర్నించి.

బా: శవాన్ని కూడా తగలెట్టించేశా నంటారు? ఇహ పరకాయప్రవేశం చేసొస్తే తప్ప సోమయాజులు, దేహంతో రాలేదంటారు?

పె: చిత్తం....

రా: కేకేసి చెప్పరా, కాంతారావుకి.

పె: నే వెళ్ళొస్తానండి.

రా: వుండండుండండి. మీ నోటితో మీరే చెపుదురుగాని....

పె: పొద్దుపోయిందండి అప్పుడేమ. ఈ వూరికి నే నసలే కొత్త....వెళ్ళొస్తాను....వారితో ఈ సంగతి చెప్పండిబాబూ.... ఏం చుట్టరికమో ఏమో గాభరాపడ్డారు.

బా: దగ్గిర చుట్టరికమే లెండి. భార్యా ప్రథమభర్త.

పె: (అర్థం చేసుకోకుండానే) అలాగా? వెళ్లొస్తామరి (అడుగువేస్తూ) ఏం చుట్టం?.... భార్యా.... ప్రథమ (అర్థంకానట్టు చేతులు అటూయిటూ తిప్పి) సోమయాజులు.... కాంతారావుగారి....అతనిపేరు సోమయాజులేనా.... [అయనకి ఏ సంగతీ తేలదు. ఈ లోపుగా బాపయ్య కాంతారావుగారోయ్ అని కేకేస్తాడు. దాంతో పెద్దమనిషి గొణుక్కుంటూ గబ గబ అడుగులేసుకు వెళ్లిపోతాడు].

బా: కాంతారావుగారూ....

[కాంతారావు గుమ్మందగ్గి రొచ్చి నించుంటాడు]

బా: విన్నారా శుభవార్త! ఆ పెద్దమనిషి ఇప్పుడే వొచ్చి చెప్పి వెళ్లాడు. ఏడుచింతల సోమయాజులు నిజంగా చచ్చిపోయాడు.

(సెప్టంబరు సంచికలో మూడో అంకంతో పూర్తి అవుతుంది)



## జీవితమునకు క్రొత్తకాంతి!

పండిత డి. గోపాలాచార్యులవారి

# జీవామృతము

ఈ ఆనందసంసారం ఒక ఆరోగ్యచిత్రం. జీవామృతము బలవర్ధకౌషధం. స్త్రీలూ, పురుషులూ సేవింపవచ్చును. ఇది జీవితమునకు క్రొత్త కాంతి నిచ్చును. దేహమునకు చురుకుదనమునిచ్చి దేదీప్యమైన ఆరోగ్యమును ప్రసాదించును.

ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు 17

# గ్రైప్ సిరప్




గ్రైప్ సిరప్ చంటిపిల్లలకు, శిశువులకు బాధలేని, హాయి అయిన విరేచనకారి. పిల్లల ఆరోగ్యాన్ని గురించి కాస్త అనుమానం తగిలితే, ఒక మోతాదు గ్రైప్ సిరప్ యివ్వండి.

ఐ. టి. యల్. ప్రాడక్టు

తయారుచేయువారు:

మైసూరు ఇండస్ట్రియల్ అండ్ టెస్టింగ్ లెబొరేటరీ లిమిటెడ్.
మల్లేశ్వరం, బెంగుళూరు



## ఏడ్చు వారిని నవ్వించును



సెల్లింగ్ ఏజంట్లు: బెస్ట్ అండ్ కో. లిమిటెడ్, P. B. నెం. 63, మద్రాసు.



నాజూకుకు..
నాణ్యానికి..
మన్నికకు..

ప్రసిద్ధిగాంచిన పింగాణీ వస్తువులు.

ఇండియా సిరామిక్స్ లిమిటెడ్

నెల్లూరు :: కాళహస్తి : మద్రాసు

మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే
పాత్రుడు గారి
బాల సంజీవిని
యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమవి మీకే తెలియగలదు.
వివరములకు:
డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,
11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకొలం.



Printed and Published by B. Nagi Reddy at B. N. K. Press, Madras 1.
Founder : B. N. Gupta - Editor : Chakrapani.